ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం | కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

ఆదివారం 13 సెప్టెంబర్ 2026 | సంపుటి: 28 సంచిక: 152
Sunday 13 Septembar 2026 | Vol.No 28 Issue No .152
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in



# రేపే గణేష్ చతుర్థి – తెలంగాణ అంతటా ఒకే కోలాహలం

- బొజ్జ గణపయ్యకు ఘన స్వాగతం..!
- మండపాలు ముస్తాబు.. మోగనున్న భక్తి డప్పులు..!

**తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 12:** ఒక్క రోజు.. ఇంకొక్క రోజే..! విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే ఆ లంబోదరుడు.. ఏకదంతుడు.. గజాననుడు మన ఇంటికి రానున్నాడు. రేపే వినాయక చవితి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, యావత్ దేశంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండగల్లో ఇది ఒకటి. ఈ పండగ కోసం తెలంగాణ రాష్ట్రం యావత్తు కొత్త పెళ్లి కూతురిలా ముస్తాబైంది. హైదరాబాద్ లోని ఖైరతాబాద్ మహా గణపతి దగ్గర నుంచి మొదలుకుంటే, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లోని ప్రతి పల్లె, ప్రతి పట్టణం వరకు వీధి వీధినా మండపాలు వెలిశాయి. యువజన సంఘాలు నెల రోజులుగా రాత్రింబవళ్లు శ్రమించి తమ మండపాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఎక్కడ చూసినా విద్యుత్ దీపాల కాంతులు, పూల తోరణాలు, భారీ ఫ్లెక్సీలు, మైకుల్లో వినాయక నామస్మరణతో వాతావరణమంతా భక్తిమయమైంది.

*వినాయక చవితి అంటే ఏమిటి? ఎందుకు జరుపుకుంటారు? – ఒక పూర్తి కథ*

చాలా మందికి తెలిసింది వినాయక చవితి ఒక పండగ అని. కానీ దాని వెనుక ఉన్న అసలు కథ ఏమిటి?

పురాణాల ప్రకారం భాద్రపద మాసం శుక్ల పక్ష చవితి రోజున పార్వతీదేవి తన శరీర మలం నుండి ఒక బాలుడిని సృష్టించింది. తాను స్నానానికి వెళ్తూ ఆ బాలుడిని ద్వారపాలకుడిగా ఉంచింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన పరమశివుడిని ఆ బాలుడు లోపలికి వెళ్లనివ్వలేదు. దీంతో ఆగ్రహించిన శివుడు ఆ బాలుడి తలను ఖండించాడు. విషయం తెలుసుకున్న పార్వతీదేవి దుఃఖంతో విలపించింది. ఆమెను ఓదార్చేందుకు శివుడు తన గణాలను ఉత్తర దిక్కుగా వెళ్లి మొదట కనిపించిన ప్రాణి తలను మిగతా2లో..

# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

- ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు
- పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22–ఏ నిషేధిత భూములపై మిగతా2లో..



# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష



హైదారాబాద్, సెప్టెంబర్ 12 : వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. “స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం మిగతా2లో..

# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు
- ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ మిగతా2లో..

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి: కిషన్ రెడ్డి

- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి
- ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి మిగతా2లో..
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి



# కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

- మెట్రో ప్రయాణికులకు శుభవార్త
- 600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు
- రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం



హైదారాబాద్, సెప్టెంబర్ 12 : హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం మందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మిగతా2లో..

# సుద్దాలకు ‘తెలంగాణ తెలుగు తేజం’ పురస్కారం

- సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం
- ఈనెల 22న కరీంనగర్‌లో పురస్కారం ప్రదానం



హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలుగు సాహిత్య రంగంలో ప్రముఖ కవి, జాతీయ స్థాయి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్మాత్మక గౌరవం దక్కింది. బుర్ర నర్సమ్మ–లింగారెడ్డి స్మారక తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కారం–2026కు ఆయనను ఎంపిక చేశారు. తెలుగు భాషా సంరక్షణ సంఘం–తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈసారి సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. పురస్కార కమిటీ మిగతా2లో..

# 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

- నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్..
- త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల




హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( టీజీపీఎస్సీ ) బిగ్ అలర్ట్ ఇచ్చింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 2022లో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తం 544 ఖాళీల భర్తీకి ఇచ్చిన ఈ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు కమిషన్ వెబ్‌నోట్ ద్వారా వెల్లడించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022 డిసెంబర్ 31వ తేదీన కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 544 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. మిగతా2లో.. అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై

# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ...

- తెలంగాణ భవన్‌లో ‘నమూనా అసెంబ్లీ’ నిర్వహణ
- కొండా సురేఖ తొలగింపుపై తలసాని తీవ్ర సెటైర్లు
- సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగానూ వ్యంగ్యాస్త్రాలు
- 100 రోజుల హామీల అమలుపైనా చురకలు

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ‘మాక్ అసెంబ్లీ’ నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మిగతా2లో..



# సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

- చంద్రబాబు సారథ్యంలో ఏపీ సురక్షితం
- అమరావతి బయో వ్యాలీకి కేంద్రం అండ
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడి



రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మిగతా2లో..

# భవిష్యత్ టెక్నాలజీ హబ్ గా అమరావతి

- ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం
- జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- 49 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు
- విజయవాడ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన




వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మిగతా2లో..

# ‘ఢీ-10’ డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్

## లైంగికంగా వేధించాడని ఓ యువతి ఫిర్యాదు



హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ‘ఢీ–10’ డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మిగతా2లో..

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక



## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ...

ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

## 'ఢీ-10' డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్

చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

## కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

మెట్రో ప్రయాణికులు ఎప్పటినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కో రైల్లో 2 వేల మంది ప్రయాణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టనుంది.తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కో రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణికులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు.ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట-రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త రైళ్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.

## సుద్దాలకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం

ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. తెలుగు భాష, సాహిత్యానికి విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో తెలంగాణ తెలుగు తేజం పురస్కారాన్ని ఏటా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కవిగా, సినీ గేయ రచయితగా సుద్దాల అశోక్ తేజ తెలుగు భాషకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్య, సినీ రచనలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజకు పురస్కారాన్ని అందజేయనున్నారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టిబిడ్డలు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పురస్కార కమిటీ ప్రతినిధులు తెలిపారు. భాషా పరిరక్షణ, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న రచయితలు, కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పురస్కారాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సుద్దాల అశోక్ తేజ తెలుగు సాహిత్యంతో పాటు సినీ గేయ రచయితగా కూడా తనదైన ముద్ర వేశారు. సామాజిక అంశాలు, తెలంగాణ జీవన విధానం, ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించే అనేక రచనలకు ఆయన కలం అందించారు. ఆయన సాహిత్య, సినీ ప్రస్థానాన్ని గుర్తిస్తూ తెలంగాణ తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్‌లో ఈ నెల 22వ తేదీన జరగనున్న పురస్కార ప్రదానోత్సవంతో సుద్దాల అశోక్ తేజకు ఈ గౌరవం అధికారికంగా అందనుంది. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, భాషాభిమానులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది.

# రేపే గణేష్ చతుర్థి – తెలంగాణ అంతటా ఒకే కోలాహలం

తీసుకురమ్మని ఆదేశించాడు. గణాలు ఏనుగు తలను తీసుకురాగా, దానిని ఆ బాలుడికి అతికించి తిరిగి ప్రాణం పోశాడు. అప్పటి నుంచి అతడు గజాననుడిగా, గణాలకు అధిపతి అయిన గణపతిగా మారాడు. బ్రహ్మదేవుడు అతడికి విఘ్నాలను తొలగించే శక్తిని ప్రసాదించి, ఏ పూజలోనైనా తొలి పూజ అందుకునే వరాన్ని ఇచ్చాడు. అందుకే మనం ఏ పని మొదలుపెట్టినా "శ్రీ గణేశాయ నమః" అని తలచుకుంటాం. చదువు, ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి, ఇల్లు కట్టడం.. ఏ శుభకార్యమైనా వినాయకుడి పూజతోనే మొదలవుతుంది. ఆయనను పూజిస్తే తెలివితేటలు, విజయం, ఐశ్వర్యం లభిస్తాయని భక్తుల నమ్మకం.

స్వాతంత్ర్య ఉద్యమంతో ముడిపడిన పండగ:
ఈ పండగకు ఒక చారిత్రక కోణం కూడా ఉంది. పూర్వం ఇది ఇంట్లోనే జరుపుకునే పండగ. కానీ 1893లో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ దీనిని బహిరంగ ఉత్సవంగా మార్చారు. బ్రిటిష్ పాలనలో ప్రజలను ఒకే చోటుకు చేర్చి స్వాతంత్ర్య భావనను రగిలించేందుకు ఈ పండగను వేదికగా మార్చారు. అప్పటి నుంచి వినాయక చవితి కేవలం మతపరమైన పండగగా కాకుండా, జాతిని ఏకం చేసే సామాజిక, సాంస్కృతిక పండగగా మారిపోయింది. తెలంగాణలో ఈ సంస్కృతి నేటికీ అలాగే కొనసాగుతోంది.

రేపటి నుంచి 9 రోజుల సంబరం:
రేపు ఉదయం నుంచే భక్తులు తమ ఇళ్లలో, మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పత్రి, 21 రకాల ఆకులు, ఉండ్రాళ్లు, మోదకాలు, పండ్లతో ఘనంగా పూజలు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విజన్ ఆంధ్ర తరపున తెలంగాణ ప్రజలందరికీ ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు - గణపతి బప్పా మోరియా!

# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణలో కొత్త పించన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పించన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికెట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది. అలాగే వితంతువులు భర్త డెత్ సర్టిఫికేట్ సమర్పించాలి. అయితే భర్త చనిపోయి ఎక్కవకాలం అయితే సర్టిఫికేట్ పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఇక గీత, చేనేత, ఫైలిరియా, డయాలసిస్ వర్గాలకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ధృవీకరణ పత్రాలు పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఆ తర్వాత ధృవీకరణ సమయంలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే పింఛన్లకు అర్హత సాధిస్తారు. అధికారులో క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర ఆధారాలను పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం 2.50 లక్షల పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అంతమంది అర్హులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేయనున్నారు. ప్రాధాన్యత వారీగా పూర్తి అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేయనున్నారు. దసరా నుంచి కొత్త ఫించన్లను అందనుడటంతో అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తుది జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదించాక పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

## బాబుతో నడ్డా మర్యాదపూర్వక భేటీ

అమరావతి, సెప్టెంబర్ 12 ద: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సీఎం నివాసానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది.




అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జేపీ నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు, విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేపీ నడ్డా, చంద్రబాబు కలిసి రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల విలువైన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

## 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. అన్ని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన తర్వాత 33/2022 బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తాజాగా టీజీపీఎస్సీ ప్రకటించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో ఈ పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. కొత్త నోటిఫికేషన్‌ను ప్రస్తుత నిబంధనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా రూపొందించే అవకాశం ఉంది. కమిషన్ వెబ్‌నోట్ ప్రకారం.. 2022 డిసెంబర్ 31వ తేదీన జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను తక్షణమే రద్దు చేశారు. 544 ఖాళీలకు సంబంధించిన ఈ నోటిఫికేషన్ ఇక చెల్లుబాటు కాదని అభ్యర్థులు గుర్తించాలని కమిషన్ సూచించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో గతంలో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగదని అభ్యర్థులు గమనించాలి. కొత్త నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులో పేర్కొనే పోస్టుల సంఖ్య, అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానం వంటి వివరాలను అభ్యర్థులు తప్పనిసరిగా పరిశీలించాలి. కొత్త నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ తన వెబ్‌నోట్‌లో పేర్కొంది. దీంతో డిగ్రీ కాలేజీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు కొత్త ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి: కిషన్ రెడ్డి




ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జీఖూ) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఞూఖీ) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం.రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై నడ్డా ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగని అభివర్ణించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ లక్ష్యంతో పనిచేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు ఒక దార్శనికుడని, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలోనూ చంద్రబాబు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన "వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం" అనే మాటను నడ్డా తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ఆ మాటలు నూటికి నూరు శాతం నిజమని, ఆరోగ్యానికి అదే మూల సూత్రమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధులను దూరం చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# భవిష్యత్ టెక్నాలజీ హబ్ గా అమరావతి

జనవరి 1వ తేదీ నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని, ఇది వైద్య రంగంలో ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, తగిన సహకారం అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. శనివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్య శాఖకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీని వారు సందర్శించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు.

గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెట్టింపు చేశారని, కోవిడ్ సమయంలో ప్రపంచానికే వ్యాక్సిన్ అందించి భారత్ సత్తా చాటారని గుర్తుచేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఫార్మా రంగం దేశానికే తలమానికంగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు.ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీఎం సూచించారు. "వంటశాలనే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా" భావించాలని పిలుపునిచ్చారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

అమరావతి గురించి లద్దాఖ్‌లో కూడా చర్చించుకునే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ప్రపంచమంతా అమరావతి వైపు చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, సోము వీర్రాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినప్పుడు సభికులు, వైద్య విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిశాక సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నడ్డాతో కలిసి వేదికపై నుంచే సెల్ఫీ తీసుకుని సభికులను ఉత్సాహపరిచారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# బ్రిక్స్‌కు సరికొత్త దిశ..

ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న సమీకరణల నడుమ భారత్ మరో చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విశ్వశాంతికి, ప్రపంచ మానవాళి సంక్షేమానికి సరికొత్త దిశను నిర్దేశిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ... ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలకమైన సరఫరా వ్యవస్థల పరిరక్షణే లక్ష్యంగా ఈ రెండు రోజుల సదస్సు సాగుతుంది. సవాళ్లతో కూడుకున్న ప్రపంచ పరిస్థితులలో ఒక బలమైన అనుసంధానకర్తగా తన నాయకత్వాన్ని చాటుకునేందుకు భారత్ ముందుకు సాగుతుంది. మరోవైపు ఈ ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం చారిత్రాత్మకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. బ్రిక్స్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో.. ఈ వేదిక ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెడుతోందన్నారు. 20 ఏళ్ల వయసు మానవ జీవితంలో పరిపక్వత, బాధ్యతలు పెరిగే దశకు సంకేతమని.. అదే విధంగా బ్రిక్స్ కూడా తన పరిణతి దశకు చేరుకుందని ప్రధాని వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. ఎవరికీ వ్యతిరేకంగా కాకుండా.. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్నదే బ్రిక్స్ విధానంగా ఉండాలని ఆయన అన్నారు.

సభ్య దేశాల మధ్య ఐక్యత, ఏకాభిప్రాయాన్ని స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగంతో ప్రారంభమైంది. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. ప్రపంచ పాలనలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం, ఆర్థిక సంస్థల్లో మార్పులు వంటి అంశాలపై ప్రధాని మోదీ తన ప్రసంగంలో స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాబోయే 20 ఏళ్లకు బ్రిక్స్ ఒక కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత ప్రజా కేంద్రిత, మానవతా ప్రథమ విధానం ఆధారంగా కొనసాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. సౌలభ్యం, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం తమ ప్రాధాన్యతలని వెల్లడించారు. ప్రపంచ పాలనలో సంస్కరణలకు సంబంధించి సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ రోడ్‌మ్యాప్‌కు ప్రాతినిధ్యం, స్పందన/జవాబుదారీతనం, నియమాల రూపకల్పన అనే మూడు అంశాలు ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. ప్రపంచ వ్యవస్థలో అన్ని దేశాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండాలని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలు మరింత సమగ్రంగా ఉండాలని ఆయన అన్నారు.ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలను ఇకపై వాయిదా వేయకూడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ అంశంపై చర్చలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్దిష్ట కాలపరిమితి, స్పష్టమైన ఫలితాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పరిస్థితులు మారుతున్నప్పటికీ అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్య వ్యవస్థ మాత్రం మార్పులకు అనుగుణంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న దేశాలకు గ్లోబల్ ఎకనామిక్ గవర్నెన్స్‌లో తగిన పాత్ర లభించాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పదవులు, విధాన ప్రాధాన్యతలు నేటి ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి కీలకంగా ఉన్న దేశాలు.. ప్రపంచ ఆర్థిక పాలనను రూపొందించే ప్రక్రియలో కూడా తగిన స్థానం పొందాలని స్పష్టం చేశారు.రాబోయే 20 ఏళ్లకు కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో బ్రిక్స్ ముందుకు సాగాలని ప్రధానమంత్రి మోదీ ప్రతిపాదించారు. ప్రతి ఏడాది బ్రిక్స్ అధ్యక్ష పదవి మారుతున్నప్పటికీ.. దీనివల్ల సంస్థాగత కార్యక్రమాల వేగం తగ్గకూడదన్నారు. ఇందుకోసం 'కొనసాగింపు మరియు అమలు యంత్రాంగం' ఏర్పాటు చేయాలని భారత్ ప్రతిపాదిస్తోందని తెలిపారు. దీని కింద బ్రిక్స్ కార్యక్రమాలు, నిర్ణయాలు, ఫలితాలను ట్రోయికా ద్వారా పర్యవేక్షించవచ్చని సూచించారు. ప్రపంచ సంక్షోభాలను ఎదుర్కొనే విషయంలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందువరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియల్లో మాత్రం వెనుకబడి ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ.. 'విశేషాధికారాల పిరమిడ్'ను 'భాగస్వామ్య వేదిక'గా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రతి దేశం గొంతు వినిపించేలా, ప్రతి సభ్యుడికి భాగస్వామ్యం ఉండేలా ప్రపంచ వ్యవస్థ మారాలని అన్నారు. అంతర్జాతీయ నిర్ణయాల్లో మానవాళి అభివృద్ధినే కేంద్రంగా ఉంచాలని ప్రధాని స్పష్టం చేశారు.మొత్తంగా.. బ్రిక్స్ 20 ఏళ్ల ప్రయాణాన్ని కొత్త దశగా అభివర్ణించిన ప్రధాని మోదీ.. రాబోయే రెండు దశాబ్దాలకు సంస్థను మరింత ప్రభావవంతమైన, సమగ్ర, ఫలితాల ఆధారిత వేదికగా మార్చేందుకు భారత్ తరఫున పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ముఖ్యంగా సంస్కరణలు, గ్లోబల్ ఆర్థిక సంస్థల్లో మార్పులు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం వంటి అంశాలపై మోదీ ప్రసంగం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏదేమైనా ఈసారి భారత్ లో జరిగే ఈ సదస్సుపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నేడు రెండవ రోజు జరిగే పరిణామాలపైనే ఎక్కువగా దృష్టి సారించ వచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ**



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 12 : ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

## 253 కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్

**- అమరావతిలోని తుళ్లూరులో నిర్మాణం**

**- ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడి**




అమరావతి, సెప్టెంబర్ 12 :రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది.ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

# సాధ్విగా మారేందుకు 20 ఏళ్ల యువతికి అనుమతి..

భోపాల్, సెప్టెంబర్ 12, : ఓ 20 ఏళ్ల యువతి భౌతిక సుఖాలను త్యజించి, తాను సాధ్విగా మారాలని నిర్ణయించుకుంది. అయితే, తమ కుమార్తె నిర్ణయాన్ని తల్లిదండ్రులు, ఆమె బంధువులు తీవ్రంగా వ్యతిరేకించారు. అందరిలాగే తమ కుమార్తెకు పెళ్లిచేసి, అత్తారింటికి పంపాలని భావించిన ఆ తల్లిదండ్రులు వద్దని వారించారు. కన్న కూతురిపై మమకారంతోనే వాళ్లు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆమె న్యాయస్థానానికి వెళ్లారు. హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో.. విచారణ చేపట్టింది. ఆమె తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించి, మద్దతు తెలిపింది.ప్రాపంచిక సుఖాలను త్యజించి, సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకున్న ఓ 20 ఏళ్ల యువతికి మధ్యప్రదేశ్ హైకోర్టు మద్దతుగా నిలిచింది. తన మతాన్ని స్వేచ్ఛగా అనుసరించే, ఆచరించే ప్రాథమిక హక్కు ఆమెకు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. అంతేకాదు, యువతి సహాయం కోరితే తల్లిదండ్రుల నుంచి ఎలాంటి బలవంతం లేదా వేధింపులు ఎదురుకాకుండా రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఇండోర్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. తనీషా అనే యువతి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై జస్టిస్ సందీప్ ఎన్. భట్ విచారణ చేపట్టారు.తాను శ్వేతాంబర్ జైన ధర్మాన్ని అనుసరించి, సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకున్నట్టు ఆమె కోర్టుకు వివరించారు. అయితే, ఈ నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు, బంధువులు వ్యతిరేకిస్తూ వేధిస్తున్నారని, తనకు పోలీసు రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. అంతేకాదు, మతపరమైన దీక్షలో తల్లిదండ్రులు, బంధువులు జోక్యం చేసుకోకుండా నిరోధించాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21, 25, 26 ప్రకారం తనకు లభించే ప్రాథమిక హక్కులను స్వేచ్ఛగా ఉపయోగించుకోవడానికి అనుమతించాలని ఆమె కోరారు.పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది ఆశిష్ జోషి వాదనలు వినిపిస్తూ.. రక్షణ కల్పించాలని ఇండోర్ పోలీస్ కమిషనర్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశామని, అది ఇంకా పెండింగ్‌లో ఉందని తెలిపారు. పిటిషనర్‌పై ఆమె తల్లిదండ్రులు లేదా బంధువుల నుంచి ఎలాంటి వేధింపులు, బలవంతం లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ గర్విత్ జైన్ హాజరయ్యారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. మేజర్ అయిన ఆమెకు 'తనకంటూ ఒక మార్గాన్ని ఎంచుకుని మతాన్ని అనుసరించే, తన ఇష్టానుసారం జీవించే హక్కు ఉంది' అని పేర్కొన్నారు.ఆమె ఇప్పటికే జైన ధర్మాన్ని అనుసరిస్తోందని, ఇప్పుడు ప్రపంచాన్ని విడిచిపెట్టి సాధ్విగా జీవించాలని నిర్ణయించుకుందన్నారు. అయితే తల్లిదండ్రులు, బంధువులు ఆమెపై ఉన్న ప్రేమానురాగాల వల్ల అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్నారని కోర్టు గుర్తించింది. సమాజంలో పలుకుబడిన కలిగిన తల్లిదండ్రులు తనను దీక్ష తీసుకోనివ్వరనే పిటిషనర్ భయాన్ని కూడా కోర్టు నమోదు చేసింది.ఈ సందర్భంగా "పిటిషనర్ పట్ల ఎంత సానుభూతి ఉందో, ఆమె తల్లిదండ్రుల పట్ల కూడా అంతే సానుభూతి ఉంది" అని ధర్మాసనం పేర్కొంటూ, తల్లిదండ్రుల వ్యతిరేకత కూతురిపై ఉన్న మమకారం నుంచే వచ్చిందని గుర్తించింది. అయినప్పటికీ, 18 ఏళ్లు నిండిన వ్యక్తికి చట్టపరమైన హక్కుల రక్షణ పొందే హక్కు ఉందని, చట్టం దృష్టిలో ఎవరైనా కలిగించే అడ్డంకులను అనుమతించలేమని స్పష్టం చేసింది.'లతా సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. మేజర్లు తమ స్వంత నిర్ణయాలు తీసుకోవడానికి స్వతంత్రులని, అలాంటి వారి ప్రయోజనాలను కాపాడటం కోర్టుల బాధ్యత అని పునరుద్ఘాటించింది. అంతేకాకుండా, పిటిషనర్ దరఖాస్తు చేసుకుంటే పోలీసులు ఎలా వ్యవహరించాలో సూచించడానికి 'శక్తి వాహిని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' తీర్పును కూడా ఉదాహరించింది.పూర్తిస్థాయి ప్రాథమిక రక్షణ ఉత్తర్వులు ఇవ్వడానికి బదులుగా హైకోర్టు ఒక పరిష్కారాన్ని చూపింది. తన తల్లిదండ్రులతో సహా ఎవరైనా బలవంతం చేస్తే సహాయం కోరుతూ ఎస్పీ లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. అలాంటి దరఖాస్తు అందగానే, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారి వెంటనే రంగంలోకి దిగి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.ఈ ఆదేశాలతో హైకోర్టు ఆ రిట్ పిటిషన్‌ను ముగిస్తూ.. పిటిషనర్ సహాయం కోరితే పోలీసులు జోక్యం చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అదే సమయంలో, ఒకరి మతపరమైన ఎంపికను వారి కుటుంబం శాసించలేదని స్పష్టమైన వ్యాఖ్యలు చేసింది.

# పెట్రో.. పసిడి.. రూపాయి.. చివరకు దారెటు?




దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే మూడు కీలక అంశాలు ఒకేసారి ప్రతికూల దిశలో కదులుతున్నప్పుడు ఆందోళన చెందడం సహజం. పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి, పసిడి ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణత– ఈ మూడు పరిణామాలు ప్రస్తుతం సామాన్యుడి నుంచి వ్యాపార వర్గాల వరకు ప్రతి ఒక్కరినీ కలవరపెడుతున్నాయి. వీటికి తోడు అంతర్జాతీయంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడిచమురు మార్కెట్‌లో అనిశ్చితి వంటి అంశాలు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ప్రశ్న ఒక్కటే– పెట్రో.. పసిడి.. రూపాయి.. చివరకు దారెటు? చమురు ధరల పెరుగుదల అనేది కేవలం వాహనదారుల జేబుపై పడే భారం కాదు. అది ఆర్థిక వ్యవస్థలోని దాదాపు ప్రతి రంగాన్నీ తాకే ప్రభావశీలమైన అంశం. భారతదేశం తన ఇంధన అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగినప్పుడు దిగుమతి బిల్లు పెరుగుతుంది. అదే సమయంలో దేశీయ కరెన్సీ బలహీనపడితే, విదేశీ మారకంలో చెల్లించాల్సిన మొత్తం మరింత భారమవుతుంది. అంటే చమురు ధర పెరగడం ఒక సమస్య అయితే, రూపాయి విలువ పడిపోవడం ఆ సమస్యను రెట్టింపు చేసే ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఇంధన ధరల ప్రభావం రవాణా రంగంతో మొదలై వ్యవసాయం, పరిశ్రమలు, నిర్మాణ రంగం, సరఫరా వ్యవస్థ, రిటైల్ మార్కెట్ వరకు విస్తరిస్తుంది. లారీలు, బస్సులు, ట్యాక్సీలు, సరుకు రవాణా వాహనాల నిర్వహణ వ్యయం పెరిగితే దాని ప్రభావం చివరకు వస్తువుల ధరలపై పడుతుంది. రైతులకు డీజిల్ ధర పెరగడం అంటే సాగునీటి పంపులు, వ్యవసాయ యంత్రాలు, పంట రవాణా వంటి అనేక ఖర్చులు పెరగడమే. పరిశ్రమలకు ఇంధన వ్యయం పెరిగితే ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఉద్యమమే మందు ఉత్పత్తిదారుడు ఆ భారాన్ని పూర్తిగా భరించలేకపోతే వినియోగదారుడిపైనే కొంత భాగాన్ని మోపాల్సి వస్తుంది. ఇదే ద్రవ్యోల్బణానికి దారితీసే ప్రధాన మార్గాల్లో ఒకటి. ఇంధన ధరలు పెరిగినప్పుడు రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే ఆహారం నుంచి తయారీ వస్తువుల వరకు అనేక ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే చమురు ధరల కదలికను కేవలం పెట్రోల్ బంకుల వద్ద కనిపించే ధరలతో కొలవడం సరికాదు. దాని ప్రభావం కుటుంబ బడ్జెట్‌లోని అనేక అంశాలపై పరోక్షంగా కనిపిస్తుంది. ఇక రూపాయి విలువ విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే దిగుమతుల వ్యయం పెరుగుతుంది. చమురు మాత్రమే కాదు –ఎలక్ట్రానిక్ పరికరాలు, యంత్రాలు, కొన్ని పారిశ్రామిక ముడి పదార్థాలు, రసాయనాలు, ఇతర దిగుమతి ఆధారిత వస్తువుల ధరలపైనా ప్రభావం పడుతుంది. అయితే రూపాయి పతనానికి అంతా ప్రతికూలమే అని చెప్పలేం. ఎగుమతిదారులకు కొంత ప్రయోజనం లభించే అవకాశం ఉంటుంది. కానీ దేశ ఆర్థిక వ్యవస్థలో దిగుమతుల ప్రాధాన్యం అధికంగా ఉన్న పరిస్థితుల్లో కరెన్సీ బలహీనత ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచే ప్రమాదం మాత్రం విస్మరించలేనిది. ఈ నేపథ్యంలో బంగారం మరో ప్రత్యేక కథ చెబుతోంది. సాధారణంగా అంతర్జాతీయ అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మార్కెట్లలో అస్థిరత పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గుచూపుతారు. బంగారానికి అలాంటి సమయంలో డిమాండ్ పెరగవచ్చు. దేశీయంగా రూపాయి బలహీనపడటం కూడా రూపాయి లెక్కల్లో బంగారం ధర పెరగడానికి కారణమయ్యే అవకాశం ఉంది. అందుకే ఒకవైపు స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు గురవుతుంటే మరోవైపు పసిడి ధరలు పైకి కదలడం కనిపిస్తుంది.బంగారం ధర ఎప్పుడూ ఒకే దిశలో పెరుగుతుందని భావించడం కూడా పొరపాటే. అంతర్జాతీయ వడ్డీ రేట్లు, అమెరికా డాలర్ బలం, కేంద్ర బ్యాంకుల విధానాలు, పెట్టుబడిదారుల సెంటిమెంట్, ప్రపంచ ఆర్థిక వృద్ధిపై అంచనాలు వంటి అనేక అంశాలు బంగారం ధరను ప్రభావితం చేస్తాయి. అందుకే రోజువారీ ధరల మార్పులను చూసి భయపడటం కన్నా, దీర్ఘకాలిక ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడం అవసరం. మరోవైపు స్టాక్ మార్కెట్లలో కనిపిస్తున్న ఒడిదుడుకులు కూడా ఈ సమీకరణంలో భాగమే. ముడిచమురు ధరలు పెరిగితే దిగుమతి ఆధారిత కంపెనీల ఖర్చులు పెరిగే అవకాశం ఉంటుంది. రూపాయి బలహీనపడితే విదేశీ మారకపు రుణాలు లేదా దిగుమతులపై ఆధారపడే సంస్థలపై ఒత్తిడి రావచ్చు. అదే సమయంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను తగ్గిస్తే మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చు. అయితే కొన్ని ఎగుమతి ఆధారిత రంగాలకు బలహీన రూపాయి అనుకూలంగా మారే అవకాశమూ ఉంది. కాబట్టి మార్కెట్‌లో ప్రతి రంగం ఒకే విధంగా ప్రభావితమవుతుందని భావించడం సరికాదు. అందువల్ల పెట్రో, పసిడి, రూపాయి అనే మూడు సూచికలను విడివిడిగా చూడటం కన్నా వాటి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. చమురు ధరలు పెరిగితే దిగుమతి బిల్లు పెరుగుతుంది; దిగుమతి బిల్లు పెరిగితే రూపాయిపై ఒత్తిడి రావచ్చు; రూపాయి బలహీనపడితే దిగుమతులు మరింత ఖరీదవుతాయి; అంతర్జాతీయ అనిశ్చితి పెరిగితే బంగారం వైపు పెట్టుబడులు మళ్లవచ్చు; మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింటే స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతాయి. ఈ పరిణామాలన్నీ చివరకు సామాన్యుడి జీవన వ్యయంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి నేటి పరిస్థితి కేవలం ధరల పెరుగుదల కథ కాదు –ఆర్థిక స్థిరత్వానికి ఎదురవుతున్న పరీక్ష. తాత్కాలిక ఉపశమన చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇది. పెట్రో మంటను తగ్గించాలి, రూపాయి విలువను నిలబెట్టే ఆర్థిక పునాదులను బలోపేతం చేయాలి, పసిడి ధరల ఊగిసలాట వెనుక ఉన్న అంతర్జాతీయ అనిశ్చితిని అర్థం చేసుకోవాలి. అప్పుడే ద్రవ్యోల్బణం నుంచి సామాన్యుడికి ఉపశమనం లభిస్తుంది. ప్రపంచ పరిణామాలు మన తలుపు తట్టకముందే వాటి ప్రభావాన్ని అంచనా వేసి సిద్ధపడటమే సమర్థ ఆర్థిక పాలన. లేకపోతే పెట్రో మంట, పసిడి మెరుపు, రూపాయి పతనం– మూడూ కలిసి దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రశ్న దారెటు? అనేదే కాదు; సరైన దారిని ఇప్పుడే ఎంచుకోగలమా? అన్నదే అసలు ప్రశ్న.

# మైలార్ దేవ్ పల్లి పరిధిలో విషాదం

**- వేడి నీళ్ల బకెట్లో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి .**

రాజేంద్రనగర్ : మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వేడి నీళ్ల బకెట్లో పడి నాలుగేళ్ల బాలిక మృతి చెందింది స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ మహబూబ్నగర్ జిల్లాకు చెందిన ఒక కుటుంబం ఉపాధి నిమిత్తం ప్రగతి నగర్లో నివాసముంటోంది. ఓ కంపెనీలో పనిచేసే బాలిక తల్లి, పని ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత స్నానం చేయడానికి బకెట్లో వాటర్ హీటర్ పెట్టి నీళ్లను వేడి చేస్తోంది అదే సమయంలో తల్లికి ఫోన్ రావడంతో బయటికి వెళ్లింది అక్కడే ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి మానస ప్రమాదవశాత్తూ వేడి నీళ్ల బకెట్లో పడిపోయింది. నీళ్ల వేడికి తీవ్రంగా గాయపడిన చిన్నారిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పాప మృతి చెందింది. ఈ ఘటనపై మైలార్ దేవ్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## కోర్టు కేసులు ఉన్న ప్రైవేటు భూములు మాత్రమే 22ఎ జాబితా లో చేర్చారు

**- ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్**

హైదరాబాద్ : 22 ఏ పై కేటీఆర్, హరీష్ రావు నిర్లజ్జగా మాట్లాడుతున్నారు . 22ఎ లో అత్యధికంగా భూమి చేర్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అయన మీడియాతో మాట్లాడుతూ మీ భాగోతం బయటపెడుతాం... తొందర ఎందుకు కేటీఆర్. 22ఎ లో ఉన్న భూముల్లో అత్యధికంగా అటవీ, ఇతర ప్రభుత్వ భూములే ఉన్నాయి.. కోర్టు కేసులు ఉన్న ప్రైవేటు భూములు మాత్రమే 22ఎ జాబితా లో చేర్చారని అన్నారు.మహిళా కమిషన్ సీరియస్ గా తీసుకుని అసెంబ్లీ ముందు జరిగిన ఘటన పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు.

# అంకెలు చెప్పలేదని.. దెబ్బల లెక్క చెప్పిన టీచర్..!

- సహనం లేని టీచర్ కు గుణపాఠం చెప్పేదెవరు..?
- అది పాఠశాలనా లేదా బంధిఖానానా అని ప్రశ్నిస్తున్న పేరెంట్స్..!



అందోల్, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర ) : 1 నుంచి 30 వరకు అంకెలు సరిగా చెప్పలేదన్న కారణంతో మూడో తరగతి విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఆలస్యంగా వెలుగుచూసింది. జోగిపేట ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ మీడియంలో మూడో తరగతి చదువుతున్న అర్హయ్ (8) పై ఉపాధ్యాయుడు దాడి చేసినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఉపాధ్యాయుడి ఆగ్రహం కారణంగా విద్యార్థి వీపు భాగంలో తీవ్ర గాయాలైనట్లు పిల్లవాడి తల్లితండ్రులు తెలిపారు. గతంలో కూడా తమ కుమారుడిని టీచర్ ఇలాగే చిటకాబాదాడని, ఇది రెండవసారి అని విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం తమ కుమారుడి పై దాడి కి పాల్పడ్డ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేసేందుకు జోగిపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినట్లు సమాచారం. అయితే కేసు పెట్టవద్దంటూ పాఠశాల ఉపాధ్యాయులు యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులతో చర్చలు జరిపినట్లు తెలిసింది. చివరకు ఘటనపై ఉపాధ్యాయుడు విద్యార్థి తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగినట్లు సమాచారం. ఘటనపై విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ జరిపి, విద్యార్థుల పై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## SIR-2026 ప్రత్యేక ప్రచార దినం సందర్భంగా పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12(విజన్ ఆంధ్ర) : SIR-2026 ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినం సందర్భంగా కౌకుంట్ల, సి.సి.కుంట, దేవరకద్ర మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా కౌకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రం నంబర్ 156, కౌకుంట్ల గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 157, 158, 159, 160లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే సి.సి.కుంట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 208, 209, 210, 211, 212, 213లను సందర్శించి, అక్కడ SIR-2026లో భాగంగా చేపడుతున్న ఎన్నికల సంబంధిత కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. అదేవిధంగా దేవరకద్ర మండలంలోని చిన్న రాజమూర్ గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాలు 133, 134లను సందర్శించి, ూ×=-2026 ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను పక్కాగా కల్పించాలని అధికారులకు సూచించారు. SIR-2026 ప్రత్యేక ప్రచార దినాన్ని సమర్థవంతంగా నిర్వహించి, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తహసీల్దార్లు/ఏఈఆర్‌ఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పై షాద్ నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన దానం నాగేందర్

హైదరాబాద్ : షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసిఆర్ పై చేసిన వ్యాఖ్యలను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఖండించారు. తక్షణమే కేసీఆర్ కి క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సేవలు ఈ రాష్ట్రానికి అవసరం ఉందని , ఆయన అనుభవం ప్రజలకు అందించాలని అన్నారు. కేసీఆర్ చనిపోవాలని ఓ ఎమ్మెల్యే కోరుకోవడం... ఆయన స్థాయికి ఆ మాటలు మాట్లాడటం సబబుకాదన్నారు. రాజకీయంగా ఉన్నప్పుడు రాజకీయంగానే మాట్లాడాలే కానీ వ్యక్తిగతంగా చనిపోవాలి అని కోరుకోవడం దారుణం అన్నారు. కేసీఆర్ నిండునూరేళు ఆరోగ్యంగా ఉండాలని తాను భగవంతుడుని కోరుకుంటున్నట్లు చెప్పారు. కేసీఆర్ గురించి చెడు కోరుకుంటే , తమకే చెడు జరుగుతుందన్నారు. అలాగే స్పీకర్ తల్లిని అవమానకరంగా మాట్లాడిన ఎమ్మెల్సీ ఆయనకు క్షమాపణలు చెప్పాలని దానం సూచించారు.

# పోలీస్ కుటుంబాల అభ్యున్నతికై శాఖాపరమైన "ముందడుగు"

- పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్యే సంక్షేమానికి ఉన్నతమైన పునాది
- విద్యతో పాటు క్రీడలు, క్రమశిక్షణకు ఉన్నతమైన ప్రాధాన్యం
- మాదకద్రవ్యాలకు దూరంగా.. బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్



హైదరాబాద్ సిటీ బ్యూరో, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలోని పోలీస్ కుటుంబాల అభ్యున్నతికై శాఖాపరమైన "ముందడుగు"లో భాగంగా పలు కీలక అంశాలను అధ్యయనం చేసి పోలీసు కుటుంబాల అభ్యున్నతికి శ్రీకారం చుట్టబోతున్నామని తెలంగాణ రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్ పేర్కొన్నారు. శనివారం మంచిరేవులలోని ఆక్టోపస్, గ్రేహౌండ్స్ ప్రాంగణంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అకడమిక్ బ్లాక్1 నిర్మాణానికి పోలీస్, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి డీజీపీ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా డిజిపి సివి ఆనంద్ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం పోలీసు సంక్షేమంలో కీలక భాగమని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. పిల్లల భవిష్యత్తుపై ఆందోళన లేకుండా చేస్తే పోలీసులు విధులపై మరింత దృష్టి సారించగలరని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన విద్యా విధానానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. 2024 డిసెంబరులో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు డీజీపీ తెలిపారు. ఆర్మీ, సైనిక్ స్కూళ్ల తరహాలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో వైఐపీఎస్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గతేడాది ఏప్రిల్‌లో తాత్కాలిక ప్రాంగణంలో 120 మంది విద్యార్థులతో పాఠశాల ప్రారంభమైందని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య సుమారు 360కు చేరిందన్నారు. కొత్త భవనం పూర్తయితే వచ్చే ఏడాది 700,720 మందికి చేరే అవకాశం ఉందని తెలిపారు. విద్యతోపాటు క్రీడలు.. క్రమశిక్షణ, విద్యార్థుల్లో విద్య, క్రమశిక్షణతోపాటు క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. విద్య కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా బాధ్యతాయుత పౌరులుగా ఎదిగేలా దోహదపడాలని ఆకాంక్షించారు. క్రికెట్‌తో పాటు రాక్ క్లైంబింగ్, గుర్రపు స్వారీ వంటి సాహస క్రీడల్లోనూ శిక్షణ అందిస్తామని తెలిపారు. హోంగార్డుల పిల్లలకూ, సాధారణ విద్యార్థులకు కూడా అవకాశం కల్పిస్తామన్నారు. పోలీసు సిబ్బందితోపాటు ఇతర వర్గాల పిల్లలకు కూడా అందుబాటులో ఉండేలా తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందించనున్నట్లు డీజీపీ తెలిపారు. హోంగార్డుల పిల్లలకు కూడా ప్రవేశాల్లో అవకాశం కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలో 50 శాతం సీట్లు సాధారణ విద్యార్థులకు కూడా కేటాయించనున్నట్లు వెల్లడించారు.

### ఒకే ప్రాంగణంలో ప్లస్2 వరకు విద్య......

పాఠశాల అభివృద్ధికి అకడమిక్ తదితర అంశాలపై పలు సబ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ఒకే ప్రాంగణంలో ప్లస్2 వరకు విద్య అందించే పూర్తిస్థాయి పాఠశాలగా వైఐపీఎస్‌ను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రానున్న రెండు, మూడేళ్లలో అత్యున్నత ప్రమాణాలతో విద్యాసంస్థగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. నిర్మాణ, అభివృద్ధి పనులను సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పోలీసుల సంక్షేమమే సమర్థ పోలీసింగ్‌కు పునాది, పోలీసు సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం సమర్థవంతమైన పోలీసింగ్‌తో ముడిపడి ఉన్నాయని డీజీపీ అన్నారు. తమ పిల్లల చదువుపై భరోసా కల్పిస్తే పోలీసులు విధులపై మరింత ఏకాగ్రతతో పనిచేయగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్, తెలంగాణ రాష్ట్ర ఆక్టోపస్ డీజీ అనిల్‌కుమార్, సైబరాబాద్ సీపీ రమేష్, తెలంగాణ రాష్ట్ర పి,ఎల్ ఐజీ గజరావు భూపాల్, ఏఐజీ రమణకుమార్, లీగల్ అండ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్‌కుమార్, డీసీపీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ ఉదయ్‌రెడ్డి, ఏసీపీలు, వివిధ సంస్థల ప్రతినిధులు, వైఐపీఎస్ ప్రిన్సిపాల్ డా.అనితారెడ్డి, జీఎం రాజేష్, పోలీసు అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రీనరీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి

*హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి*



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్12 ( విజన్ ఆంధ్ర ) : భద్రకాళి బండ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం భద్రకాళి బండ్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటికే పూర్తయిన బండ్ అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంపై అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రకాళి బండ్ అభివృద్ధిలో భాగంగా గ్రానైట్ పనులు, పాత్‌వేలు, గ్రీనరీ, లైటింగ్, డ్రైనేజీ తదితర పనులు పూర్తయినట్లు అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ భద్రకాళి బండ్ కు సంబంధించిన అభివృద్ధి పనులలో మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భద్రకాళి బండ్ పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ గ్రీనరీని మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే లక్ష్యానికి అనుగుణంగా చేపట్టిన అన్ని పనులను సమన్వయంతో, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవి కుమార్, డీఈలు, ఏఈలు,హార్టికల్చర్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

# కన్నతల్లి మరణవార్త తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య..


- మెదక్ జిల్లా పెద్దశంకరంపేట విషాద ఘటన

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : అమ్మంటే ప్రేమ.. అమ్మంటే ప్రాణం.. కానీ ఆ కన్నతల్లే లేదనే నిజాన్ని ఆ 19 ఏళ్ల కుమారుడు తట్టుకోలేకపోయాడు. తల్లి లేని లోకంలో తాను ఉండలేనంటూ.. అమ్మ వెళ్లిన దారినే తాను ఎంచుకున్నాడు! మెదక్ జిల్లాలో ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలో జరిగిన ఈ జంట ఆత్మహత్యలు స్థానికులను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్తా లక్ష్మపూర్ గ్రామానికి చెందిన బేతమ్మ (45), ఆమె భర్త బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడే నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్‌లోని వారి నివాసంలో భార్యాభర్తల మధ్య స్వల్ప గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బేతమ్మ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్‌లో తల్లి బేతమ్మ ఆత్మహత్య చేసుకున్న విషయం సొంత ఊరిలో ఉన్న ఆమె కుమారుడు ప్రవీణ్ (19)కు తెలిసింది. ప్రాణంగా ప్రేమించే కన్నతల్లి ఇకలేదనే విషయాన్ని ఆ యువకుడు తట్టుకోలేకపోయాడు. తీవ్రమైన మానసిక వేదనకు లోనైన ప్రవీణ్, క్షణికావేశంలో తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే కొలపల్లి గ్రామ శివారులోకి వెళ్లి, అక్కడ ఉన్న ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకే కుటుంబంలో తల్లి, కొడుకు ఇద్దరూ గంటల వ్యవధిలోనే ఆత్మహత్యలకు పాల్పడటంతో మక్తా లక్ష్మపూర్ మరియు కొలపల్లి గ్రామాల్లో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. మరణంలోనూ వీడని ఆ తల్లీకొడుకుల బంధం గురించి తలచుకుని గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

# ప్రజా ఉద్యమాల ధృవతార కామ్రేడ్ సీతారాం ఏచూరి

- తుర్కయంజాల్ సీపీఐ(ఎం) మున్సిపల్ కమిటీ సభ్యులు మండల సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర ) : భారతదేశ మార్క్సిస్టు మేధావి, ప్రజాస్వామ్యం సెక్యులరిజం కోసం దేశ సమైక్యత కోసం తుదిశ్వాస వరకు కృషి చేయడమేకాకుండా, మతోన్మాద మనువాద శక్తులకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య అభ్యుదయ లౌకిక శక్తులను ఏకం చేసి ఇండియా బ్లాక్ స్థాపించడంలో ప్రముఖ పాత్ర పోషించి, ప్రపంచ దేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన మార్క్సిస్టు నేత, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సీతారాం ఏచూరి గారి రెండవ వర్ధంతి సందర్భంగా వారికి సీపీఐ(ఎం) తుర్కయంజాల్ కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి రెండో వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.....సీతారాం ఏచూరి భారతదేశంలో వామపక్ష ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ అంచెలంచెలుగా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. దేశంలో సామాజిక న్యాయం, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. పార్లమెంటరీ వ్యవస్థపై లోతైన అవగాహనతో ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రస్తావించడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రజా ఐక్యత కోసం కృషి చేశారని అన్నారు. సీతారాం ఏచూరి గొప్ప రాజకీయ నాయకుడే కాకుండా.. మార్క్సిస్టు సిద్ధాంతంపై లోతైన అవగాహన కలిగిన మేధావి, అద్భుతమైన వక్త, రచయిత అని కొనియాడారు. విభిన్న రాజకీయ పార్టీలతో ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యత కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ప్రజల కోసం పోరాడే ప్రతి ఉద్యమంలో సీతారాం ఏచూరి ఆలోచనలు, సిద్ధాంతాలు, పోరాట స్ఫూర్తి మనకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే




నిజమైన నివాళి అని, కార్మికులు, రైతులు, పేదలు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు మండల సత్యనారాయణ, అరుణ్ కుమార్, ఇల్లూరు భాస్కర్, శారద, పి శ్రీనివాసులు, సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి ఐతరాజు, కృష్ణ, ఎంఎస్‌ఆర్ నగర్ శాఖ సభ్యుడు నకుమల్ల యాదగిరి, పార్టీ సీనియర్ నాయకులు మద్దెల యాదయ్య, మాధవరెడ్డి, శ్రీశైలం, తుర్కయంజాల్ డివైఎఫ్ఐ కార్యదర్శి సాయి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు




హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణలో వర్షాల ఉధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

- జగన్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసింది
- ఆంధ్రప్రదేశ్ మంత్రి సవిత కీలక వ్యాఖ్యలు
- 'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సు

అమరావతి, సెప్టెంబర్ 12 : బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోన ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన 'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. బీసీలను కులం లేదా వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామని స్పష్టం చేశారు. ఈ చట్టం కోర్టులలో బలంగా నిలబడేలా 156 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు. గత జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ద్రోహం చేసిందని మంత్రి విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా చేతివృత్తుల వారికి ఊతమిచ్చే 'ఆదరణ 3.0' పథకాన్ని కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు.

# వంద శాతం స్ట్రైక్ రేట్ పై దృష్టి




తిరుపతి, సెప్టెంబర్ 12, : ఏపీలో స్థానిక సంస్థల వేడి రాజుకుంది. అయితే సాధారణంగా ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు ముందుగా తమ ఆసక్తిని వ్యక్తం చేస్తారు. అలా కూటమిలోని మూడు పార్టీలలో ఔత్సాహికులు తమ అభిలాషను వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారికంగా ఎవరూ బయటకు చెప్పలేకపోతున్నారు. దానికి కూడా కూటమిగా ఉండడం. ఎవరికి వారుగా ముందుగా ప్రకటించుకోవద్దని తమ పార్టీల నాయకులకు కూటమి పార్టీల అధినాయకత్వాలు హెచ్చరించిన నేపథ్యం ఉంది. అదే సమయంలో సీట్లు ఎవరికి ఎంత శాతం అన్న లెక్క ముందు తేల్చుకోవాలని చూస్తున్నారు. ఐక్యంగా పోటీ చేయడానికే కూటమి పార్టీలు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. దాంతో సర్దుబాటు కోసం సీట్ల విషయంలో చర్చకు మూడు పార్టీల అధినాయకత్వాలు కలిసి చర్చించడానికి సిద్ధపడుతున్నాయి ఇక కూటమి పార్టీలలో ముఖ్యమైన మిత్ర పక్షం జనసేన. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రకృతి వైద్యం కోసం కేరళం వెళ్ళిన సంగతి విధితమే. ఆయన ఇపుడు అక్కడే ఉన్నారు. ఆయన ఎపుడు వస్తారు అంటే ఎవరికి వారికి ఊహాగానాలు ఉన్నాయి. అయితే తాజాగా జనసేన పార్టీ సామావేశంలో ఆ పార్టీ సీనియర్ నేత మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 15న పవన్ వస్తారు అని చెప్పడం జరిగింది. ఆయన పార్టీ ఆఫీసుకి వచ్చి స్థానిక సంస్థల ఎన్నికల మీద సమీక్షలు నిర్వహిస్తారు అని చెప్పారు. పవన్ బీ ఫారాలు ఇస్తారని ఆయన సంతకం చేసిన బీ ఫారాలు ఉన్న వారే అభ్యర్థులుగా ఉంటారని ఈ లోగా ఎవరు పోటీ చేస్తామని ప్రకటించుకున్నా అది తొందరపాటు వ్యక్తిగతం అవుతుందని అంటున్నారు. దాంతో పవన్ వచ్చాక కూటమి నేతల మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో చర్చలు జరుగుతాయని అంటున్నారు మరో వైపు చూస్తే బీజేపీ కూడా సీట్ల సర్దుబాటు విషయంలో ఫోకస్ పెట్టింది అని అంటున్నారు. ఆ పార్టీ కూడా కూటమితో పొత్తులో ఉంటే గణనీయంగా సీట్లు గెలుచుకోవచ్చు అని భావిస్తోంది. ఈసారి ఆ పార్టీ నుంచి కూడా అనేక మంది పోటీకి తయారుగా ఉన్నారు. విశాఖ, రాజమండ్రి మేయర్ సీట్ల కోసం బీజేపీ పట్టుబడుతోంది. అలాగే జెడ్పీల విషయానికి వస్తే అల్లూరి జిల్లాతో పాటు గోదావరి జిల్లాలు కోస్తాలో కొన్ని కోరుకుంటోంది అని అంటున్నారు. ఈ ప్రచారం ఇలా ఉండగానే స్థానిక ఎన్నికల విషయంలో ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్ స్పందించారు. స్థానిక ఎన్నికల్లో సీట్ల పంపకాలపై క్లారిటీ రాలేదు అని ఆయన చెప్పడం విశేషం. రానున్న మూడు రోజులలో కూటమి పార్టీలు కూర్చుని చర్చిస్తామని చెప్పారు. అలాగే స్థానిక ఎన్నికల పోటీ విధివిధానాలపై చర్చ ఉంటుందని అన్నారు. ఈసారి బీజేపీ నుంచి కూడా వంద శాతం స్ట్రైక్ రేట్ కోసం ప్రయత్నిస్తామని మాధవ్ చెప్పడం విశేషం. స్థానిక ఎన్నికలపై ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ స్పందన చూస్తే మరో మూడు రోజులలో కూటమి పార్టీలు కలిసి కూర్చుని చర్చిస్తాయని క్లారిటీ అయితే వచ్చింది. వినాయకచవితి పండుగ దగ్గరలో ఉంది. అది అయిన తరువాత ఈ నెల 16న చంద్రబాబు పవన్ కళ్యాణ్ మాధవ్ సీట్ల సర్దుబాటు గురించి కీలక చర్చలు జరుపుతారని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# రేసులోకి వచ్చిన ఆనం



నెల్లూరు సెప్టెంబర్ 12, : నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రస్తుతం యాక్టివ్ పాలిటిక్స్‌లోనే ఉన్నారు. ఆయన రాజకీయ రిటైర్మెంట్ ప్రకటించలేదు. అయితే.. ఆయన రిటైర్ అవుతున్నారని.. ఆయన వారసుడు ఎవరు ? అంటూ.. రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ, కూటమి ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఆనం విషయం తరచుగా తెరమీదికి వస్తోంది. దెబ్బకు డిలీట్ ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొంటున్నారని చెబుతున్నారు. కానీ, ఆనం ఎక్కడా అసలు ఈ విషయం చెప్పలేదని అంటున్నారు. రిటైర్మెంట్ గురించిన వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని అంటున్నారు. మంత్రిగా ఆయన ప్రస్తుతం ఆత్మకూరు పట్టణ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి పనుల్లో (రోడ్ల విస్తరణ, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి) పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్నారు. దీంతో ఇప్పుడు ఆనం యూటర్న్ తీసుకున్నారన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్నచర్చ.మరో మూడేళ్ల తర్వాత.. పోటీకి రెడీ కాలేరన్న వాదన సహజం. అయితే.. ఆత్మకూరుతో తనకు ఉన్న బంధం నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోనూ పోటీకి రెడీ అవుతానంటూ.. తన అనుచరులకు చెపుతున్నారట. కాబట్టి ప్రస్తుతానికి ఆత్మకూరు బరిలో వేరే వారు వస్తారనే ప్రశ్నే లేదు; ఆయనే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనే పోటీ చేయనున్నారు.. అని అంటున్నారు.టీడీపీ ఆలోచన మరో విధంగా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఆనం.. టీడీపీ తరఫున ఆత్మకూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. వచ్చే ఎన్నికల నాటికి యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ నిర్ణ యించింది. ప్రధానంగా.. నారా లోకేష్ నాయకత్వాన్ని పెంచే దిశగా సమాలోచనలు చేస్తున్న దరిమిలా.. వృద్ధ నేతలను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆనంను నామినేటెడ్‌పదవికి షిఫ్టు చేసి.. ఆత్మకూరును వేరే వారికి ఇచ్చే ఆలోచనలో ఉన్నారన్నది స్థానికంగా జరుగుతున్న చర్చ. కానీ, ఆనం మాత్రం.. ఈ విషయాలు వెలుగు చూస్తున్న క్రమంలో మరింత యాక్టివ్ అవుతుండడం గమనార్హం.

# వాల్తేరు డిపో వద్ద ఆర్టీసీ బస్సు పూర్తిగా దగ్ధం

విశాఖపట్నం: విశాఖ నగరంలో శనివారం తెల్లవారుజామున ఒక భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది నెల్లూరు నుంచి ప్రయాణికులతో విశాఖ పట్నం చేరుకున్న ఒక ఏపీఎస్ఆర్టీసీ (ంఖూఖీఅ) బస్సు వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచగా ఆకస్మాత్తుగా మంటలు అంటుకుని నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా దగ్ధ మైంది నెల్లూరు నుంచి సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఈ బస్సు విశాఖకు చేరు కుంది అనంతరం వాల్తేరు డిపో వెలుపల బస్సును నిలిపి ఉంచారు అయితే, శనివారం తెల్లవారు జామున ఒక్కసారిగా బస్సు ఇంజిన్ భాగం నుండి దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. బస్సు ఖాళీగా ఉన్న సమ యంలోనే ఈ ప్రమాదం జరగడంతో ఒక పెద్ద ముప్పు తప్పింది నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి విస్తరించి వాహనం పూర్తిగా దగ్ధం అయ్యింది బస్సు తగల బడుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు సిబ్బంది వెంటనే పోలీసుల కు,అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు ఘటనా స్థలానికి చేరు కున్న ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు ఆర్టీసీ ఉన్నతాధి కారులు,పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీ లించారు బస్సులో మంటలు చెలరేగడానికి షార్ట్ సర్క్యూట్ కారణమా లేదా మరేదైనా సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు ఆర్టీసీ సాంకేతిక విభాగం అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఈ ప్రమాదం లో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం తో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# వివాదాల్లో సెల్రబెటీ...

హైదరాబాద్, సెప్టెంబర్ 12, : పేరుకు పేరు.. డబ్బుకు డబ్బు.. ప్రతిష్టకు ప్రతిష్ట.. గౌరవానికి గౌరవం.. ఇంకా చాలా .. వీటన్నింటినీ మన సమాజం వీళ్లకు భారీగానే ఇచ్చింది. పేరూ ఊరూ తెలియకపోయినప్పటికీ నెత్తిన పెట్టుకుంది. సెలబ్రిటీ అనే హోదా ఇచ్చింది. కానీ ఎంతో ఇచ్చిన సమాజానికి వీళ్ళు రిటర్న్ గిఫ్ట్ ఏమిచ్చారో తెలుసా..సెలబ్రిటీలు వివాదాలలో చిక్కుకోవడం మన తెలుగు రాష్ట్రాల్లో కొత్త కాదు. కాకపోతే గతంలో మీడియా ఈ స్థాయిలో లేదు కాబట్టి వాళ్ల గురించి అంతగా తెలిసేది కాదు. కానీ ఇప్పుడు సోషల్ మీడియా బలంగా ఉంది. ఇలాంటప్పుడు సెలబ్రిటీలు జాగ్రత్తగా ఉండాలి. ఎంతో ఇచ్చిన సమాజం పట్ల అప్రమత్తంగా ఉండాలి. తాము చేసే అడుగులను సమాజం జాగ్రత్తగా గమనిస్తోంది అనే సోయి ఉండాలి. ఇది లేకపోతే సెలబ్రిటీలు బొక్కా బోర్లా పడడం ఖాయం. అలా బొక్కా బోర్లా పడి పరువు పోగొట్టుకున్న సెలబ్రిటీల జాబితా ఇప్పుడు ఏంటో చూద్దాం. గతంలో సినిమాలలో నటించేవారిని మాత్రమే సెలబ్రిటీలుగా పరిగణించేవారు. కానీ ఇప్పటి కాలంలో టెలివిజన్.. గాయకులు.. డ్యాన్సర్లు.. సోషల్ మీడియాలో ప్రభావం చూపించగలిగే వారిపై మన సమాజం సెలబ్రిటీ ముద్ర వేసింది. వారందరికీ ఎన్నో రకాలుగా మన సమాజం చేయూత



అందిస్తూనే ఉంది. కాకపోతే వారు సమాజం నుంచి భారీగా స్వీకరించి.. చివరికి ఏదో ఒక వివాదంలో చిక్కుకొని పరువు పోగొట్టుకుంటున్నారు.

### మంగ్లీ

తెలుగు జానపద.. సినీ గాయనిగా.. టెలివిజన్ యాంకర్ గా.. విలక్షణమైన గొంతుతో.. సంప్రదాయ బంజారా దుస్తులు ధరించి.. ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో తెలుగు రాష్ట్రాలలో విశేషమైన గుర్తింపు పొందారు మంగ్లీ. ఈమె అసలు పేరు సత్యవతి రాథోడ్. జూన్ 10, 1994 లో అనంతపురం జిల్లా గుత్తి మండలం బచ్చినపల్లి తండాలో ఒక సాధారణ నిరుపేద బంజారా కుటుంబంలో జన్మించారు ప్రాథమిక విద్యను తండాలో పూర్తీ చేశారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆ సమయంలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆమెలో ప్రతిభను గుర్తించి సంగీతం నేర్చుకునేందుకు ఆర్థిక సహాయం అందించింది. బతుకమ్మ, బోనాలు, సంక్రాంతి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, ఉగాది, సమ్మక్క సారక్క వంటి ప్రత్యేక సందర్భాలలో ఆమె పాడిన పాటలు యూట్యూబ్ లో సంచలనం సృష్టించాయి. టాలీవుడ్ లో ఎన్నో సూపర్ హిట్ సినిమాలలో ఆమె పాటలు పాడారు. అలవైకుంఠపురం అనే సినిమాలో రాములో రాముల.. పుష్ప.. బలగం.. ది ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాల్లో ఆమె పాడిన పాటలు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చాయి. తెలుగులోనే కాకుండా.. కన్నడలో కూడా ఆమె పాటలు పాడారు 2021లో మాస్ట్రో.. 2018లో శైలజా రెడ్డి అల్లుడు.. 2020లో గువ్వా గోరింక అనే సినిమాలలో ఆమె నటించారు. 2020లో తెలంగాణ ప్రభుత్వం ఆమెకు ఉత్తమ జానపద కళాకారిణి అనే పురస్కారం అందించింది. సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్.. ఐఫా ఉత్సవం అవార్డులను ఆమె సొంతం చేసుకున్నారు.. 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెను తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఎస్వీబీసీ ఛానల్ ప్రత్యేక సలహాదారుగా నియమించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ మంగ్లీ 2026 ఏప్రిల్ నెలలో సుమారు 200 కోట్ల మైక్రో ఫైనాన్స్ కుంభకోణానికి సంబంధించిన వివాదంలో కూరుకుపోయారు. అయితే ఇందులో తనకు.. తన కుటుంబానికి ఎటువంటి ప్రమేయం లేదని మంగ్లీ వివరించారు. ఇందులో రమావత్ మధు అనే వ్యక్తి ఇంట్లో ఒకపూట భోజనం చేసినందుకు తనను ఇబ్బంది పెట్టారని.. రకరకాల





ఆరోపణలు చేశారని ఆమె వాపోయారు. దీని వెనక ఎవరి పాత్ర ఉంది.. ఎవరి చేయి ఉంది అనే విషయం పక్కన పెడితే మంగ్లీ తీవ్రమైన వివాదంలో కూరుకుపోయారు. ఇన్ని రోజులపాటు సంపాదించుకున్న మంచి పేరును పోగొట్టుకోవాల్సి వచ్చింది..

### మాధురి రాథోడ్

తెలంగాణ ప్రాంతానికి చెందిన ఈమె ప్రముఖ జానపద నృత్య కారిణిగా పేరు తెచ్చుకుంది. ఇటీవల మరో ఫోక్ డాన్సర్ ఈశ్వర్ సాయితో కలిసి ఉన్నప్పుడు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడింది. ఈశ్వర్ సాయి భార్య వేములవాడలో మాధురి రాథోడ్.. ఈశ్వర్ సాయిని పట్టుకుంది. ఈశ్వర్ సాయి.. మాధురి రాథోడ్ ఒకే గదిలో ఉండగా ఈశ్వర్ సాయి భార్య శరణ్య వారిద్దరిని పట్టుకున్నట్టు ఒక వీడియో సోషల్ మీడియాలో ఇప్పటికీ సంచలనం సృష్టిస్తోంది. ఈశ్వర్ సాయి భార్య శరణ్య తన మీద ఆకారణంగా దాడి చేసి బూతులు తిట్టిందని.. తన ఐఫోన్ లాక్కుని వెళ్లిందని.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిందని మాధురి మొదట వేములవాడ పోలీసులను ఆశ్రయించింది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకొని ఈశ్వర్ సాయి మోసం చేశాడని మాధురి రాథోడ్ హైదరాబాదులో నార్సింగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.కేసు పెట్టి రోజులు అవుతున్నప్పటికీ ఈశ్వర్ సాయిని పోలీసులు అరెస్ట్ చేయకపోవడం పట్ల.. మాధురి ఆగ్రహం వ్యక్తం చేసింది. తనకు న్యాయం జరగడం లేదని మనస్థాపంతో హైదరాబాదులోని పుప్పాలగూడలో తన ఇంట్లో ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కాపాడారు. మాధురి రాథోడ్.. ఈశ్వర్ సాయి మధ్య ఏం జరిగిందో తెలియదు గానీ.. మొతానికి ఈ వివాదం ద్వారా మాధురి రాథోడ్ చాలావరకు అవకాశాలను కోల్పోయినట్టేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు తనకు న్యాయం జరగాలని మాధురి రాథోడ్ ఇప్పటికి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూనే ఉంది.

### ఈశ్వర్ సాయి

కేవలం మాధురి రాథోడ్ మాత్రమే కాకుండా ఈశ్వర్ సాయి కూడా ఈ వివాదంలో పీకలలోతు కూరుకుపోయాడు. బాసింగ బలాలు అనే పాట ద్వారా ఏ స్థాయిలో అయితే గుర్తింపు తెచ్చుకున్నాడో .. మాధురి రాథోడ్తో రెడ్ హ్యాండెడ్ గా దొరికి అదే స్థాయిలో తన పరువు పోగొట్టుకున్నాడు. ఇప్పట్లో అతడు ఫోక్ సాంగ్స్ లో కనిపించడం దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఇప్పటికే అతడు మాధురి రాథోడ్ పోలీసులకు చేసిన ఫిర్యాదులు నేపథ్యంలో అజ్ఞాతంలో ఉన్నాడు.



ఒకవేళ అతడు బయటికి వస్తే పోలీసులు అరెస్ట్ చేస్తారు. బెయిల్ మీద బయటకు వచ్చినప్పటికీ ఒకప్పటిలాగా ఈశ్వర్ సాయికి సొసైటీలో గౌరవం ఉండదు. పైగా ప్రొడ్యూసర్లు కూడా ముందుకు రారు.

### మధుప్రియ

తెలంగాణ ఉద్యమంలో పాటలు పాడి ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకుంది మధుప్రియ. ఆడపిల్లనమ్మా నేను ఆడపిల్లనంటూ పాడిన ఒక పాట ఆమెకు తిరుగులేని స్థాయిని అందించింది. అయితే ఆమె కాళేశ్వరం ఆలయంలో గర్భగుడిలో ఒక ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ షూటింగ్ చేయడం తీవ్రమైన వివాదానికి దారి తీసింది. సాధారణంగా కాళేశ్వరం ఆలయంలో గర్భగుడిలోకి మొబైల్ ఫోన్లు.. కెమెరాలకు అనుమతి ఉండదు. అలాంటిది మధుప్రియ బృందం ఏకంగా కెమెరాలతోనే గర్భగుడిలో షూటింగ్ చేయడం పట్ల హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బిజెపి నాయకులు కూడా తీవ్రస్థాయిలో ఆమె మీద మండిపడ్డారు. మరోవైపు నాడు మధుప్రియ చేసిన పనికి ఆలయ పూజారికి దేవాదాయ శాఖ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. మధుప్రియ 2015లో తన తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా శ్రీకాంత్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పట్లో ఈ వ్యవహారం మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. వివాహం జరిగిన కొద్ది రోజులకే తన భర్త శ్రీకాంత్ అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని మధుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. చివరికి పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. ఆ తర్వాత వారిద్దరూ విడాకులు తీసుకున్నారు.

మరోవైపు ఇటీవల రేవంత్ రెడ్డి పై కూడా మధుప్రియ సంచలన వ్యాఖ్యలు చేసింది. తాను కేవలం కేసీఆర్ కు మాత్రమే పాటలు పాడతానంటూ వ్యాఖ్యానించింది. దీని పట్ల కాంగ్రెస్ నాయకులు తీవ్ర

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

## 76-దేవరకద్ర నియోజకవర్గ అధికారులతో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 12(జిల్లా ప్రతినిధి)ఓటర్ల జాబితాను దోషరహితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (SIR–2026) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. 76–దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (AEROs), BLO సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో SIR–2026 కార్యక్రమం పురోగతిని అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలనను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్దేశిత గడువులోగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు, అన్‌మ్యాప్డ్ ఓట్లు, ఇతర మార్పులకు సంబంధించి అవసరమైన నోటీసులను సంబంధిత ఓటర్లకు వెంటనే అందజేయాలని దీూలను ఆదేశించారు. క్షేత్రస్థాయి విచారణలను పారదర్శకంగా నిర్వహించి, నివేదికలను సకాలంలో సమర్పించాలని సూచించారు. ఫారం–6




ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫారం–7 ద్వారా తొలగింపులు/ఆక్షేపణలు, ఫారం–8 ద్వారా మార్పులు, సవరణలకు అందిన దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి సెప్టెంబర్ 12వ తేదీతో ప్రత్యేక ప్రచార దినాలు ముగిసిన నేపథ్యంలో, ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, అభ్యర్థనలు, సవరణలకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు పరిశీలించి, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. BLO సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ దీూలు నిర్వహించిన పనులను క్రాస్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలన, దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతతో పాటు ఓటర్లందరూ తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు, మార్పులు ఉన్నట్లయితే సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొత్త ఓటరు నమోదు, పేరు తొలగింపు లేదా వివరాల సవరణకు సంబంధించి ఫారం–6, ఫారం–7, ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా సంబంధిత దరఖాస్తులను సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. దోషరహితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఓటర్లు కూడా తమ వివరాలను సరిచూసుకుని సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ కోరారు

# స్త్రీనిధి రుణాల్లో రూ.30 లక్షల అవకతవకలు

- సంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి ఘరానా మోసం
- అవకతవకలపై సంఘ సభ్యుల ఆగ్రహం




హైదరాబాద్, సెప్టెంబర్ 12 : సంగారెడ్డి జిల్లా కంది మండలం పాతకంది గ్రామ సంఘంలో మహిళా సంఘాలకు మంజూరైన స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తేలింది. వివిధ మహిళా సంఘాల పేర్లపై మంజూరైన రుణాల్లో సుమారు రూ.30 లక్షల మేర నిధులను మాజీ వీవోఏ వినియోగించినట్లు విచారణ నివేదికలో వెల్లడైనట్లు సమాచారం. రుణాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మహిళలకు ఈ వ్యవహారం తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. దీంతో సదురు మహిళా సభ్యులు మంగళవారం కందిలో నిర్వహించిన డ్వాక్రా మహిళా సంఘాల సమావేశంలో అధికారులను నిలదీశారు.వీవోఏ మార్పు.. వెబ్‌సైట్‌లో నమోదు కాలేదంటూ నివేదిక గత ఏడాది జనవరిలో గ్రామ సంఘం వీవోఏను తొలగించి కుమ్మరి పుష్పలతను కొత్త వీవోఏగా ఎన్నుకున్నట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు ఆమె పేరు సెర్ప్ ఐబీ వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ రూ.50 వేల గౌరవ వేతనం డ్రా చేసి ఆమెకు చెల్లించినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. గ్రామ సంఘ సమావేశాలకు మండల సమాఖ్య నుంచి కమ్యూనిటీ కోఆర్డినేటర్ క్రమం తప్పకుండా హాజరు కాకపోవడం, ఏపీఎం స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ అవకతవకలకు అవకాశం ఏర్పడినట్లు విచారణ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. విచారణలో సుమారు రూ.30 లక్షల మేర అవకతవకలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు గుర్తించినప్పటికీ.. ఇప్పటి వరకు మాజీ వీవోఏపై కఠిన చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సంబంధిత మహిళా సంఘాలకు కొత్త రుణాల మంజూరు కూడా నిలిచిపోయింది.తమకు రావాల్సిన రుణాలను వెంటనే మంజూరు చేయడంతో పాటు, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలపై ఆధారపడుతున్న తమకు ఈ పరిణామం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వారు పేర్కొంటున్నారు. బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

# విజయవంతంగా జాతీయ లోక్ అదాలత్




హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 ( విజన్ ఆంధ్ర ): జాతీయ లోక్ అదాలత్ లో వరంగల్ జిల్లా వ్యాప్తంగా – 09 బెంచీలను వరంగల్ జిల్లాలో–06, నర్సంపేట– 03 బెంచీలను ఏర్పాటు జరిగింది. మొత్తం–520 పెండింగ్ కేసులను పరిష్కరించడం జరిగింది. ఇందులో సివిల్ కేసులు–64, యమ్.వి.ఓ.పి. కేసులు–53, (రూ.6,72,17,640/–), అదర్ సివిల్ కేసులు–11, క్రిమినల్ కేసులు–456 మరియు బ్యాంక్ పి.ఎల్.సి. కేసులు–26, బి.ఎస్.ఎన్.ఎల్.పి.యల్.సి.కేసులు– 06, ట్రాఫిక్ ఈ–ఛాలన్ పెట్టి కేసులు– 63,002, సైబర్ క్రైమ్–19 కేసులను పరిష్కరించడం జరిగింది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా – 12 బెంచీలను హనుమకొండ జిల్లాలో–11, నర్సంపేట– 01 బెంచీలను ఏర్పాటు జరిగింది. మొత్తం–734 పెండింగ్ కేసులను పరిష్కరించడం జరిగింది. ఇందులో సివిల్ కేసులు–56, యమ్.వి.ఓ.పి. కేసులు–47 (రూ.61,25,961/–), క్రిమినల్ కేసులు–678 మరియు బ్యాంక్ పి.ఎల్.సి. కేసులు–41, ఎలక్ట్రిసిటి పి.యల్.సి.కేసులు–17, ట్రాఫిక్ ఈ–ఛాలన్ పెట్టి కేసులు– 36,622, సైబర్ క్రైమ్–18 పరిష్కరించడం జరిగింది.ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగించడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ న్యాయసేవాధికార సంస్థ ద్వారా వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఇరువురు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పాదయాత్రే.. సర్వరోగనివారిణి....



విజయవాడ, సెప్టెంబర్ 12 : ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల క్యాడర్‌తో, నేతలతో మాట్లాడేటప్పుడు కళ్లు మూసుకుందాం.. కాలం గడిచిపోతుంది అనే ఊతపదాన్ని పదే పదే వాడుతుండటం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిత్యం క్షేత్రస్థాయిలో ఎండగట్టడం, ప్రజల్లో ఉండి నిరసనలు చేయడం కంటే.. ఐదేళ్ల కాలాన్ని దాటవేయడమే ప్రధాన వ్యూహంగా ఆయన భావిస్తున్నట్లు కనిపిస్తోంది. మరో ఏడాది ఓపిక పడితే కళ్లు మూసుకునేలోపు పాదయాత్ర సమయం వచ్చేస్తుందని, ఆ ఒక్క పాదయాత్ర చేస్తే చాలు మళ్లీ ఓటర్లు బ్రహ్మరథం పడతారని క్యాడర్‌కు నూరిపోస్తున్నారు. అయితే, వైసీపీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్రమైన రాజకీయ, సంస్థాగత సమస్యలకు పాదయాత్ర అనేది సర్వరోగ నివారిణి అని జగన్ నమ్మడం ఎంతవరకు సమంజసం?ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో పాదయాత్రలకు ఒక ప్రత్యేకమైన గ్లామర్, ఆకర్షణ ఉండేవి. వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు, ఆ తర్వాత వైఎస్ జగన్ చేసిన పాదయాత్రలు వారిని అధికార పీఠం ఎక్కించాయన్నది పచ్చి నిజం. కానీ, ఒకే రాజకీయ వ్యూహం ప్రతిసారీ పలికిస్తుందనుకోవడం పొరపాటే. 2019 నాటికి ఉన్న పరిస్థితులు, సోషల్ మీడియా ప్రభావం, ఓటర్ల మానసిక స్థితి వేరు.. నేటి పరిస్థితులు వేరు. ఒకప్పుడు పర్యటనల ద్వారా ప్రజలను కలవడం కొత్తగా ఉండేది, కానీ ఇప్పుడు డిజిటల్ యుగంలో నాయకుడి ప్రవర్తన, ప్రతిస్పందనలు ప్రతిరోజూ ప్రజల వద్దకే చేరుతున్నాయి. కేవలం ఎన్నికల ముందు ఐదు వేల కిలోమీటర్లు నడిచేస్తే అధికార పీఠం దక్కేంత అమాయకంగా నేటి ఓటర్లు లేరు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడటం, క్షేత్రస్థాయిలో కేడర్‌ను ముందుకు నడిపించడం ప్రధాన బాధ్యత. కానీ, "కళ్లు మూసుకుంటే ఐదేళ్లు గడిచిపోతాయి అనే ధోరణి పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యకర్తలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు, కేసులు, స్థానిక వివాదాల్లో తమకు అండగా నిలబడే నాయకత్వం కరువైందనే భావన వైసీపీ శ్రేణుల్లో ఉద్భవిస్తోంది. ప్రజా పోరాటాలు చేయకుండా, కేవలం తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమై ఎన్నికల ముందు వస్తా అని చెప్పడం వల్ల పార్టీ క్షేత్రస్థాయి పునాదులు మరింత బలహీనపడే ప్రమాదం ఉందనే విశ్లేషణలు వస్తున్నాయి.నేటి ఓటర్లు, ముఖ్యంగా జెన్ జీ, తటస్థ ఓటర్లు ఒక నాయకుడు నిరంతరం ఎలా స్పందిస్తున్నాడు, అసెంబ్లీకి వెళ్తున్నారా లేదా, ప్రజా సమస్యలపై ఎలాంటి ప్రతిపాదనలు ఇస్తున్నారనేది గమనిస్తున్నారు. 2019లో ఇచ్చిన హామీలు, ఆ తర్వాత ఐదేళ్ల పాలనను అనుభవించిన ప్రజలు, ఇప్పుడు కేవలం ఓదార్పులు లేదా సుదీర్ఘ నడకలకే ఓటేస్తారని భావించడం రాజకీయ అపరిపక్వత కిందకే వస్తుంది. పాదయాత్రలకు ఉన్న వాల్యూ కాలక్రమేణా తగ్గిపోయింది. పవన్ కల్యాణ్ చేసిన వారాహి యాత్ర లేదా లోకేష్ చేసిన యువగళం పాదయాత్రలు సైతం సాంప్రదాయ పాదయాత్రల రూపురేఖలను మార్చేశాయి. ఈ నేపథ్యంలో జగన్ పాత తరహా పాదయాత్రనే మళ్లీ నమ్ముకోవడం పెద్ద రిస్క్.వైసీపీ ఎదుర్కొంటున్న అసలు సమస్య పాదయాత్ర లేకపోవడం కాదు. ప్రతి చిన్న విషయానికీ అధినేతపైనే ఆధారపడే సంస్కృతి ఉంది. ఇలాంటి సమయంలో కళ్లు మూసుకుందాం అనే మంత్రం జపిస్తే.. రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికికే ప్రమాదం వస్తుంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్న పార్టీకి, నిరంతర ప్రజా ఉద్యమాలే ఊపిరి పోస్తాయి తప్ప, రాబోయే పాదయాత్ర కోసం చేసే నిరీక్షణ కాదు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర ను ఒక మాయాజాలంగా భావిస్తున్నారు. కానీ రాజకీయాల్లో కాలం దానంతట అదే మాయలు చేయదు. ప్రజా సమస్యలపై పోరాడకుండా, కేవలం కళ్లు మూసుకుని కాలం గడిపేస్తే మళ్లీ జనం ఓటేస్తారనుకోవడం రాజకీయ భ్రమ మాత్రమే. 2029 నాటికి రాజకీయ సమీకరణాలు, జనాభా మార్పులు, ఓటర్ల ప్రాధాన్యతలు ఎలా ఉంటాయో అంచనా వేయకుండా, ఒకే సెంటిమెంట్‌ను పదే పదే నమ్ముకుంటే అది వైసీపీకే పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉందనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అభిప్రాయం.

# చిన్న శీను ఓపెనర్ మాత్రమే!

విజయనగరం, సెప్టెంబర్ 12, : ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఉనికి



ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికి క్షేత్రస్థాయి పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దశాబ్దాల పాటు రాజకీయాన్ని శాసించిన ఉద్దండులైన సీనియర్ నేతలు సైతం ఇప్పుడు వైసీపీ జెండా మోసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గత ఎన్నికల్లో అధికార దర్పం, అపరిమితమైన ఆర్థిక బలం, పటిష్టమైన యంత్రాంగం ఉండి కూడా దాదాపుగా ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఓట్లకు పైగా భారీ వ్యత్యాసంతో ఓడిపోవడం సదరు నేతల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఆ ఘోర పరాభవం తర్వాతే అనేకమంది సీనియర్లు సైలెంట్ అయిపోగా, మరికొందరు ఇప్పటికే పార్టీకి గుడ్ బై చెప్పారు.ఉత్తరాంధ్ర సామాజిక సమీకరణాలను, ప్రజల ఆలోచనా ధోరణిని నిశితంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ మళ్లీ పూర్వవైభవాన్ని పుంజుకోవడం దాదాపు అసాధ్యమనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. దీంతో తమ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పరిస్థితిని ముందే అంచనా వేసిన సీనియర్ నాయకులు ఒక వ్యూహాత్మక నిర్ణయానికి వచ్చారు. తాము ప్రత్యక్ష రాజకీయాల నుంచి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించడం లేదా క్రియాశీల పాత్ర నుంచి తప్పుకోవడం ఒక మార్గమైతే.. తమ వారసులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కూటమి పార్టీలైన టీడీపీ లేదా జనసేనలోకి పంపించడం మరో ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు.ముఖ్యంగా విజయనగరం, విశాఖ జిల్లాల్లో బారీ స్థాయిలో సాగుతున్న ఈ వలసలు కేవలం ఆరంభం మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రాదేశిక, పురపాలక వర్గాల్లో ఉనికి కాపాడుకోవడానికి స్థానిక నేతలు డిఫెన్స్‌లో పడ్డారు. వైసీపీ గుర్తుపై పోటీ చేస్తే గెలుపు అవకాశాలు శూన్యమని భావిస్తున్న వీరు, కూటమిలోని ఏ పార్టీ తలుపు తడితే ఆ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి మద్దతు లేకుండా క్షేత్రస్థాయిలో రాజకీయాలు చేయడం సాధ్యం కాదనే స్పష్టత రావడంతో, క్యాడర్ మొత్తం ఒక్కొక్కటిగా ఖాళీ అవుతోంది.పార్టీ కేంద్రీకృత నాయకత్వ శైలి, ఎన్నికల ఫలితాల తర్వాత కనీస దిశానిర్దేశం లేకపోవడం కూడా ఈ సీనియర్ల నిష్క్రమణకు వేగవంతం చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకైనా క్షేత్రస్థాయి నాయకులే ఆయువుపట్టు. కానీ ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి ప్రసిద్ధ ముఖాల వరకు అందరూ జెండా ఎత్తేస్తుండటంతో వైసీపీ పూర్తిగా దెబ్బతింది. రాబోయే స్థానిక పోరు ముగిసేనాటికి ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ బోర్డు తిప్పేయడం లేదా నామమాత్రపు స్థానానికి పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

# నాగబాబుకు జోడు పదవుల రచ్చ..



గుంటూరు, సెప్టెంబర్ 12, : జనసేన పార్టీ ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ (కేబినెట్ హోదా) కొణిదెల నాగబాబు చిక్కుల్లో పడ్డారా?. ఆయనకు జోడు పదవుల వివాదం తలనొప్పిగా మారబోతుందా?. సోషల్ మీడియా వేదికగా అదే చర్చ జరుగుతోంది.. జోడు పదవుల అంశం తెరపైకి వచ్చింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం జోడు పదవులు ఉండకూడదంటూ సోషల్ మీడియా వేదికగా కొత్త చర్చ మొదలైంది. గతంలో జయా బచ్చన్‌పై జోడు పదవులతో అనర్హత వేటు పడిందని.. ఎమ్మెల్సీగా ఉన్న నాగబాబుపై అనర్హత వేటు పడుతుందని కొందరు ట్వీట్‌లు చేశారు.ఏపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ నాగబాబును ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించి కేబినెట్ హోదా కల్పించింది. ఆయన జీతభత్యాలు, అలవెన్సులకు సంబంధించి జీవోలో పేర్కొన్నారు. అయితే ఏదైనా ఉభయ సభల్లో సభ్యులుగా ఉన్నవారు ఇతర లాభదాయక పదవుల్లో ఉండకూడదని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని ఓ నెటిజన్ ట్వీట్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ)ని గుర్తు చేశారు.. ఒక వ్యక్తి అటు కేంద్ర ప్రభుత్వంలో కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వంలో కానీ లాభదాయకమైన పదవిలో ఉంటే.. వారి రాష్ట్ర శాసనసభ లేదా శాసనమండలి సభ్యుడిగా పదవిలో కొనసాగడానికి అనర్హుడవుతారని రాజ్యాంగంలో స్పష్టం ఉందని పేర్కొన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తూ ఎమ్మెల్సీ నాగబాబుకు కేబినెట్ హోదా, నెలకు 3.80 లక్షల రూపాయల జీతభత్యాలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది నూటికి నూరు శాతం ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) కిందకు వస్తుంది కాబట్టి ఎమ్మెల్సీ నాగబాబు మీద అనర్హత వేటు పడుతుందని చెప్పుకొచ్చారు. నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఉండగానే మళ్లీ ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి కేబినెట్ ర్యాంకుతో ఇవ్వడం, వేతనం పొందడం రాజ్యాంగ విరుద్ధమనేది కొందరి వాదన.. ఇదే అంశాన్ని ట్వీట్‌లో ప్రస్తావించారు.గతంలో జయాబచ్చన్‌పై ఇలాగే అనర్హత వేటు పడిందంటున్నారు. జయా బచ్చన్ గతంలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్న సమయంలో.. మళ్లీ ఉత్తరప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. భారత రాజ్యాంగం ప్రకారం ఈ పదవి ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ (లాభదాయక పదవి) పరిధిలోకి వస్తుందని ఎన్నికల సంఘం పేర్కొంది. జయా బచ్చన్ రాజ్యసభ ఎంపీ పదవిపై మార్చి 2006లో అనర్హత వేటు పడింది. జయా బచ్చన్ మాత్రమే కాదు మరికొన్ని ఉదాహరణలు ఉన్నాయని చెబుతున్నారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(ఏ) ప్రకారం.. ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఉన్న వ్యక్తి ప్రభుత్వం నుంచి వేతనం, ప్రతిఫలం వచ్చే మరో లాభదాయక పదవి (ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్)లో ఉండకూడదు. ఒకవేళ లాభదాయక పదవిని చేపడితే ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ పదవిపై అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. ఈ రూల్‌నే ప్రధానంగా నాగబాబు విషయంలో ప్రస్తావిస్తున్నారు. అదే సమయంలో నాగబాబుపై అనర్హత వేటు పడకుండా ఏపీ ప్రభుత్వానికి మరో వెసులుబాటు కూడా ఉందనే వాదన వినిపిస్తోంది. ఇక్కడ మినహాయింపు చట్టాన్ని ప్రధానంగా గుర్తు చేస్తున్నారు. ఈ చట్టం ప్రకారం.. రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేకంగా చట్టం చేసి కొన్ని పదవులకు ఈ అనర్హత నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం కూడా ఉందని కొందరు గుర్తు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ వేతనాలు, పింఛన్ల చెల్లింపు అనర్హతల తొలగింపు చట్టం, 1953 ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్పొరేషన్లు, సొసైటీలు, కమిటీల ఛైర్మన్ పదవులను ఈ మినహాయింపు జాబితాలో చేరుస్తుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవిని.. అనర్హతల తొలగింపు చట్టం ప్రకారం.. మినహాయింపు పొందిన పదవిగా గుర్తించాల్సి ఉంటుంది. అప్పుడు న్యాయపరంగా ఎలాంటి చిక్కులు ఉండవనే మరో వాదన తెరపైకి వచ్చింది. రెండు పదవుల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు ఒక పదవికి మాత్రమే ఆర్థిక వేతనం తీసుకోవడం, రెండో పదవికి అలవెన్సులను కేవలం అధికారిక ఖర్చులకు మాత్రమే పరిమితం చేయొచ్చు. అప్పుడు లాభదాయక పదవి వివాదం రాకుండా చూడొచ్చు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాగబాబు పదవిని అనర్హతల తొలగింపు చట్టం పరిధిలోకి తీసుకొచ్చినా.. నిబంధనల ప్రకారం ఆర్థిక ప్రయోజనాల విషయంలో మార్పులు చేస్తే చట్టబద్ధమైన పదవిగా మారుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తావిస్తున్న అంశాలపై ఏపీ ప్రభుత్వం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# ప్రైవేటీకరణ వివాదంలో ఇస్రో




విజయవాడ, సెప్టెంబర్ 12 : ఇస్రో ప్రైవేటీకరణ అంశం చుట్టూ వివాదం రాజుకుంది.ఇస్రో ప్రైవేటీకరణ అంశంపై స్పష్టత ఇవ్వాలంటూ ఆ సంస్థకు చెందిన తొమ్మిది ఉద్యోగ సంఘాలు చైర్మన్‌కు లేఖ రాయడం ఈ అంశంపై చర్చకు దారితీసింది.అయితే, ఈ ప్రైవేటీకరణ అంశం 'నిరాధారమైనది' అని ఇస్రో చెబుతోంది.ఇదే విషయంపై ఇండియన్ నేషనల్ - స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ చైర్మన్ పవన్ కుమార్ గోయెంకా 'ఎక్స్'లో స్పందించారు.'భారత అంతరిక్ష రంగానికి ఇస్రో మూల స్తంభంగా ఉంటుంది" అని ఆయన చెప్పారు.న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) తరఫున ఇస్రో తయారు చేసిన ఎన్నో సాంకేతికతలు వాణిజ్య అవసరాలకు వాడుకునేందుకు స్టార్టప్‌లకు బదిలీ అయ్యాయని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారిక సమాచారం ప్రకారం తెలుస్తోంది.అయితే, ప్రైవేటు సంస్థల కారణంగా భారత అంతరిక్ష రంగం అభివృద్ధికి ఊతం ఇచ్చినట్లవుతోందని స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ కో-ఫౌండర్ పవన్ కుమార్ చెప్పారు.సెప్టెంబరు 5న జీఎస్ఎల్వీ ద్వారా ఇస్రో జియో ఇమేజింగ్ శాటిలైట్‌ను ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతమైనట్లు ప్రకటించింది.ఇది జరిగిన కొన్ని గంటల తర్వాత ఇస్రోలోని తొమ్మిది ఉద్యోగ సంఘాలు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్‌కు బహిరంగ లేఖ రాశాయి.ప్రైవేటీకరణ, భవిష్యత్తులో ఇస్రో పాత్ర తదితర అంశాలను ప్రస్తావిస్తూ లేఖను విడుదల చేశారు ఉద్యోగులు.ఉద్యోగ సంఘాల తరఫున ఇస్రోలోని 5వేల మంది ఉద్యోగులకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నామని, మొత్తం 18,100 మంది ఉద్యోగులలో తమ సంఘాల ప్రతినిధులు 27శాతం మంది ఉన్నారని అందులో ప్రస్తావించారు.అసలు ఈ వివాదానికి ఆగస్టులో ఇన్-స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి.రానున్న రోజుల్లో రాకెట్లు (లాంచ్ వెహికల్స్)ను ఇస్రో స్వయంగా తయారు చేయదు. వాటి తయారీ బాధ్యత ప్రైవేటు సంస్థలు లేదా ప్రభుత్వ రంగ సంస్థలకే అప్పగిస్తాం. ఇప్పటికే ఎస్ఎస్ఎల్వీ ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలోనే తయారువుతోంది.రోజువారీ ప్రయోగాలకు ఉపయోగించే లాంచ్ వెహికల్స్ కాకుండా ప్రత్యేక సందర్భాలు, పరిశోధనలు, ప్రత్యేక కక్ష్యలో ప్రవేశపెట్టే రాకెట్లను తయారు చేసే సాంకేతికతపై ఇస్రో దృష్టి పెడుతుంది. ఆ తర్వాత ఆ టెక్నాలజీని కూడా ప్రైవేటు రంగానికి బదిలీ చేస్తుంది" అని పవన్ గోయెంకా చెప్పారు.ఇప్పటికే 120 రకాల టెక్నాలజీలను ప్రైవేటు సెక్టార్‌కు బదిలీ చేశామని చెప్పారు పవన్ గోయెంకా.ఈ వ్యాఖ్యలు భారత అంతరిక్ష రంగంలో పెద్దఎత్తున చర్చకు దారి తీశాయి ఇస్రోను ప్రైవేటీకరిస్తారని లేదా దాని పాత్రను తగ్గించే ప్రయత్నం జరుగుతోందనే ఊహాగానాలు, తప్పుదోవ పట్టించే సమాచారం ప్రచారం జరుగుతోంది. ఇది పూర్తిగా తప్పు, నిరాధారం" అని ఇస్రో చెప్పింది.అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచడమంటే ఇస్రో పాత్రను తగ్గించడం కాదని సంస్థ స్పష్టం చేసింది."భారత అంతరిక్ష రంగానికి నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతల వృద్ధిపై ఇస్రోకు వీలు కల్పించాలన్నదే దీని ప్రధాన ఉద్దేశం" అని చెప్పింది.అంతరిక్ష రంగంలో భారత్ అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రైవేటు రంగం కీలకమని స్కైరూట్ ఏరోస్పేస్ కో ఫౌండర్ పవన్ కుమార్ చందన చెప్పారు.భారత తొలి ప్రైవేటు ఆర్బిటాల్ రాకెట్ 'విక్రమ్ -1'ను స్కైరూట్ ఏరోస్పేస్ ఇటీవలే విజయవంతంగా ప్రయోగించింది."ఇస్రో, ప్రైవేటు స్పేస్ సెక్టార్‌లను కలిపే చూడాలి. అందులో ఇస్రో కీలకమైనది. ప్రైవేటు సెక్టార్ కంపెనీలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. ఈ రెండూ కలిస్తేనే భారత అంతరిక్ష రంగం ముందుకు సాగుతుంది" అని ఆయన చెప్పారు.కేంద్ర ప్రభుత్వం 2023లో 'ఇండియన్ స్పేస్ పాలసీ' తీసుకువచ్చింది. 2024 ఫిబ్రవరిలో స్పేస్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది.ఆ తర్వాత అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లు పెద్దఎత్తున వచ్చాయి. ప్రైవేటు కంపెనీల నియంత్రణ, ప్రోత్సాహకానికి ఇన్-స్పేస్ పనిచేస్తుంది.భారత్‌లో 2033 నాటికి స్పేస్ ఎకానమీ (అంతరిక్ష రంగ ఆర్థిక వ్యవస్థ) 45 బిలియన్ డాలర్ల (సుమారు 4,248,000 కోట్లు)కు చేరుకుంటుందని అంచనా. ఇందులో 11 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1,038,000 కోట్లు )విలువైన ఎగుమతులు ఉంటాయని భారత్ అంచనా వేస్తోంది.ఈ ఏడాది జులై నాటికి భారత్ స్పేస్ ఏకానమీ సుమారు 8.4 బిలియన్ డాలర్లుగా ఉందని పీఐబీ వెల్లడించింది.2014లో ఒకే ఒక్క స్పేస్ టెక్నాలజీ స్టార్టప్ ఉండగా ఈ ఏడాది మార్చి 31 నాటికి భారత స్టార్టప్‌లలో పెట్టుబడులు 618.5 మిలియన్ యూఎస్ డాలర్లకు (సుమారు రూ. 58,340 కోట్లు) చేరుకున్నాయి.2021-22 లో ఈ పెట్టుబడులు 100.5 మిలియన్ డాలర్లు( సుమారు రూ. 9,480 కోట్లు) ఉండగా.. ఈ ఏడాది మార్చి నాటికి ఆరు రెట్లు పెరిగాయి.ఈ ఆగస్టు నాటికి భారత్‌లో 440 స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌లు రిజిస్టర్ అయినట్లు డీపీఐఐటీ స్టార్టప్ ఇండియా పోర్టల్ లెక్కలు చెబుతున్నాయని పీఐబీ రిపోర్టు చేసింది.ప్రస్తుతం భారత్‌లో ఉన్న స్పేస్ టెక్నాలజీ స్టార్టప్‌లలో 18 స్టార్టప్‌లతో పాటు 52 ప్రభుత్వేతర సంస్థలకు కలిపి అంతరిక్ష రంగ కార్యకలాపాలు నిర్వహించేందుకు 113 ఆథరైజేషన్స్ దక్కాయి."ప్రైవేటు సెక్టార్ పురోగతి అనేది భారత అంతరిక్ష రంగానికి 'బూస్ట్' అవుతుంది. వేలాది ఉద్యోగాలు వస్తాయి.

గత మూడేళ్లలో 5వేల ఉద్యోగాలు రాగా, బిలియన్ డాలర్ల పెట్టుబడులు ప్రైవేటు స్పేస్ రంగంలోకి వచ్చాయని గణంకాలు స్పష్టం చేస్తున్నాయి" అని బీబీసీతో పవన్ కుమార్ చందన చెప్పారు.ఇస్రో వినియోగిస్తున్న యంత్రాలలో 80శాతం భాగాలు ప్రైవేటు కంపెనీలే తయారు చేస్తున్నాయని చెప్పారు పవన్ కుమార్ చందన.ఎస్ఎస్ఎల్వీ సాంకేతికతను 2025 సెప్టెంబరు 10న హెచ్ఏఎల్‌కు ఇస్రో, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), ఇన్-స్పేస్ సంయుక్తంగా బదలాయించాయి.ఇవి కాకుండా ఇస్రో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ తయారు చేసిన దాదాపు 83 రకాల సాంకేతికతలను బదిలీ చేసేందుకు వివిధ సంస్థలతో ఇన్-స్పేస్ సమన్వయంతో 118 ఒప్పందాలు చేసుకుంది ఎన్ఎస్ఐఎల్.ఇందులో ఎస్ఎస్ఎల్వీ సాంకేతికత సహా ఇండియన్ మినీ శాటిలైట్-1 బస్, ఇస్రో లేజర్ గైరో (ఐఎల్జీ), ట్రై బ్యాండ్ (ఎస్, ఎక్స్, క) యాంటెన్నా ఫీడ్, సిరామిక్ సెర్వో యాక్సెలెరోమీటర్ వంటి సాంకేతికతలున్నాయి.2022లో అగ్నికుల్ కాస్మోస్, స్కైరూట్ ఏరోస్పేస్, పిక్సెల్ మొదలైన స్టార్ట్ ప్పులకు వివిధ టెక్నాలజీల బదలాయింపు మొదలవగా.. ఇప్పటికీ స్పేస్ రంగంలో స్టార్టప్పులకు టెక్నాలజీ బదలాయింపు కొనసాగుతోంది.రానున్న సంవత్సరాల్లో కమర్షియల్ రాకెట్ల ప్రయోగానికి భారత్ సిద్ధమవుతోంది. ఇప్పటికే స్కైరూట్ ఏరో స్పేస్ 2022లో సబ్ ఆర్బిటాల్ రాకెట్, 2026లో ఆర్బిటాల్ రాకెట్లను ప్రయోగించింది.2026-27 ఆర్థిక సంవత్సరంలో రెండు రాకెట్ ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇన్-స్పేస్ ప్రకటించింది.అలాగే 2027-28 ఆర్థిక సంవత్సరంలో ఆరు ప్రైవేటు రాకెట్ ప్రయోగాలు చేపట్టాలని అంచనా కాగా, ఆయా ప్రయోగాలకు ఇంకా అనుమతులు రావాల్సి ఉందని ఇన్-స్పేస్ చెబుతోంది.

# ఫైళ్ల క్లియరెన్స్ లో అచ్చెన్న ఫస్ట్... లాస్ట్ పయ్యావుల


విజయవాడ, సెప్టెంబర్ 12: మంత్రులతో పాటుగా అధికారులు ఫైళ్లన్నీ త్వరగా, అదే రోజు క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో తేల్చి చెప్పారు. మంత్రుల విషయానికి వస్తే.. ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మొదటి స్థానంలో నిలిచారని చంద్రబాబు ప్రశంసించారు. అచ్చెన్నాయుడు ఫైళ్ల పరిష్కారంలో వేగంతో పాటు స్పష్టత, పారదర్శకత, సామర్థ్యానికి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అచ్చెన్నాయుడు తర్వాత రెండో స్థానంలో నిమ్మల రామానాయుడు, మూడో స్థానంలో బీసీ జనార్దన్ రెడ్డి, నాలుగో స్థానంలో ఎన్ఎండీ ఫరూక్, ఐదోస్థానంలో టీజీ భరత్ ఉన్నారని తెలిపారు. చివరి రెండుస్థానాల్లో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పయ్యావుల కేశవ్ ఉన్నారు.ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు మంత్రులు ఫైల్స్ క్లియర్ చేసేందుకుఎంత సమయం తీసుకున్నారనే వివరాలతో మంత్రులకు ర్యాంకులను ప్రకటించారు. మంత్రి అచ్చెన్నాయుడు సగటున గంటా 51 నిమిషాలకు ఒక ఫైల్ చొప్పున క్లియర్ చేశారు. ఒక్కో ఫైల్ క్లియర్ చేయడానికి గరిష్ఠంగా ఆరేడు రోజులకు పైన సమయం తీసుకున్న మంత్రులు చివరి స్థానాల్లో ఉన్నారు. ఈ మేరకు జూన్ 9 నుంచి సెప్టెంబర్ 9 వరకు క్లియర్ చేసిన ఫైల్స్ ప్రకారం మంత్రుల ర్యాంకుల వివరాలు ఇలా ఉన్నాయి.అచ్చెన్నాయుడు 675 ఫైళ్లను క్లియర్ చేయగా.. ఒక్కో ఫైల్‌కు గంటా 51 నిమిషాలు సమయం తీసుకుని మొదటి స్థానంలో ఉన్నారు.

నిమ్మల రామానాయుడు 410 ఫైళ్లు క్లియర్ చేశారు.. ఆయను ఒక్కో ఫైల్‌కు 6 గంటల 30 నిమిషాల సమయం తీసుకుని రెండో స్థానంలో నిలిచారు. మూడో స్థానంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి 148 ఫైళ్లను క్లియర్ చేసి ఒక్కో ఫైల్‌కు 6 గంటల 52 నిమిషాల సమయం తీసుకున్నారు. నాలుగో స్థానంలో ఎన్ఎండీ ఫరూక్ 275 ఫైల్స్ క్లియర్ చేశారు.. ఒక్కో ఫైల్‌కు 15 గంటల ఒక నిమిషం సమయం పట్టింది. ఐదో స్థానంలో టీజీ భరత్ 238 ఫైల్స్, ఒక్కో ఫైల్‌కు 19 గంటల 51 నిమిషాలు.. ఆరో స్థానంలో పొంగూరు నారాయణ 643 ఫైళ్లు.. ఒక్కో ఫైల్‌కు 20 గంటల 39 నిమిషాలు.. ఏడో స్థానంలో కొలుసు పార్థసారథి 80 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒకరోజు 47 నిమిషాలు.. ఎనిమిదో స్థానంలో డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి 131 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒకరోజు 3 గంటల 32 నిమిషాలు.. 9వ స్థానంలో మంత్రి లోకేష్ 1166 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒకరోజు 7 గంటల 43 నిమిషాలు.. 10వ స్థానంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ 773 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒకరోజు 9 గంటల 8 నిమిషాల సమయం పట్టింది.ఇక 11వ స్థానంలో సత్యకుమార్ యాదవ్ 468 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒక రోజు 16 గంటల 55 నిమిషాలు.. 12వ స్థానంలో వాసంశెట్టి సుభాష్ 148 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒక రోజు18 గంటల 59 నిమిషాలు.. 13వ స్థానంలో ముఖ్యమంత్రి కార్యాలయం 1542 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒక రోజు 20 గంటల 5 నిమిషాలు.. 14వ స్థానంలో గొట్టిపాటి రవికుమార్ 134 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు ఒక రోజు 20 గంటల 5 నిమిషాలు.. 15వ స్థానంలో కొండపల్లి శ్రీనివాస్ 45 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు రెండు రోజుల 5 గంటల 3 నిమిషాలు.. 16వ స్థానంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 612 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు 2 రోజుల 15 గంటల 29 నిమిషాలు.. 17వ స్థానంలో గుమ్మిడి సంధ్యారాణి 119 ఫైళ్లు, ఒక్కో ఫైల్‌కు 2 రోజుల 20 గంటల 41 నిమిషాల సమయం పట్టింది. ఇక 18వ స్థానంలో నాదెండ్ల మనోహర్, 19వ స్థానంలో కందుల దుర్గేష్, 20 స్థానంలో వంగలపూడి అనిత, 21వ స్థానంలో ఆనం రామనారాయణరెడ్డి, 22వ స్థానంలో ఎస్ సవిత, 23వ స్థానంలో కొల్లు రవీంద్ర, 24వ స్థానంలో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, 25వ స్థానంలో పయ్యావుల కేశవ్ నిలిచారు.

# ప్రతిపక్ష నేతలు అసెంబ్లీ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు తగదు

- అసెంబ్లీ ప్రజా సమస్యలు చర్చించడానికా లేదా
- వ్యక్తిగత ఆరోపణలకు వేదికా...!
- ప్రజాసమస్యలు గాలికి - వ్యక్తిగత దూషణల రచ్చ!




నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, ( విజన్ ఆంధ్ర ): శాసనసభ (అసెంబ్లీ) అనేది సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి చట్టాలు చేయడానికి, జనం కష్టాలకు పరిష్కారాలు కనుగొనడానికి ఉద్దేశించిన అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక. కానీ ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల తీరు చూస్తే ప్రజలకు నిరాశే మిగులుతోంది. ప్రజల ప్రాథమిక సమస్యలు, ఉపాధి, రైతు కష్టాలు పక్కనపడి, నాయకుల వ్యక్తిగత ఆరోపణలు, దూషణలకే ప్రాధాన్యం పెరుగుతోంది.

ప్రధాన సమస్యల పక్కదారి రైతుల రుణమాఫీ, తాగునీరు–సాగునీటి సమస్యలు, విద్యుత్ కోతలు, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి అనేక అంశాలపై చర్చ జరగాల్సి ఉంది. కానీ సభ ప్రారంభం కాగానే ప్రజాప్రతినిధులు పరస్పరం దూషణలకు దిగడం, గందరగోళం సృష్టించడం పరిపాటిగా మారింది.

**సభలో కనిపిస్తున్న ధోరణులు - వ్యక్తిగత విమర్శలు :**

నాయకులు విధానపరమైన అంశాలపై విమర్శలు చేయడం మానేసి, రాజకీయ ప్రత్యర్థుల కుటుంబాలు, వ్యక్తిగత జీవితాలపై దూషణలకు దిగుతున్నారు. వాకౌట్లు – నినాదాల రచ్చ: ప్రజా సమస్యలపై నిలదీయాల్సిన సమయాన్ని స్పీకర్ పోడియంను ముట్టడించడం, నినాదాలు చేయడం, సభను వాయిదా వేయించడానికే కేటాయిస్తున్నారు. పబ్లిసిటీ రాజకీయాలు: అసెంబ్లీలో సబ్జెక్టివ్ చర్చల కంటే సోషల్ మీడియాలో క్లిప్పింగ్‌లు, వైరల్ వీడియోలు సాధించడానికే నాయకులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**సభ సమయం - ప్రజల సొమ్ము వృథా**

అసెంబ్లీ నిర్వహణకు ప్రతి నిమిషానికి లక్షల రూపాయల ప్రజల పన్నుల సొమ్ము ఖర్చు అవుతుంది. కానీ వ్యక్తిగత పగలు తీర్చుకోవడానికి, పరస్పర బూతులు తిట్టుకోవడానికి సభ సమయం వృథా అవ్వడంతో సాధారణ పౌరులు ప్రజలు విద్యావంతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## కరెంటు కోతలకు నిరసనగా రైతుల ధర్నా



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ (యస్ ఈ) కార్యాలయం ముందు భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం రైతులు పార్టీలకతీతంగా ధర్నా నిర్వహించారు. నాణ్యమైన విద్యుత్తును అందించాలని, 18 గంటల విద్యుత్తును రెండు దాపాలుగా ఇవ్వాలని, లో వోల్టేజ్ కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ ఓల్డ్ నేషనల్ హైవే పై రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో పైడి విట్టల్ రెడ్డి, రైతులు తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ శ్రీధర్ గౌడ్, ఎస్సై రంజిత్ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎస్ ఈ సాల్యా నాయక్ ధర్నా వద్దకు వచ్చి రైతులతో మాట్లాడి రైతులు అందించిన వినతం వినతి పత్రాన్ని స్వీకరించారు, ఉన్నతఅధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ విజయం: లోక్ అదాలత్‌లో 3,200 కేసుల పరిష్కారం




తెలంగాణ స్టేట్ బ్యూరో,విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 12: జాతీయ లోక్ అదాలత్‌లో మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ శాఖ సత్తా చాటింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,200 కేసులను విజయవంతంగా పరిష్కరించింది. జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ పర్యవేక్షణలో పోలీసులు ఈ ఘనత సాధించారు.
పరిష్కారమైన కేసుల్లో 432 FIR కేసులు, 752 డీడీ కేసులు, 1,988 ఈ–పెట్టీ కేసులు, 57 సైబర్ క్రైమ్ కేసులు ఉన్నాయి. సైబర్ మోసాలకు గురైన బాధితులకు పోలీసులు పెద్ద ఊరట కలిగించారు. 57 సైబర్ కేసులకు సంబంధించి రూ.56,65,935 నగదును రికవరీ చేసి తిరిగి బాధితులకు అప్పగించారు. కోర్టు డ్యూటీ అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కేసులను పరిష్కరించారు. వారి కృషిని ఎస్పీ జానకి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ పేద ప్రజలకు త్వరిత న్యాయం అందించే వేదిక అని, పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని ఎస్పీ తెలిపారు.

# మృత్యువుకు చిరునామాగా పాత చర్ల

- నాటుసారా కోరల్లో చిక్కుకుపోతున్న యువత
- నాటు సారా కు బలైన యువకుడు
- కళ్ళ ముందే నాటు సారా వ్యాపారం జరుగుతున్న సోయిా లేని ఎక్సైజ్ శాఖ
- శాశ్వత పరిష్కారం చూపని తీరు





నాటు సారాకు బానిసై మృతి చెందిన వల్లెపు గోపి



చర్ల, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని పాత చర్ల గ్రామం ప్రస్తుతం తీవ్ర విషాదంలో కూరుకుపోయింది, నిత్యం పచ్చని ప్రకృతితో కళకళలాడాల్సిన ఆ ప్రాంతంలో, నేడు నాటుసారా రూపంలో మృత్యునగరి తాండవిస్తోంది, అక్రమ సారా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతుండటంతో ఇరవై నుంచి ముప్పై ఏళ్లలోపు యువకులే లక్ష్యంగా ప్రాణాలు కోల్పోతున్నారు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి సమీపంలో ఉండటంతో పాత చర్లలో నాటుసారా తయారీ, అమ్మకాలు దశాబ్దాలుగా నిరాటంకంగా కొనసాగుతున్నాయి, ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో కొందరు అక్రమార్కులు బెల్లం, నవసారం, యూరియా వంటి ప్రమాదకర రసాయనాలను కలిపి విషపూరిత సారాను తయారు చేస్తున్నారు, ఈ ప్రాణాంతక విషాన్ని తాగుతూ గత కొంతకాలంగా సుమారు పది మందికి పైగా యువకులు అంకాల మరణం చెందారు, పాతచర్లకు చెందిన ఇరవై ఐదు ఏళ్ల వయసున్న వల్లెపు గోపి అనే యువకుడు శనివారం ఇదే నాటుసారాకు బానిసై ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా కలకలం రేపింది, ప్రస్తుతం ఇదే ప్రాంతానికి చెందిన మరో నలుగురు ముప్పై ఏళ్లు నిండని యువకులు కిడ్నీ సంబంధిత వ్యాధులు , కాళ్లు, చేతులు ,ముఖం వాపులతో తీవ్ర అనారోగ్యం బారిన పడి వారికి తెలియకుండానే సమాజంలో తిరుగుతున్నప్పటికీ మృత్యువుకు చేరువలో ఉన్నట్లు స్థానికులు గుసగుసలాడుతున్నారు ఈ దారుణ పరిస్థితులపై ఎక్సైజ్ శాఖ అధికారుల వైఖరి తీవ్ర విమర్శలకు తావిస్తోంది, ఎక్కడో ఒకచోట నామమాత్రంగా దాడులు చేసి, కంటితుడుపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారే తప్ప, శాశ్వత నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి, అధికారులు గుడుంబా స్థావరాలను అప్పుడప్పుడు ధ్వంసం చేస్తున్నా, కొద్దిరోజులకే మళ్లీ యథావిధిగా వ్యాపారం సాగుతుండటంతో సారా ఏరులై పారుతోంది, కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండాల్సిన యువకులు పిట్టల్లా రాలిపోతుండటంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి గత కొద్ది కాలం క్రితం ఇదే ప్రాంతంలో సారా మత్తులో కాల్వలో పడి మరణించిన వ్యక్తిని మరువకముందే, మరికొందరు నాటు సారా కి బలి కావడం, సారా కాస్తున్న వారిని పట్టుకొని రెవెన్యూ శాఖ వీరిపై బైండ్‌ఓవర్ కేసులు పెడుతున్నప్పటికీ సునాయాసంగా డబ్బులు చెల్లించి బయటికి వచ్చి యధా విధంగా నాటుసారా కాస్త ఉండటం ఈ ప్రాంతంలో పరిపాటయింది, నాటు సారా అమ్మకాలు జరిపే ఇంటిలోని వ్యక్తులు మరణిస్తున్నప్పటికి సారా కాసే వారు ఇంకా కళ్ళు తెరుచుకోవడం శోచనీయం ఈ నేపథ్యంలో పాత చర్లలో నాటుసారా భూతాన్ని తరిమికొట్టేందుకు కాలం చెల్లకముందే స్థానిక మహిళలు, యువకులు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైంది, చట్టపరమైన చర్యలతో పాటు ప్రజల్లో చైతన్యం వచ్చి, సంపూర్ణ సారా నిషేధ ఉద్యమం లేవదీస్తేనే తప్ప ఈ ప్రాంతాన్ని మృత్యువు నుంచి కాపాడుకోవడం సాధ్యం కాదని మేధావులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండల కేంద్రంలో జోరుగా నాటు సారా అమ్మకాలు జరుగుతున్నాయి , నాటు సారా ఇది ఒక రహస్య వ్యాపారం, ఈ వ్యాపారం లో నాటు సారా కాసేదీ ఒకరు, దీనిని సరఫరా చేసేది మరొకరు, అమ్మకాలు సాగించిది ఇంకొకరు, ఇలా కూలినాలి చేసుకునే పేద, మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చే నడీ వయసు , చిన్నవయసు వారు (విష రసాయనాలు) ఈ నాటు సారా కు బానిసై వెర్రి పుంతలు తొక్కుతున్నారు, నాటు సారా తాగి అనారోగ్యం పాలై మృత్యు వాత పడుతున్నారు ఇంత జరుగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు సోయిా లేకుండా నిద్రపోతున్నట్టు వ్యవహరిస్తున్న తీరు పట్ల స్థానికులు మండిపడుతున్నారు, నాటు సారా వ్యాపారస్తులు నుంచి ఎవరికి ఎంత వాట ముడుతుందో అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా యంత్రాంగం కళ్లు తెరిచి కఠిన చర్యలు తీసుకోవాలని, యువత ప్రాణాలను బలిగొంటున్న ఈ దందాను మూలాలతో సహా అంతం చేయాలని పాత చర్ల యువకులు, మహిళలు కోరుతున్నారు

**శాశ్వత పరిష్కారం మార్గాల అన్వేషణ**

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా, బైండ్ ఓవర్ కేసులతో సరిపెట్టకుండా నాటుసారా తయారీదారులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగించాలి, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, సారా తయారీకి ఉపయోగించే ముడిసరుకుల రవాణాను పూర్తిగా అడ్డుకోవాలి, మహిళలు, యువకులు ఏకమై సంపూర్ణ సారా నిషేధం కోసం గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకుని ఉద్యమించడం అవసరం, అనారోగ్యంతో బాధపడుతున్న యువకులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, వారికి కౌన్సిలింగ్ మరియు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# నిరసనలు, ఆందోళనల సమయంలో సంయమనం పాటిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలి

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్స్‌కు దూరంగా ఉండాలి
- ప్రజలతో మర్యాదగా, చట్టబద్ధంగా వ్యవహరించాలి
- సిబ్బంది అభిప్రాయాలను తెలుసుకున్న ఎస్పీ




కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 12(విజన్ ఆంధ్ర) : నిరసనలు మరియు ఆందోళనల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు వ్యవహరించాల్సిన విధి విధానాలపై జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర, సిబ్బందికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.పోలీస్ శాఖలో హోంగార్డు స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు బందోబస్తు విధుల నిర్వహణ అత్యంత కీలకమైనదని, ముఖ్యంగా నిరసనలు మరియు ఆందోళనల సమయంలో ప్రతి పోలీసు సిబ్బంది తమ విధుల పట్ల పూర్తి అవగాహనతో, సంయమనంతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేసే హక్కును గౌరవిస్తూ, అదే సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితులను సమర్థవంతంగా నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని తెలిపారు. ఈ సందర్భంగా నిరసనలు, ఉద్యమాల సమయంలో పోలీసులు పాటించాల్సిన చేయాల్సినవి చేయకూడనివి అంశాలను సిబ్బందికి సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు.ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్ మరియు సోషల్ మీడియా వినియోగం విస్తృతంగా పెరిగిన నేపథ్యంలో పోలీసు సిబ్బంది మరింత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మడం లేదా ప్రచారం చేయకుండా, విధి నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంలో వృత్తి నైపుణ్యంతో వ్యవహరించాలని తెలిపారు. అనంతరం సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడిన జిల్లా ఎస్పీ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సిబ్బంది వ్యక్తం చేసిన అంశాలను ప్రస్తుత పరిస్థితుల్లో విశ్లేషిస్తూ, వాటి వల్ల పోలీస్ శాఖపై పడే అనుకూల, ప్రతికూల ప్రభావాలను వివరించారు.ఈ సందర్భంగా సిబ్బంది వ్యక్తిగత జీవితంలో కూడా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని ఎస్పీ వివరించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ దూరంగా ఉండాలని సూచించారు. వాటికి అలవాటు పడటం వల్ల ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలై, చివరకు ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మన పిల్లల భవిష్యత్తు, మన కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లవద్దని జిల్లా ఎస్పీ సిబ్బందికి పిలుపునిచ్చారు. క్షణికమైన ఆశలు, ఆకర్షణలకు లోనై జీవితాన్ని, కుటుంబాన్ని ఇబ్బందుల్లోకి నెట్టే నిర్ణయాలు తీసుకోవద్దని దిశానిర్దేశం చేశారు.తమ స్నేహితుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు లేదా గేమ్స్‌కు బానిసవుతున్నట్లు గుర్తిస్తే "నాకెందుకులే" అని పక్కకు తప్పుకోకుండా, అతడిని ఆ ఊబి నుంచి బయటకు తీసుకురావడానికి ప్రయత్నించాలని సూచించారు. స్నేహితుడు మంచి మార్గంలో ఉండేలా చూడటం, అవసరమైన సమయంలో సరైన సూచన ఇవ్వడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని తెలిపారు.ప్రతి పోలీసు సిబ్బంది ప్రజలతో మర్యాదగా, సంయమనంతో వ్యవహరిస్తూ, చట్టబద్ధమైన విధానాలను పాటిస్తూ బందోబస్తు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ యం రాజేష్ చంద్ర, సూచించారు.కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రిజర్వు ఇన్స్పెక్టర్లు సంతోష్ కుమార్, నవీన్ ఆర్ఎస్ఐ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఎన్. రవి, కేంద్ర పరిశీలకులు ఉమేష్ కుమార్ మీనా




హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12(విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లాలో ఈ నెల 13న(ఆదివారం)జరగనున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ (ఎన్‌డీఏ, ఎన్ఏ)–2, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్)–2 పరీక్షలను నిర్వహించే పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి శనివారం పరిశీలించారు.హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలను అదనపు కలెక్టర్ రవి, కేంద్ర పరిశీలకులు ఉమేష్ కుమార్ మీనా సందర్శించి పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.పరీక్షా గదులు, అభ్యర్థులకు కల్పిస్తున్న తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లను వారు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా జరిగేవిధంగా బాధ్యతలు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి,అడిషనల్ తహసీల్దార్లు రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మట్టి వినాయకుడి అందజేత



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 ( విజన్ ఆంధ్ర ) : వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మట్టి వినాయకుడిని మంత్రులు పొన్నం ప్రభాకర్ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అందజేశారు.మట్టి వినాయకుల వినియోగంపై ప్రజల్లో పర్యావరణ అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రతిష్టించి పూజించాలని కోరారు.మట్టి వినాయకుల వినియోగం ద్వారా జల, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మన పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత, భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా వినాయక చవితిని జరుపుకోవాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నియమ నిబంధనలు తప్పక పాటించాలి.



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 ( విజన్ ఆంధ్ర ) : ప్రైవేట్ ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నియమ నిబంధనలు తప్పకుండా పాటిస్తూ వైద్య సేవల నిమిత్తం వచ్చే పేషెంట్స్ కు మానవీయ కోణంలో సేవలు అందించాలని హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్ , జిల్లా మేనేజర్ శ్రీ విక్రమ్, మున్సిపల్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి రోహిణి హాస్పిటల్, ఏకశిలా హాస్పిటల్ లను సంయుక్తంగా డి ఎం హెచ్ ఓ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సేవలందిస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్ల వివరాలు , అందిస్తున్న సేవలకు తీసుకునే ఫీజుల వివరాలతో కూడిన ధరల పట్టిక, మరియు వివిధ ప్రభుత్వ అనుమతులకు సంబంధించిన అనుమతులు వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ , సీఎంఆర్ఎఫ్, మరియు ఇతర విభాగాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వివిధ పథకాలలో పొందుపరిచిన నియమాలకు అనుగుణంగా ప్రజలకు సేవలు అందించాలని వారిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకూడదని సూచించారు . డిఎంహెచ్ఓ కార్యాలయానికి సమర్పించవలసిన వివిధ రిపోర్టులను సకాలంలో అందజేయాలన్నారు.అక్కడ అందిస్తున్న సేవలకు సంబంధించిన ఫీజుల పట్టిక వచ్చిన వారికి కనిపించే విధంగా తగినంత సైజులో ప్రముఖంగా ప్రదర్శించకపోవడం , గుర్తించిన ఇతర లోపాలకు సంబంధించి రెండు ఆసుపత్రులకు కూడా నోటీసులు జారీ చేస్తామని డాక్టర్ అప్పయ్య తెలియజేశారు . ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం కన్సల్టేషన్ ఫీజులు, వైద్య సేవలకు ఎంత తీసుకోవాలి అనే ధరల పట్టికను, సేవలు అందిస్తున్న డాక్టర్స్ వివరాలను పేషెంట్లు వారి సహాయకులు క్లినిక్లు లేదా ఆసుపత్రులకు వెళ్ళినప్పుడు పరిశీలించాలన్నారు.

# సాంప్రదాయబద్ధంగా గణపతి ఉత్సవాలు..

- ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండో రోజు మండపాలకు సహకారం...



నిజామాబాద్ సెప్టెంబర్12: (విజన్ ఆంధ్ర) సాంప్రదాయబద్ధంగా గణపతి ఉత్సవాలు నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం నగరంలోని మార్వాడిగల్లి లో గల కార్యాలయంలో వినాయక ఉత్సవ నిర్వాహకులకు చెందాలను రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం తమ ట్రస్టు ద్వారా సహకారం అందిస్తామని గత సంవత్సరం 725 మండపాలకు అందించినట్లు పేర్కొన్నారు. భగవంతుడి ఆశీర్వాదంతో ఈ ఏడాది కూడా సుమారు 800 మండపాలకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. వినాయకుడు కేవలం ఒక పండుగకు సంబంధించిన దేవుడు కాదని సంస్కృతి సనాతన ధర్మం ఐక్యతకు ప్రతీక అని చెప్పారు. వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు తొలగి శుభాలు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరు తమ మండపాల ముందు బాలగంగాధర్ తిలక్ చిత్రపటాన్ని ఉంచాలని సూచించారు. ఉత్సవాలతో అందరూ ఒకచోట చేరి సామూహిక ఐక్యతను పెంపొందించుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు కిసాన్ షాపింగ్ మాల్ వద్ద మట్టి వినాయకుల పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్ పాల్గొన్నారు.

## వ్యవసాయానికి 18 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వాలి

- లేనిపక్షంలో అన్నదాతల పక్షాన బిజెపి పోరుబాట
- బీజేపీ జిల్లా అధ్యక్షులు,దినేష్ పటేల్ కులాచారి



నిజామాబాద్ సెప్టెంబర్12:( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ రంగానికి లో-వోల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా రోజుకు 18 గంటల పాటు సరఫరా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ దినేష్ పటేల్ కులాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రోజు జిల్లా ఎలక్ట్రిసిటీ సూపరింటెండెంట్ (రాజు) గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రైతాంగం సుమారు 2.5 లక్షల వ్యవసాయ పంపుసెట్ల కింద దాదాపు 6 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారని తెలిపారు. అయితే ప్రభుత్వం రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న అరకొర 7 నుంచి 8 గంటల కరెంట్ కూడా లో-వోల్టేజీతో వస్తుండటంతో వ్యవసాయ బోర్ల మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పంటలకు సకాలంలో నీరందక అన్నదాతలు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఎలాంటి లో-వోల్టేజీ, సరఫరా అంతరాయాలు లేకుండా రోజుకు 18 గంటల నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొతన్ కార్ లక్ష్మీనారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్, తిరుపతిరెడ్డి, గంగారెడ్డి, కర్క గంగారెడ్డి, తోట చిన్నయ్య, రాజేశ్వర్ రెడ్డి, అన్నం గోపి, పద్మా రెడ్డి, జగన్ రెడ్డి, ఆనంద్, శంకర్ రెడ్డి, నాయిడి రాజన్న, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# కస్తాల రామకిష్టు సేవలు చిరస్మరణీయం

- సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి




ఆదిలాబాద్, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో, సీపీఐ ఆదిలాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12న ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భుక్తాపూర్ లోని సీపీఐ కార్యాలయం నుండి తిరుపల్లి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ కస్తాల రామకిష్టు స్థూపానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముడుపు ప్రభాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కంకీ కోడవలి గుర్తుపై గెలిచిన ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ మొదటి ఎమ్మెల్యే కస్తాల రామకిష్టు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. భూదానంతో పాటు సొంత కుటుంబ సభ్యుల భూములను సైతం ఆయన పేదలకు దానం చేయించారని గుర్తుచేశారు. సీసీఐ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు తొలిసారిగా భూమినిచ్చిన ఘనత ఆయనదేనని తెలిపారు. తన హయాంలోనే ఆదిలాబాద్‌లో అనేక కాలనీల ఏర్పాటుతో పాటు మున్నూరు కాపు సంఘం భవనం, మార్వాడి ధర్మశాలలకు స్థలాలు కేటాయించారని పేర్కొంటూ ఆయన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో కస్తాల రామకిష్టు కుటుంబ సభ్యులు కామ్రేడ్ కస్తాల మురళి, మాజీ కౌన్సిలర్ కామ్రేడ్ లక్ష్మి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జిల్లా కార్యదర్శి అమీనా ఖాన్, టౌన్ కార్యదర్శి ఎస్. అరుణ్ కుమార్, తాంసి, రూరల్ మండలాల కార్యదర్శులు అర్ధాంగి రమేష్, మహబూబ్ ఖాన్, సీనియర్ నాయకులు షేక్ పాషా, గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి కొడప సురేష్, నాయకురాళ్లు షబానా ఖాన్, ఆత్రం సంగీత, ఆత్రం రేణుక, వజీర్ ఖాన్, పటియాల సునీత, సూర్పం కృష్ణ, మారుతి కాంబ్లేతో పాటు పలువురు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడు

- తనకు కమీషన్లు ఎందుకంటూ అసెంబ్లీలో కమల్ హాసన్ లెక్క ఏకపాత్రాభినయం చేస్తున్నడు
- గుంపు మేస్త్రీ గుంటనక్క మధ్య కుమ్మక్కు లేకుంటే నేను ఆధారాలు ఇస్తా.. సిద్దిపేటలో వంద ఎకరాల భూ బదలాయింపుపై చర్యలు తీసుకోండి
- సీఎం పాపాల చిట్టా బయటపెట్టేందుకు ఈనెల 20 న కొడంగల్ వస్తున్నాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత




నిజామాబాద్ సెప్టెంబర్12 :( విజన్ ఆంధ్ర) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతి సామ్రాట్.. బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడు అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సీఎం కుటుంబ సభ్యులు, మిత్రమండలి, అవినీతిలో రాటుదేలిన మంత్రులతో కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తి నిన్న అసెంబ్లీలో తనకు కమీషన్లు ఎందుకంటూ కమల్ హాసన్ లెవల్ లో ఏకపాత్రాభినయం చేస్తుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించిన చరిత్రను ప్రజలు మర్చిపోరని శనివారం ఆమె వీడియో సందేశాన్ని రిలీజ్ చేశారు. గుంపు మేస్త్రీ గుంటనక్క కుమ్మక్కయారని కవిత ఆరోపించారు. సిద్దిపేటలో నిషేధిత జాబితాలో ఉన్న వంద ఎకరాల భూమిని హరీశ్ రావు తన తండ్రి, కుటుంబ సభ్యుల పేరు మీదకు బదలాయించాడని దానిపై చర్యలు తీసుకునే దమ్ము ముఖ్యమంత్రికి ఉందా అని సవాల్ విసిరారు. అటు ప్రజా సమస్యలను చర్చించాల్సిన అసెంబ్లీని అధికార, ప్రతిపక్షాల గొడవలకు వేదిక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

### రేవంత్ రెడ్డి ఓ బ్లాక్ మెయిలర్

రేవంత్ రెడ్డి అవినీతిలో మునిగిపోయిన సామ్రాట్ అని కవిత విమర్శించారు. అధికారంలోకి రాకముందు ఆర్టీఐ చట్టాన్ని ఉపయోగించుకొని రియల్టర్లను బెదిరిస్తే...ఇప్పుడు అధికారంలో ఉండి కుటుంబ సభ్యులు, మంత్రి మండలి మిత్రులతో కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో బ్లాక్ మెయిలర్ల సంఘం పెడితే దానికి రేవంత్ రెడ్డే అధ్యక్షుడవుతారన్నారు. అప్పట్లో తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ఆంధ్రా వ్యక్తులతో కలిసి క్యాష్ తో డీల్ చేసి అడ్డంగా దొరికిందెవరు? అని కవిత ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు నుంచే బ్లాక్ మెయిలింగ్ తో అడ్డంగా అక్రమాలకు పాల్పడిన చరిత్ర రేవంత్ ది అన్నారు. అలాంటి వ్యక్తికి అధికారం రావటంతో అవినీతిలో రాటుదేలిన మంత్రులతో కలిసి ఇప్పుడు రాచమార్గంలో అవినీతి సామ్రాజ్యం నిర్మిస్తున్నారన్నారు. అసెంబ్లీలో తనకు కమీషన్ల అవసరమేంటనీ రేవంత్ రెడ్డి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డికి దోచుకునే మిత్రమండలిని, భయంకరమైన కుటుంబాన్ని, అవినీతిలో రాటుదేలిన మంత్రులను భగవంతుడు ఇచ్చాడని చెప్పారు. 22 ఏ ను పొంగులేటికి, ఇరిగేషన్ ప్రాజెక్ట్ లు ఉత్తమ్ కుమార్ రెడ్డికి, ఇసుక ను సీతక్కకు రాసిచ్చి వారి ద్వారా కమీషన్లు పొందుతున్న వ్యక్తి రేవంత్ రెడ్డి అని కవిత విమర్శించారు. మూసీ నుంచి ఇసుక వరకు ప్రతి దాంట్లో అవినీతికి పాల్పడుతున్నారని కవిత మండిపడ్డారు. స్వాతిముత్యంలో కమల్ హాసన్ మాదిరిగా అసెంబ్లీలో ఏకపాత్రాభియనం చేస్తూ సుద్దపూసనని నటిస్తే ప్రజలు నమ్మరని అన్నారు.

### గుంటనక్కతో గుంపు మేస్త్రీ కుమ్మక్కు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అవినీతి కోసం అటు బీఆర్ఎస్ తో, ఇటు బీజేపీ తో దోస్తానా చేస్తున్నాడని కవిత ఆరోపించారు. ముఖ్యంగా గుంటనక్కతో గుంపు మేస్త్రీ కుమ్మక్కయ్యాడని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా సిద్ధిపేటలో నిషేధిత జాబితాలో ఉన్న వంద ఎకరాల భూమిని హరీష్ రావు తన తండ్రి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాడని కవిత చెప్పారు. దీనికి సంబంధించిన అన్ని ఆధారాలను పంపిస్తానన్నారు. నిజంగా గుంటనక్కతో గుంపుమేస్త్రీ కుమ్మక్కు కాకపోతే చర్యలు తీసుకోవాలని కవిత సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి దుమ్ముంటే ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉంటేనే సభకు వస్తారా?

అధికారంలో ఉన్న పదేళ్లు బీఆర్ఎస్ నాయకులు...కాంగ్రెస్ కన్నా ఎక్కువగా దోచుకున్నారని కవిత అన్నారు. ఆ పార్టీ నాయకులకు ప్రజల కోసం పోరాటం చేయాలన్న సోయి లేకుండా పోయిందని విమర్శించారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి తన గొప్పులు చెప్పుకుంటూ సభను తన అడ్వర్ టైజ్ మెంట్ కోసం వాడుకుంటే బీఆర్ఎస్ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను కౌంటర్ చేసే వాళ్లే సభలో లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలను సస్పెండ్ చేస్తే...కౌన్సిల్ లో ఎందుకు మాట్లాలేదని ప్రశ్నించారు. కౌన్సిల్ లో వాకౌట్ చేయాల్సిన అవసరమేమొచ్చిందని నిలదీశారు. ప్రజలు బీఆర్ఎస్ కు ఎందుకు ఓటు వేశారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. అధికారంలో ఉంటేనేసభకు వస్తారా అంటూ బీఆర్ఎస్ ను ప్రశ్నించారు.

### అసెంబ్లీలో పరిణామాలు ఆవేదన కలిగించాయి

అసెంబ్లీలో ఇటీవల జరిగిన పరిణామాలు ఆవేదన కలిగించాయని కవిత అన్నారు. ప్రజా సమస్యలను చర్చించాల్సిన వేదికను అధికార, ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజా సమస్యలను వదిలి ఒకరినొకరు తిట్టుకోవటానికే అసెంబ్లీని వేదికగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పది నిమిషాలు అధికార, ప్రతిపక్షాలు కలిసి పనిచేస్తే లక్షలాది మంది ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. కానీ ఆ సోయి మర్చి అధికార, ప్రతిపక్షాలు ప్రజాధనం దుర్వినియోగం చేశాయన్నారు. అటు బీజేపీ సభ్యులుసైతం ప్రజా సమస్యలు వదిలి కాంగ్రెస్ కు కొందరు, బీఆర్ఎస్ కు కొందరు బీఆర్ఎస్ కు మద్దతిచ్చారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

### కొడంగల్ వేదికగా రేవంత్ పాపాల చిట్టా బయటపెడతాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతి పాపాల చిట్టాను కొడంగల్ వేదికగా బయటపెడతామని కవిత అన్నారు. ఈ నెల 20 న కొడంగల్ లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నామన్నారు. అదే రోజు కొడంగల్ వేదికగానే ముఖ్యమంత్రి అవినీతిని ప్రజలు ముందు పెడతామని కవిత చెప్పారు.

# నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన 6 వారాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ 1784 కేసులు నమోదు

- రూ : 1 కోటి 45,20,000/- జరిమానా
- 124 మందికి వారం రోజులు జైలు శిక్ష విధించిన సంబంధిత కోర్టులు పోలీస్ కమిషనర్ వెల్లడి

నిజామాబాద్ సెప్టెంబర్12:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పి.ఎస్ లలో గడిచిన 6 వారాలలో డ్రంకన్ డ్రైవ్ లో 1784 మంది పట్టు బడగా వారిని నిజామాబాదు , బోధన్ మరియు అర్మూర్ కోర్టులలో వారిని హాజరు పర్చగా ఇందులో 124 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని మిగిలిన వారికీ ₹1 కోటి 45,20,000/- జరిమానాలి విధించనైనది. కమిషనరేట్ పరిధిలో చేసిన తనిఖీలలో అధిక మొత్తములో త్రాగి వాహనములు నడిపి పోలీస్ వారికి పట్టుబడటం జరుగుచున్నది, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగముగా తేది:02-08-2026 నుండి తేది: 12-09-2026 వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 1784 కేసుల నమోదు చేయడం జరిగింది. నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్,.కింది గమనికలు తెలియజేయడం జరిగింది. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదు వాహనాదారులు వాహనానికిసంబంధించినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోగలరు. డ్రంకన్ డ్రైవ్లో




పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడును మద్యం త్రాగి వాహనం నడిపి అనుకోని రోడ్ ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్సు లభించదు. మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్ మరియు వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడును అలాగే జైలు శిక్ష విధించే అవకాశం కలదు. ఒక సారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడును మోటర్ వెహికల్ యాక్ట్ 1989 (చట్టం సవరణ - 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడినట్లయితే 10,000/- జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా తో పాటు జైలు శిక్ష విధించబడును. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లైతే 15,000/- జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడును.

## బెజ్జంకి కోహెడ మండలంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 12 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గలబెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలోపరిశీలించారు.అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ నుండి కిందిస్థాయి సిబ్బంది వరకు సమయ వేళలు పాటిస్తున్నారా అని ఆరా తీశారు. 24/7 ఆసుపత్రి కావున రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బంది ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి మలేరియా, డెంగ్యూ కేసులు వివరాలను ఏఎన్ఎం, సూపర్ వైజర్లతో ఆరా తీశారు. ప్రతివారం నిర్వహించే శానిటేషన్ డ్రైవ్ లో తప్పనిసరిగా పాల్గొని ప్రజలకు సీజనల్ వ్యాధులకు గురికాకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు.బెజ్జంకి మండలంలోని తెలంగాణ మెడల్ స్కూల్- బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, ప్రతి వంటకం విద్యార్థులకు సరిపోయే విధంగా రుచికరంగా వండి విద్యార్థులకు పెట్టే విధంగా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్, ఇతర రిజిస్టర్లు తనిఖీ చేస్తూ అసహనం వ్యక్తం చేశారు. వసతి గృహంలో విద్యార్థుల హాజరు ప్రకారమే ప్రతిదీ రాయాలని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రిజిస్టర్ మైంటైన్ చేయడంలో పలు



సూచనలు చేశారు. కోహెడ మండలంలో తంగళ్ల పల్లి గ్రామ శివారులో దాదాపు 23 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంతం మొత్తం కలియ తిరిగారు. 23 ఎకరాల్లో అతి పెద్ద విద్యాసంస్థ నిర్మాణం కావున మంచి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలో యుద్ద ప్రతిపాదకన పూర్తి చెయ్యాలని ఈడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అధునాతన సాంకేతిక విధానంలో మై-వన్ టెక్నాలజీ తో ఎలాంటి ఇటుకలు వాడకుండా ఈ కాంప్లెక్స్ ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ కొండల నడుమ పచ్చని చెట్లమధ్యనిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్రంలో ఒక రోల్ మెడల్ గా నిలుస్తుందని తెలిపారు.

## మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని కాపాడుకుందాం

- రాజ్ జితేంద్రనాథ్, మాజీ కార్పొరేటర్

అల్వాల్, సెప్టెంబర్ 12,(విజన్ ఆంధ్ర) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని కాపాడుకుందాం అని మచ్చబొల్లారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. శనివారం ఆయన, తుర్కపల్లి 190 డివిజన్ లోని విజయ్ విహార్ ఎన్‌క్లేవ్‌లో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వచ్ఛ మైన, ఆహ్లాదరకమైన వాతావరణం కోసం విరి విగా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సి న బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కాలు ష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు, వర్షాలు పడేందుకు, విపత్తుల సమయంలో చెట్లు ఎంతో ఉపయోగ పడతాయ న్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ విహార్ ఎన్‌క్లేవ్‌లో రెసి డెంట్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ సభ్యులు నరేష్ రెడ్డి, రవీందర్, ప్రసాద్, నాగరాజు, నవనీత్, వెంకటేశ్వర్లు, కృష్ణారావు, భరత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, లడ్డురెడ్డి, ఆనంద్ రెడ్డి, బాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సంపత్ యాదవ్, శ్రీనివాస్, అలోక్ రెడ్డి, సాయికిరణ్, సందీప్, వెంకటేష్, రఘు, దేవా తదితరులు పాల్గొన్నారు.



# రాజీమార్గంతో కేసులు త్వరితగతిన పరిష్కారం

- జాతీయ మెగా లోక్ అదాలత్ లో 8,486 కేసుల పరిష్కారం
- జిల్లా న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి



గద్వాల సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న కేసులను రాజీమార్గంలో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గద్వాల కోర్టు ఆవరణలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన కేసులను పరిష్కరించినట్లు జిల్లా న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు, పెండింగ్ లో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. మొత్తం 8486 కేసులను ఇరుపక్షాల (కక్షిదారుల) సమ్మతితో రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు తెలిపారు. పై కేసుల ద్వారా మొత్తం రూ. 1,43,60,970 విలువైన నగదు లావాదేవీలను పరిష్కరించమన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారంతో సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాల కక్షిదారులకు న్యా యం జరుగుతుందన్నారు. ప్రజలు లోక్ అదాలత్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోక్సో న్యాయమూర్తి శ్రీనివాస్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, కార్యదర్శి నిష్కా పాత్రుడు, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దుర్వా, డీఎస్పీ మొగులయ్య, బార్ ప్రెసిడెంట్ సుధాకర్, న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయశాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లారీని ఢీకొన్న బస్సు..క్లీనర్ మృతి

ఏలూరు : చింతలపూడి మండలం యండపల్లి సమీపం లో గ్రీన్ ఫీల్డ్ హైవే పై ప్రైవేట్ ట్రావెల్ (ంఖ39చిఖ3178) బస్సు కు ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీని (ఐం56.8893) బస్సు ఢీకొంది. ఘటనలో ఒకరు మృతిచెందారు. పదిహేను మందికి పైగా గాయలు అయినట్లు సమాచారం. బస్సు హైదరాబాద్ నుండి విజయనగరం వెళ్తున్నట్లు ప్రయాణికులు తెలిపారు. మృతడు బస్సు క్లీనర్ గా గుర్తించారు. చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్ ఐ సతీష్ ఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు
- వనపర్తిలో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం..
- 6,617 కేసులు పరిష్కారం




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 12 (విజన్ ఆంధ్ర) : లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో సత్వర న్యాయం లభిస్తుందని, "రాజీ మార్గమే రాజమార్గం" అని వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం వనపర్తి జిల్లా ప్రధాన న్యాయస్థానం ఆవరణలో జిల్లా న్యాయ సేవల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 6,617 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యాయి.ప్రీ-లిటిగేషన్ కేసులు 4,959 క్రిమినల్ కేసులు1,639 సివిల్ కేసులు 19 సమయం, ఖర్చు ఆదా ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ... కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఇరు వర్గాల మధ్య వివాదాలు సమసిపోయి సఖ్యత పెరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని, తద్వారా న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల భారం కూడా తగ్గుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి, అదనపు జిల్లా జడ్జి కె. లావణ్య బాలరెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి. కలర్చన, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. కవిత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీపా కాసరగడ్డ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్టూరుకు 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'.. రూ.11.75 కోట్లు మంజూరు!

- జీవో నంబర్ 164 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతోనే మంజూరు కాంగ్రెస్ వర్గాలు



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12(విజన్ ఆంధ్ర) : పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' (టీజీపీఎస్) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని దేవరకద్ర ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. పాఠశాల నిర్మాణం మరియు మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం జీవో నంబర్ 164 ద్వారా రూ. 11.75 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. వెల్టూరులో టీజీపీఎస్ ఏర్పాటు కావడం నియోజకవర్గ విద్యా రంగంలో ఒక కీలక ముందడుగని హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, మరియు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వెల్టూరుకు టీజీపీఎస్ పాఠశాల మంజూరు కావడంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చూపిన ప్రత్యేక శ్రద్ధను కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. ఈ నిర్ణయం పట్ల స్థానిక ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

- పోలింగ్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 12 (విజన్ ఆంధ్ర) : 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు శనివారం గోపాల్‌పేట మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, నమోదు ప్రక్రియ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓ) నిర్వహిస్తున్న విధులను తనిఖీ చేసిన ఆయన, కేంద్రాలకు వచ్చే పౌరులకు అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం-6, వివరాల సవరణలు మరియు చిరునామా మార్పుల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ముఖ్యంగా యువత ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా చైతన్యపరచాలని ఆదేశించారు. మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారిన ఓటర్లలను నిబంధనలకు లోబడి పారదర్శకంగా తొలగించే ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో తహసిల్దార్ తిలక్ రెడ్డి, పలువురు రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 11 మోటార్ వాహన ప్రమాద కేసుల పరిష్కారం

- బాధితులకు రూ.1,17,66,000/- పరిహారం మంజూరు




కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 12(విజన్ఆంధ్) : జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 11 మోటార్ వాహన ప్రమాద కేసులు రాజీ మార్గంలో పరిష్కరించబడ్డాయి.ఈ కేసుల్లో ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు మరియు గాయపడిన బాధితులకు కలిపి మొత్తం రూ. 1,17,66,000/- (ఒక కోటి పదిహేడు లక్షల అరవై ఆరు వేల రూపాయలు) పరిహారంగా అవార్డు చేయబడింది.లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా పరిష్కరించడంతో బాధితులకు దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ లేకుండా త్వరితగతిన పరిహారం అందే అవకాశం కలిగిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు తెలిపారు.ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని, పరస్పర అంగీకారంతో తమ వివాదాలను సత్వరంగా పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు.

# ప్రజల ఓటు హక్కును కాపాడాలి
# 22 ఏ భూవ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలి

- మీడియాతోకూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో): కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. ఎస్ ఐ ఆర్ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం అరగంట సమయం కేటాయించి తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దొంగ ఓట్లు ఉంటే నిబంధనల ప్రకారం తొలగించండి. మరణించిన వ్యక్తుల పేర్లు ఉంటే ఆధారాలు పరిశీలించి తొలగించండి. కానీ నిజమైన ఓటర్ల పేర్లను మాత్రం తొలగించవద్దు. ప్రజల ఓటు హక్కును కాపాడటం అధికారుల బాధ్యత" అని ఆయన అన్నారు. ఓటర్ల జాబితా విషయంలో గత రెండు నెలలుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు కార్యాలయాల్లో కూర్చుని కాకుండా ఇంటింటికీ వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని డిమాండ్ చేశారు. అధికారుల వైఖరిలో మార్పు రాకపోతే ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపడతామని, అవసరమైతే సంబంధిత మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

**భూవ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలి:**

రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్, భూవ్యవహారాలకు సంబంధించి ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో విలువైన ప్రైవేట్ భూములు కూడా 22 ఏ లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని అన్నారు, రైతుల భూముల విషయంలో జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రైతులు తమ భూములకు సంబంధించిన హక్కులు, పత్రాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. భూముల విషయంలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే విజిలెన్స్ మరియు సంబంధిత దర్యాప్తు సంస్థలు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు. రైతుల భూములను ఎవరైనా అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసినా, అధికారుల సహకారంతో భూవ్యవహారాల్లో అక్రమాలు జరిగినా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఎవరైనా అధికారులు తప్పు చేసినట్లు విచారణలో తేలితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి" అని మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూములుగా లేదా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ ఆస్తులుగా చూపించే ప్రయత్నాలు జరిగాయా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలని ఆయన కోరారు. ఈ వ్యవహారాల్లో ఎవరెవరి పాత్ర ఉందో, ఏ పత్రాల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరిగాయో, ఎవరి ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకున్నారో సమగ్రంగా విచారణ జరిపి ప్రజల ముందు వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో తప్పు చేసిన అధికారులు ఎవరైనా ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలి. రాజకీయంగా ఎవరైనా బాధ్యత వహించాల్సిన పరిస్థితి ఉంటే ప్రభుత్వం విచారణ అనంతరం తగిన నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యమంత్రి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి సమగ్ర విచారణకు ఆదేశించాలి" అని ఎమ్మెల్యే అన్నారు. ఓటు హక్కు అయినా, భూమి హక్కు అయినా ప్రజలకు అన్యాయం జరగకుండా కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

# 800 గ్రాముల పసికందుకు పునర్జన్మ

- 1కిలో 600 గ్రాములతో తల్లి ఒడికి!
- తనయ చిల్డ్రన్ హాస్పిటల్ అద్భుత వైద్యం!



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 ( విజన్ ఆంధ్ర ) : వైద్యాన్ని వ్యాపారంగా కాకుండా సేవగా అందిస్తూ అందరికీ అందుబాటులో వైద్యం అందిస్తోంది తనయ చిల్డ్రన్ హాస్పిటల్. అతి తక్కువ బరువుతో పుట్టిన పసికందును ప్రాణాపాయం నుండి కాపాడి, ఆరోగ్యంగా తీర్చిదిద్దడంలో తనయ వైద్య బృందం మరో అద్భుతాన్ని సృష్టించింది.తనయ చిల్డ్రన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో, కేవలం 800 గ్రాముల బరువుతో పుట్టిన నెలలు నిండని శిశువును తనయ చిల్డ్రన్ హాస్పిటల్ లో చేర్పించగా, అక్కడి నిపుణులైన పీడియాట్రిక్ వైద్యులు డా. రసజ్ఞ రెడ్డి, డా. హర్షవర్ధన్ ప్రత్యేక పర్యవేక్షణలో అధునాతన చికిత్స అందించారు. నిరంతర కృషి, అధునాతన వైద్య సేవల ఫలితంగా ఆ పసికందు బరువు 1 కిలో600 గ్రాములకు పెరిగి సంపూర్ణ ఆరోగ్యంతో తల్లిదండ్రుల చెంతకు చేరింది.

***అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం***

ఖరీదైన కార్పొరేట్ హాస్పిటల్స్ లో లక్షల రూపాయలు ఖర్చయ్యే ఇలాంటి చికిత్సను తనయ చిల్డ్రన్ హాస్పిటల్ లో అతి తక్కువ ఖర్చుతో అందించడం విశేషం. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. అర్జున్ రెడ్డి లక్ష్యం ప్రకారం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుండటంతో తనయ అంటేనే అందరికీ వైద్యం అనే నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఈ సందర్భంగా పసికందు తల్లిదండ్రులు తనయ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. అర్జున్ రెడ్డి కి, వైద్యులు డా. రసజ్ఞ రెడ్డి డా. హర్షవర్ధన్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

***తక్కువ ఖర్చుతోనే మా బిడ్డకు ప్రాణం పోశారు: తల్లి హవేలీ రాణి***

"బిడ్డ చాలా తక్కువ బరువుతో పుట్టడంతో మేము చాలా భయపడ్డాము. బతుకుతుందో లేదో అనే ఆందోళనలో ఉన్నాము. తనయ హాస్పిటల్ లో మేనేజింగ్ డైరెక్టర్ డా. అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో డా. రసింగారెడ్డి, డా. హర్షవర్ధన్ మాకు ధైర్యం చెప్పి, అత్యంత జాగ్రత్తగా చూసుకున్నారు. అతి తక్కువ ఖర్చుతోనే మా బిడ్డకు ప్రాణం పోశారు. తనయ ఆసుపత్రి వారికి జీవితాంతం రుణపడి ఉంటాము" అని ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# సామాజిక న్యాయ తెలంగాణే లక్ష్యం

- అయిజ ఏబీవీపీ ముఖ్య నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరిక
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



గద్వాల, సెప్టెంబర్ 12 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందని టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో అయిజకు చెందిన ఏబీవీపీ ముఖ్య నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. అయిజకు చెందిన వెంకటేష్, అభినయ్, జశ్వంత్, వేణుగౌడ్, వినయ్‌కుమార్, శేఖర్ తదితరులు కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కవిత వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రజల కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గ సీనియర్ నాయకులు బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మురుగు ముంచెత్తినా.. మేలుకోరా..!



- నెల రోజులుగా డ్రైనేజీ లీకేజీ.. రోడ్డుపై మురుగు ప్రవాహం
- దుర్గంధంతో స్థానికులు, వాహనదారుల అవస్థలు
- ఇకనైనా స్పందించి తక్షణ మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

కుత్బుల్లాపూర్ /జీడిమెట్ల, సెప్టెంబరు 12 (విజన్ ఆంధ్ర): జీడిమెట్ల మీనాక్షి కాలనీఅంగడిపేట రోడ్డులోని వైన్‌షాప్ సమీపంలో డ్రైనేజీ లీకేజీతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజులుగా మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై మురుగు నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధంతో పరిసర ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

**అధికారుల దృష్టికి సమస్య**

స్థానికులు సమస్యను జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత జలమండలి అధికారులకు సమస్యను వివరించి, డ్రైనేజీ లీకేజీని తక్షణమే అరికట్టాలని కోరారు.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

నెల రోజులుగా సమస్య కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు ఇకనైనా స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా లీకేజీకి కారణాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని వీరారెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు.

# హ్యూమన్ రైట్స్ అండ్ పీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ



మల్కాజిగిరి, సెప్టెంబర్ 12, విజన్ ఆంధ్ర: విష్ణుపురి కాలనీలోని శ్రీ లలిత పరమేశ్వరీ దేవాలయ ప్రాంగణంలో శనివారం హ్యూమన్ రైట్స్ అండ్ పీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మట్టి గణనాథుల విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సంస్థ చైర్మన్ వరలక్ష్మి గైక్వాడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి మీడియా కన్వీనర్ గుండా నిరంజన్,183వ డివిజన్ అధ్యక్షుడు జీడి సంపత్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై భక్తులకు మట్టి గణనాథుల విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. మట్టి గణపతి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రతినిధులతో పాటు దేవాలయ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# పట్టాలెక్కిన స్టేజ్2 పనులు!!

- ఎన్టీపీసీ ప్రాజెక్టులో కీలక ఘట్టం
- తెలంగాణ విద్యుత్ రంగానికి బూస్ట్
- భారీ విద్యుత్ ప్రాజెక్టుకు భూమిపూజ
- 2,400 మెగావాట్ల దిశగా అడుగులు






పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర): తెలంగాణ విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఎన్టీపీసీ చేపడుతున్న తెలంగాణ స్టేజ్2 ప్రాజెక్టు నిర్మాణ పనులు మరో కీలక దశకు చేరుకున్నాయి. మూడు యూనిట్లలో 800 మెగావాట్ల చొప్పున మొత్తం 2,400 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనున్న ఈ భారీ విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టులో భాగంగా ప్రధాన ప్లాంట్ ప్రాంతంలో భూసమతలీకరణ పనులను ప్రారంభించేందుకు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్టీపీసీ ఆర్ అండ్ టీ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.కె. సమంత సమక్షంలో జరిగింది. ఎన్టీపీసీతో పాటు బీహెచ్ఈఎల్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ స్టేజ్2కు సంబంధించిన బీటీజీ ప్యాకేజీ పనులను బీహెచ్ఈఎల్‌కు అప్పగించారు. భారీ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయడంలో భూసమతలీకరణ పనులు కీలకమైన తొలి దశగా అధికారులు పేర్కొన్నారు. ప్రధాన ప్లాంట్ నిర్మాణం, భారీ యంత్ర పరికరాల ఏర్పాటు తదితర తదుపరి పనులకు ఈ ప్రక్రియ పునాదిగా నిలవనుంది. భూసమతలీకరణ పనులు ప్రారంభం కావడంతో ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాలు క్షేత్రస్థాయిలో వేగం పుంజుకోనున్నాయి. తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళు్తున్నారు. 2,400 మెగావాట్ల అదనపు ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి రావడం ద్వారా రాష్ట్ర విద్యుత్ మౌలిక వసతులకు గణనీయమైన బలం చేకూరనుంది. వ్యవసాయం, పరిశ్రమలు, పట్టణీకరణతో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా భవిష్యత్ అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. ప్రాజెక్టు పనులను ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ అధికారులు చర్యలు చేపట్టనున్నారు. నిర్మాణంలో నాణ్యత, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తూ పనులను వేగవంతం చేయనున్నారు. ప్రధాన ప్లాంట్ స్థల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ద్వారా తెలంగాణ స్టేజ్2 నిర్మాణ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి నమోదైంది. రాష్ట్ర విద్యుత్ భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు పారిశ్రామిక ప్రగతికి అవసరమైన విద్యుత్ లభ్యతను పెంచడంలో ఈ ప్రాజెక్టు భవిష్యత్‌లో కీలక పాత్ర పోషించనుంది.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: సిర్ర దేవేందర్



ఆదిలాబాద్, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లాలో మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సిర్ర దేవేందర్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కళ్ళేపెల్లి గంగయ్యతో కలిసి శనివారం జిల్లా విద్యాశాఖాధికారి మాధవికి వినతిపత్రం అందజేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలపై జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరారు. జూన్, జూలై, ఆగస్టు నెలల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, విద్యార్థుల అల్పాహార పథకాన్ని వంట కార్మికులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనం రూ.10 వేలకు పెంచాలని, కోడిగుడ్లు, గ్యాస్, నిత్యావసరాలను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా కల్పించాలని, రాజకీయ కక్షలతో తొలగించరాదని, ప్రతి విద్యార్థికి మెస్ ఛార్జి రూ.25 చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 16న చేపట్టనున్న రాష్ట్రస్థాయి దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

# బండి రమేష్ చొరవతో పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

**- రూ.3.32 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**

**- సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో లబ్ధిదారులకు ఆర్థిక సాయం**

**- బండి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు**



మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో): అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక భరోసా లభించింది. కూకట్‌పల్లిలోని హేమదుర్గ భవన్‌లో ఉన్న బండి రమేష్ కార్యాలయాన్ని సంప్రదించిన లబ్ధిదారులు తమకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల విజ్ఞప్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన బండి రమేష్, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా చొరవ చూపారు. సీఎం సహకారంతో, బండి రమేష్ కృషి ఫలితంగా మొత్తం రూ.3,32,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. శనివారం హేమదుర్గ భవన్‌లోని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ లబ్ధిదారులకు చెక్కులను స్వయంగా అందజేశారు. చెక్కులు అందుకున్న వారిలో పొట్టేటి గౌతమి రూ.60,000, గౌసియా బేగం రూ.50,000, తమ్మిరి కృష్ణవేణి రూ.60,000, దేవుళ్ల నీలం రాజు రూ.60,000, కడిపప్పుల్ ఫ్రాన్సిస్ రూ.42,500, మండల చంద్రకళ రూ.60,000 ఉన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తమ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన బండి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించినందుకు ధన్యవాదాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగార్జున, శివ చౌదరి, నలినీకాంత్, వరుణ్, జహంగీర్, సజ్జన్, సంధ్య, జోజమ్మ, కల్పన, రజిని, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్నా రక్తదానం చాలా గొప్పది

**- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**







శేరిలింగంపల్లి. సెప్టెంబర్ 12: ( విజన్ ఆంధ్ర) : హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ లో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదానం శిబిరంలో తాజా మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్ ఉప్పలపాటి శ్రీకాంత్ , సీనియర్ నాయకులు శ్రీ రఘునాథ్ రెడ్డి తో కలిసి శాలవతో సత్కరించి,కేక్ కట్ చేసి జన్మదినం శుభాకాంక్షలు తెలియచేసి ,రక్తదానం శిబిరంలో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు అందచేసిన పిఏసి చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ జన్మదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, కొండా విజయ్ సామాజిక బాధ్యత తో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు అని, సమాజ హితం ఆయన చేసే సేవలు అభినందనీయం అని . కొండా విజయ్ జన్మదినం ను పురస్కరించుకొని మెగా రక్తదానం శిబిరం మరియు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం అని తెలిపారు. రక్తదానం శిబిరంలో సుమారుగా 115 మంది రక్తదానం చేయడం గొప్ప విషయం అని , రక్తదానం లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియచేస్తున్నాను అని తెలిపారు అన్ని దానంల కన్నా రక్తదానం చాలా గొప్పది అని రక్తదానం చేయండి ప్రాణ దాతలు కండి, రక్తదానం చేయడం ద్వారా మనం సాటి మనిషి ప్రాణాలు కాపాడిన వారు అవుతారు అని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రక్తదానం చేయాలని ,ప్రతిరోజూ రక్తం అవసరం ఉండి ఎంతోమంది ఇబ్బందులకు గురౌతున్నారని, తలసేమియా, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం పాట్లు పడుతున్నారన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చు ప్రతి రక్తపు బొట్టు విలువైనదని, ఏదైనా పునరుత్పత్తి చేసుకోవచ్చు గానీ రక్తాన్ని మాత్రం ఎవరో ఒకరు దానం చేయడం వల్లే పొందవచ్చన్నారు. రక్త దానంపై అపోహలు వీడాలనీ తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు ,అబిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ విలువలను దిగజారుస్తున్న అధికార ప్రతిపక్ష పార్టీలు

**- సిపిఐ జాతీయ నాయకులు చాడా వెంకటరెడ్డి**



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 12 : గత వారం రోజులుగా రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల వైఖరితో రాజకీయ హైడ్రామా నడుస్తుందని ఈ రెండు పార్టీలు ఎంతో హుందాగా ఉండాల్సింది పోయి రాజకీయ సంప్రదాయాలను మంటగలిపే విధంగా ఉన్నాయని సిపిఐ జాతీయ నాయకులు మాజీ శాసనసభ పక్షా నేత చాడ వెంకటరెడ్డి తీవ్రంగా విమర్శించారు. నేడిక్కడ నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, రాష్ట్ర సిపిఐ నాయకులు హెచ్ ఆనంద్ జి , కే.కేశవులు గౌడ్, మహబూబ్నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి,పి పరమేష్ గౌడ్ , తదితరులు తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా చాడా వెంకటరెడ్డి మాట్లాడుతూ నేటితరం యువతీ యువకులు రాజకీయాల్లోకి రావాలని ఆసక్తి రోజుకి తగ్గుతుందని ప్రస్తుత రాజకీయ వ్యవహారాలు చూస్తే అది మరింత బలపడే ప్రమాదం ఉందన్నారు.ప్రజాస్వామ్యంలో యువత రాజకీయాల్లోకి రావాలంటే అధికార ప్రతిపక్ష పార్టీలు ఎంతో హుందాగావ్యవహరించాలని చాడా వెంకటరెడ్డి సూచించారు .ప్రజల డబ్బుతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కొనసాగాల్సిన అసెంబ్లీ సమావేశాలు వ్యక్తిగత దూషణలు పరమ బూతులు ఇవే నేడు మీడియాలో, పత్రికల్లో కనబడుతున్నాయని ఎవరు ఎవరిని ఎంత ఎక్కువ తిడితే అంత గొప్ప వాళ్ళం అనేటువంటి భావనకు ఈ రెండు పార్టీలు వచ్చేసాయని ఇది చాలా ప్రమాదకరం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేసే అంశంపై చర్చించకుండా, ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన కరువు మేఘాలు కమ్ముకున్నాయని రైతులు ప్రజలు తీవ్ర ఆందోళనలు ఉన్నారని ఎలా ఆదుకోవాలని చర్చ జరగకుండా ఇలా ఇష్టం వచ్చినట్టుగా 90% అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న రెండు పార్టీలు బాధ్యతారహితంగా వ్యవహరించడం బాధాకరమని ఆయన విమర్శించారు .త్వరలో జిల్లాలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టుల పనులు ప్రారంభంచేలా సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సెక్టోబర్ 17వ తేదీ నిజానికి అది తెలంగాణ స్వాతంత్ర దినం అని దాన్ని అధికారికంగానిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఏం అడ్డం వస్తుందని ఆయన ప్రశ్నించారు. 4500 మంది అమరవీరుల ప్రాణ త్యాగం కనపడలేదా అని ఆయన ప్రశ్నించారు. పదివేల గ్రామాలను విముక్తి చేసిన పోరాటం 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన ఒక పెద్ద ఘట్టం ప్రభుత్వానికి ఎందుకు కనబడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .మహారాష్ట్ర కర్ణాటక ప్రభుత్వాలు ఆ రాష్ట్రంలో రెండు మూడు జిల్లాలుంటే అధికారికంగా నిర్వహిస్తున్నాయని 33 జిల్లాల కేంద్ర బిందువైన తెలంగాణలో మాత్రం ఎందుకు సెప్టెంబర్ 17 విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేకపోతున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఇప్పటికైనా ప్రభుత్వం ఈ 17న అధికారికంగా తెలంగాణ విలిన దినోత్సవాన్ని నిర్వహించాలని చాడా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.

# ఏచూరి స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుదాం: సీపీఎం



ఆదిలాబాద్, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉడత రవీందర్ మాట్లాడుతూ.. కామ్రేడ్ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండే రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. భారత రాజకీయాల్లో అనునిత్యం ప్రజా పక్షం వహిస్తూ అనేక పోరాటాలను నడిపారని, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రజా సమస్యలపై, కార్మికులు, రైతులు, మహిళలు, పేదల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. దేశంలో మతోన్మాదం, నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను ఐక్యం చేయడంలో సీతారాం ఏచూరి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కార్మికులు, రైతులు, మహిళలు, పేద ప్రజల హక్కుల కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, పార్టీ సీనియర్ నాయకులు లంక రాఘవులు, పార్టీ కార్యవర్గ సభ్యులు పూసం సచిన్, అన్నముల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్. మంజుల, కే. సునీత, బొజ్జ ఆశన్న, ఆర్. సురేందర్, న్యూ డెమోక్రసీ వెంకట్ నారాయణ, బీఆర్ఎస్ పార్టీ నుండి రమేష్, అలాగే పార్టీ సభ్యులు డి. సునీత, నగేష్, పి. దేవిదాస్, రమేష్, దశాంత్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా "పద్మచక్ర జాతీయ పురస్కారాలు ", "తెలంగాణ లిబరేషన్ డే నేషనల్ అవార్డుల" ప్రదానోత్సవం




హైదరాబాద్, సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్): భారత ప్రభుత్వం నీతి ఆయోగ్ చే ఆమోదించబడిన సంస్థ."జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్" వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ వి.ఆర్. శ్రీనివాసరాజ్,ఉషా రాణి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించిన 80 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవం, డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుక అవార్డుల ప్రదానోత్సవం స్పెషల్ - 2026, తెలంగాణ లిబరేషన్ డే నేషనల్ అవార్డ్స్ సెర్మనీ - 2026 కార్యక్రమం అలాగే దేవునికి, మానవాళికి అంకితభావంతో సేవ చేసిన వ్యక్తులను గౌరవించేందుకు, ఉషా రాణి మెమోరియల్ ట్రస్ట్ , బి.కె. ఆధ్యాత్మిక వైద్యురాలు రాధిక లెల్లా, జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్‌ల సహకారంతో కార్యక్రమాన్ని సగర్వంగా సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్ర భారతి ప్రధాన ఆడిటోరియం సైఫాబాద్ హైదరాబాద్ వేదికగా శుక్రవారంనాడు ఏర్పాటు చేసిన తెలంగాణ లిబరేషన్ డే నేషనల్ అవార్డ్స్ సెర్మనీ కార్యక్రమంలో భారత్ విభూషణ్ అవార్డు 2026, పద్మచక్ర జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా జరిగింది. ఈ ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ రెడ్డి, వేణుగోపాలాచారి, నటుడు బాబు మోహన్, సరస్వతీ ఉపాసకుడు ఇతర విశిష్ట అతిథులు ప్రముఖులు హాజరై ఆధ్యాత్మికత, సాంఘిక సేవ, విద్య అలాగే ఆరోగ్య సంరక్షణ రంగాలలో అంకితభావం, కృషి ప్రయత్నాలకు గుర్తింపుగా, జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్ సౌజన్యంతో పురస్కారాలు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 19 మంది బ్రహ్మాకుమారి దైవ ఆత్మలకు పద్మ చక్ర జాతీయ పురస్కారాలను అతిథులు అందజేసిన సత్కరించారు, ఇందులో మౌంట్ అబు నుండి 7 దివ్య ఆత్మలు, బి.కె. కరుణా భాయ్ దాదా జీ, బి.కె. మున్ని దీదీ, బి.కె. సెల్వం, బి.కె. బనసరి లాల్ భాయ్, బి.కె. శ్రీకాంత్ భాయ్, బి.కె. సుప్రియ సోదరి, బి.కె. రమేష్ భాయ్, హైదరాబాద్ నుండి 12 మంది దైవ ఆత్మలు రాజయోగినిలు బి.కె. మంజు బెహెన్, బి.కె. నిర్మల బెహెన్, బి.కె. సరళ బెహెన్, బి.కె. సరోజిని బెహెన్, బి.కె. జ్యోతి బెహెన్, బి.కె. సుధా బెహెన్, బి.కె. రాజయోగిని లక్ష్మి. బెహెన్, బి.కె. సునీత బెహెన్, బి.కె. రాజ్ కుమారి బెహెన్, బి.కె. ఉమా రాణి బెహెన్, బి.కె. నీలిమ సోదరి లకు పురస్కారలు అందజేశి సత్కరించ్చారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ, ఈ గౌరవం మీకు ఇతరుల నుండి ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని అందిస్తుందన్నారు. మీ కృషి సమాజంలో మరింత సామరస్యం, న్యాయం, శాంతి, మానవత్వం, ప్రేమను సాధించడంలో సహాయపడింది ఎంతో సహాయకారిగా నిలస్తుందని తెలిపారు.

# పండిట్ హరి ప్రసాద్ చౌరాసియాకు జీవిత సాఫల్య పురస్కారం ప్రధానం







హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : మహనీయ కళాకారులను సత్కరించడం ద్వారా కళారంగానికి, కళాకారులకు సమాజం అందించే గౌరవం మరింత బలోపేతం అవుతుందని అతిథులు అభిప్రాయపడ్డారు. భారతీయ శాస్త్రీయ సంగీత రంగానికి విశేష సేవలందించిన ప్రఖ్యాత వేణు నాద విద్వాంసులు, పద్మవిభూషణ్ పండిట్ హరి ప్రసాద్ చౌరాసియా ను ప్రముఖ సాంస్కృతిక సంస్థ శ్రీ ప్రాఖ్య ఆర్ట్స్ సంగీత సుధా వేదిక 26వ వార్షిక సంగీత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ లోని రవీంద్ర భారతి ప్రధాన వేదికగా గురువారం నాడు సాయంత్రం ఆనందోత్సవల మధ్య జరిగిన ఈ కార్యక్రమాన్ని శ్రీ ప్రాఖ్య ఆర్ట్స్ సంగీత సుధా వేదిక కార్యదర్శి జయశ్రీ ప్రాఖ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు నటుడు మురళీమోహన్ మాజీ ఐఏఎస్ అధికారి ఎల్వి సుబ్రహ్మణ్యం ఇతర ప్రముఖులు మాట్లాడుతూ, సంగీతం కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా, మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను భావితరాలకు అందించే శక్తివంతమైన మాధ్యమమని పేర్కొన్నారు. అలాంటి భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేయడంలో పండిట్ హరి ప్రసాద్ చౌరాసియా కృషి అపూర్వమైనదని కొనియాడారు. ఆయన వేణు వాదనలో భారతీయ సంగీత సంప్రదాయంలోని శాస్త్రీయతతో పాటు భావోద్వేగం, మాధుర్యం, సృజనాత్మకత సమ్మిళితమై ఉంటాయని అన్నారు. భారతీయ సంగీత కళకు దశాబ్దాలుగా పండిట్ హరి ప్రసాద్ చౌరాసియా అందిస్తున్న సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, తన కళా ప్రతిభతో దేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పారని అతిథులు పేర్కొన్నారు. ముఖ్యంగా యువతలో భారతీయ శాస్త్రీయ సంగీతం పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అతిథులు తెలిపారు. పండిట్ హరి ప్రసాద్ చౌరాసియా కి జీవిత సాఫల్య పురస్కారం అందించడం తమకు ఎంతో గర్వకారణమని, భారతీయ సంగీతానికి ఆయన చేసిన అపూర్వమైన సేవలకు ఈ పురస్కారం ఒక చిన్న గౌరవ సూచిక మాత్రమేనని కార్యక్రమ నిర్వాహకూరాలు జయశ్రీ ప్రాఖ్య తెలిపారు. భవిష్యత్తులో కూడా దేశం గర్వించదగ్గ మహోన్నత కళాకారులను సత్కరిస్తూ, ప్రతిభావంతులైన కళాకారులను ప్రోత్సహిస్తూ, సంగీతం, కళా రంగాల అభివృద్ధికి తమ వేదిక నిరంతరం కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీతాభిమానులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని పండిట్ హరి ప్రసాద్ చౌరాసియా ను అభినందించారు. ఆయన ఆశీస్సులు అందుకున్నారు.

# సాయంత్రం 9.30 బస్సు రద్దుతో ఏటూరునాగారం మార్గంలో ప్రయాణికుల తీవ్ర ఇక్కట్లు.




ములుగు సెప్టెంబర్ 12, విజన్ ఆంధ్ర ప్రతినిధి : హనుమకొండ - ఏటూరునాగారం ప్రధాన రహదారిపై తిరిగే సాయంత్రం 9.30 గంటల ప్రభుత్వ బస్సును అధికారులు రద్దు చేయడంతో ఆ మార్గంలో ప్రయాణించే వందలాది మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చివరి బస్సు కావడంతో ఇంటికి చేరలేక నడిరోడ్డున పడిగాపులు కాస్తున్నారు.

**రాత్రి వేళ నడిరోడ్డున ప్రయాణికులు:**

వరంగల్, హనుమకొండలో పనులు, కూలి పనులు, చదువులు ముగించుకుని సాయంత్రం సొంత గ్రామాలకు వెళ్లేవారికి ఈ 9.30 బస్సే ప్రధాన ఆధారం. బస్సు రద్దు కావడంతో ములుగు, ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం మండలాలకు చెందిన ప్రజలు బస్టాండులోనే రాత్రి 10 గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. బస్సు రాదని తెలిసి ప్రైవేటు ఆటోలు, జీపులను ఆశ్రయిస్తే 100 రూపాయల చోట 250 రూపాయలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మహిళలు, విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం.....**

ముఖ్యంగా మహిళా ప్రయాణికులు, చిన్న పిల్లలతో వచ్చే తల్లులు, కళాశాలల నుండి వచ్చే విద్యార్థినులు రాత్రి వేళ బస్సు లేక తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. "ఉదయం వచ్చిన బస్సులో వెళ్లాం, సాయంత్రం తిరిగి వెళ్లడానికి బస్సు లేదు. చీకటి పడుతోంది, ఇంటికి ఎలా వెళ్లాలి" అంటూ ఒక మహిళ కన్నీరు పెట్టుకున్నారు. "సాయంత్రం బస్సు లేకపోతే మా చదువులు ఆగిపోతాయి" అని విద్యార్థులు వాపోతున్నారు.

**గిరిజన ప్రాంతానికి తీవ్ర అన్యాయం......**

ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాంతం. ఇక్కడి ప్రజలకు ప్రభుత్వ బస్సులే జీవనాడి. ప్రైవేటు సౌకర్యం తక్కువ. అలాంటి చోట రద్దీగా ఉండే సాయంత్రం సమయంలోనే బస్సును రద్దు చేయడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోగులు, వృద్ధులు ఆసుపత్రుల నుండి ఇంటికి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు.

**ప్రజల డిమాండ్..**

ప్రయాణికుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని రద్దు చేసిన సాయంత్రం 9.30 గంటల బస్సును వెంటనే పునరుద్ధరించాలని, అంతేకాకుండా హనుమకొండ నుండి ఏటూరునాగారం వరకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు ఇచ్చి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# జీఓ నెంబర్ 97 రద్దు

**- కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన**

సికింద్రాబాద్ : జీఓ నెంబర్ 97 రద్దును కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలశాల విద్యార్థులు చేస్తున్న నిరసన నేటికి 26వ రోజుకు చేరుకుంది. సికింద్రాబాద్ లోని పాలిటెక్నిక్ కాలశాల విద్యార్థులు జీఓ.97 రద్దును ఆంగ్ల అక్షరాలతో సూచిస్తూ బైఠాయించి వినూత్నంగా నిరసన తెలిపారు. తమ పుస్తకాల బ్యాగ్ లను మధ్యలో బతుకమ్మల మాదిరిగా ఉంచి చుట్టూ తిరుగుతూ, శక్తి స్కీం కు వ్యతిరేకంగా పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ ఉద్యమాన్ని చేపట్టి 25రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన రావడం లేదని, తమ బవిష్యత్తుతో ఆటలాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నుండి తప్పకుండా సానుకూల స్పందన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక



# ఛలో హన్మకొండ ను జయప్రదం చేయాలి

**- ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలకు తరలిరావాలి**

**- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్**

**- వార్షికోత్సవాల గోడపత్రికను విడుదల చేసిన విద్యార్థి నాయకులు**




బోడుప్పల్,సెప్టెంబర్12(విజన్ ఆంధ్ర) : ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 28, 29, 30 తేదీల్లో హన్మకొండలో నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం ఉప్పల్ డిపో కార్యాలయం ఎదుట మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పుట్ట లక్ష్మణ్ విచ్చేసి వార్షికోత్సవాల గోడపత్రికను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు పోరాటం నినాదంతో ఏఐఎస్ఎఫ్ 90 ఏళ్లుగా విద్యార్థుల సమస్యలపై పోరాడుతోందన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. విద్యాసంస్థల్లో ఖాళీల భర్తీ, మౌలిక వసతుల కల్పన,ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వార్షికోత్సవాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు హరీష్,నాయకులు దుర్గాప్రసాద్,శ్రీకాంత్,గణేష్, కృపాకర్,వెంకట్,రాము తదితరులు పాల్గొన్నారు.

# 16 నుంచి 25వ సిఐఐ ఇంధన సామర్థ్య సదస్సు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర) : కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సిఐఐ) ఆధ్వర్యంలో 25వ ఇంధన సామర్థ్య సదస్సు సెప్టెంబర్ 16-18 తేదీల్లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్ఐసిసి)లో నిర్వహించనున్నట్లు సిఐఐ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఐఐ-సోహ్రాబ్జీ గోద్రెజ్ గ్రీన్ బిజినెస్ సెంటర్(సిఐఐ-జిబిసి) నిర్వహిస్తున్న ఈ సదస్సుకు 3,500 మందికి పైగా ప్రతినిధులు, 150 మందికి పైగా వక్తలు హాజరుకానున్నట్లు చెప్పారు. 'శక్తి సామర్థ్యం, స్వచ్ఛమైన సాంకేతికతలు, సుస్థిర పద్ధతులతో నికర సున్నా ఆర్థిక వ్యవస్థకు పరివర్తనను వేగవంతం చేయడం' ఇతివృత్తంగా 20కి పైగా పరిశ్రమ రంగాలపై చర్చలు జరగనున్నాయి. ఇందులో 22వ సిఐఐ పవర్ ప్లాంట్ సదస్సు, 20వ సిఐఐ పేపర్‌టెక్, 1వ సిఐఐ-జిఇసి క్లీన్‌టెక్ నెక్సస్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సుస్థిర ఇంధన పద్ధతుల్లో ప్రతిభ చూపిన 300కుపైగా కంపెనీలు, వ్యక్తులకు 27వ సిఐఐ జాతీయ శక్తి నిర్వహణ శ్రేష్ఠతా పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. 110కు పైగా ఎగ్జిబిటర్లు అత్యాధునిక సాంకేతికతలు, పరిష్కారాలను ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

# పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ




మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం మేడ్చల్ ఆధ్వర్యంలో మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ ఉచిత పంపిణీ కార్యక్రమం క్రింది ప్రాంతాల్లో నిర్వహించబడింది జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ భవనం, బీబీఆర్ ఆసుపత్రి సమీపంలో బాలానగర్,కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ సమీపంలో, బోధి సత్వ స్కూల్, సుభాష్‌నగర్కుత్బుల్లాపూర్, కొంపల్లి, ఆనంద్‌బాగ్,రాంపల్లి,నాగారం, తదితర ప్రాంతాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు మట్టి గణపతి విగ్రహాల వినియోగం వల్ల కలిగే పర్యావరణ ప్రయోజనాలను అధికారులు వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు , కృత్రిమ రంగుల వినియోగం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున, వాటికి బదులుగా సహజ మట్టితో తయారు చేసిన పర్యావరణహిత గణపతి విగ్రహాలను వినియోగించాలని సూచించారు. మట్టి గణపతి విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోవడంతో పాటు పర్యావరణానికి అనుకూలంగా ఉంటాయని, ప్రజలు పర్యావరణహిత పద్ధతుల్లో వినాయక చవితి పండుగను నిర్వహించాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని బి. రాజేందర్ , ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయంమేడ్చల్, వారి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బందితో కలిసి నిర్వహించారు.

# తెలంగాణ అసెంబ్లీ ముట్టడి




మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఏ బి వి పి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు ₹11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు అడుగుతున్నది వసతిగృహాల్లో బాసుమతి భోజనం కాదు, నాణ్యమైన భోజనం ఏసి, భవనాలు కాదు పక్క భవనాలు మంత్రులకు, ఎమ్మెల్యేలకు జీతాలు, ఇతర సౌకర్యాలు అందించడానికి ప్రభుత్వం వద్ద నిధులు ఉన్నాయి కానీ విద్యార్థుల చదువుల కోసం, వారి భవిష్యత్తు కోసం నిధులు లేకపోయే, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడడం ఆపాలి. పెండింగ్‌లో ఉన్న ₹11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యా వసతులు కల్పించాలి.

# ఉపాధ్యాయ రత్న అవార్డుకు నీలం గణేష్ ఎంపిక




బోడుప్పల్,సెప్టెంబర్ 12(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ ప్రాంతానికి చెందిన న్యూటన్ గ్రామర్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు నీలం గణేష్ ఉపాధ్యాయ రత్న అవార్డు2026కు ఎంపికయ్యారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సుందరయ్య కళా నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జగతి ఆర్ట్స్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేశారు. తెలుగు ఉపాధ్యాయుడిగా గత కొన్నేళ్లుగా విద్యార్థులకు భాషపై ఆసక్తిని పెంపొందిస్తూ సేవలందిస్తున్న నీలం గణేష్‌ను గుర్తించి ఉపాధ్యాయ రత్న అవార్డు2026తో సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని భావితరాలకు చాటిచెప్పేందుకు తన వంతు కృషి చేయడమే తన బాధ్యత అని తెలిపారు. అవార్డు అందించిన పెద్దలకు, తనను అభినందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తాం... కామ్రేడ్ విలాస్




ఆదిలాబాద్ జిల్లా:ఆదిలాబాద్ రూరల్ (విజన్ ఆంధ్ర) : ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసారి గ్రామంలో ఘనంగా 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసారి గ్రామంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ చిల్కా దేవిదాస్ ఆధ్వర్యంలో 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ ఎస్. విలాస్, సీపీఐ ఆదిలాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ సిర్ర దేవేందర్, సీపీఐ ఆదిలాబాద్ పట్టణ కార్యదర్శి కామ్రేడ్ కట్ట చంద్రమౌళి హాజరయ్యారు. ఈ సందర్భంగా భీంసారి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, కామ్రేడ్స్ పందరినాథ్, రామయ్య, పార్ల విట్టల్, పూర్ణచందర్ స్మారక స్థూపాల వద్ద నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కామ్రేడ్ ఎస్. విలాస్, కామ్రేడ్ చిల్కా దేవిదాస్, కామ్రేడ్ కట్ట చంద్రమౌళి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, పేద ప్రజల హక్కుల కోసం జరిగిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని అన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన వీరోచిత పోరాటంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1946లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటం వేలాది మంది రైతులు, కూలీలు, పేద ప్రజలను ఏకం చేసి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గొప్ప ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుందని అన్నారు. ఈ పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టులు, రైతులు, కూలీలు, మహిళలు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తుచేశారు. "దున్నేవాడికే భూమి" అనే నినాదంతో సాగిన పోరాటం ఫలితంగా లక్షలాది ఎకరాల భూమి పేద ప్రజల చేతుల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం దేశ చరిత్రలోనే ఒక గొప్ప రైతాంగ పోరాటంగా నిలిచిందని అన్నారు. ఆ పోరాట స్ఫూర్తితోనే నేటికీ సీపీఐ పేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలను అమలు చేస్తున్నాయని వారు విమర్శించారు. ప్రజలపై భారాలు మోపుతూ, పేదల సమస్యలను గాలికి వదిలేసి సంపన్నుల ఆస్తులు పెంచేందుకు ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఆరోపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, గృహాలు, ఉపాధి, విద్య, వైద్యం, రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి మౌలిక సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన పోరాట కార్యక్రమాలు నిర్వహించడానికి వెనుకాడబోమని ప్రభుత్వాలను హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నేటి తరం విద్యార్థులు, యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కామ్రేడ్ ఎస్. విలాస్ అన్నారు. ఆ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు విద్యార్థులు, యువకులు, మహిళలు, కార్మికులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు సీపీఐని బలోపేతం చేసి ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కామ్రేడ్ గాజంగుల రాజు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కామ్రేడ్ బత్తుల గంగారెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్స్ బత్తుల రాజన్న, రామ్ రెడ్డి, సిసిలే దయానంద్, లక్ష్మి, యశోద, తుల్సి నర్సింగ్, చందా కిష్టయ్య, గంగారాం, గుండ్ల శ్రీను, ఖాళ్ళ నర్సింగ్, చంటి, మల్లేష్ తదితరులు, సీపీఐ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జి ఈ వెర్నోవా కంపెనీలో 11 లక్షల(ఎల్ పి ఎ) ప్యాకేజీతో కిట్స్ విద్యార్థులు ఎంపిక




హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 ( విజన్ ఆంధ్ర ) : 11 సెప్టెంబర్ 2026న నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా ' జి ఈ వెర్నోవా లో లక్షల(ఎల్ పి ఎ) ప్యాకేజీతో 'ఇంజనీర్' ఉద్యోగానికి ఎంపికైన ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ( ఈ ఈ ఈ ) విభాగపు ఐదుగురు (5) బి.టెక్ చివరి సంవత్సరం 7 వ సెమిస్టర్ విద్యార్థులను కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ ( కిట్స్ వరంగల్ ) గర్వంగా అభినందిస్తోంది. ఎంపికైన 2026-2027 విద్యా సంవత్సరం 7 సెమిస్టర్‌లో కోర్ ఇంజనీరింగ్ విద్యార్థులు: కొండ రిత్విక్, తుమ్మ మణి రిత్విక్, అనుమాండ్ల రుత్విక్ రెడ్డి, బొడ్డుల నీరజ్ మరియు అన్నందాస్ శ్రావణి అని ఫార్మర్ రాజ్యసభ, యం.పి., కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, చైర్మన్, కిట్స్ వరంగల్ వారు ఒక ప్రెస్ నోట్‌లో సగర్వంగా తెలిపారు. కిట్స్ వరంగల్ కోశాధికారి పి. నారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, రాబోయే రోజుల్లో కిట్స్ ప్రాంగణ నియామకాల నిర్వహణకు సాంకేతిక ప్రపంచ దిగ్గజ యమ్. యన్. సి. కంపెనీలు సంసిద్ధత వ్యక్తం, విద్యార్థినీ విద్యార్థుల కు సగర్వంగా హైలైట్ చేశారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లను నిర్వహించడానికి అనేక కంపెనీలు పైప్‌లైన్‌లో ఉన్నాయి అని తెలిపారు. ఈ సందర్భంగా డీన్, అకడమిక్ అఫైర్స్, ప్రొ. సూర నరసింహ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎల్లవేళలా తమ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నెమరు వేసుకుంటూ ఉద్యోగ సముపార్జన లో నిమగ్నము కావాలని కోరారు. కంపెనీ వారు వ్రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్ & ఇంటర్వ్యూ రౌండ్ లను విజయవంతంగా 3 దశలలో నిర్వహించారు. అధిక సి టి.సి తో ప్లేస్‌మెంట్‌లను పొందడానికి స్థిరమైన అభ్యాసం, అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యంఅని తెలిపారు. కిట్స్ కళాశాల యాజమాన్యం సభ్యులు, ఫార్మర్ రాజ్యసభ, యం.పి, కిట్స్ చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంతా రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి , హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే, వి. సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి, డీన్ ట్రైనింగ్ & ప్లేస్ మెంట్స్ ప్రొఫెసర్ వై. పురందర్, టి.పి.ఓ. డా. సి హెచ్. సతీష్ చంద్ర, డీన్, అకడమిక్ అఫైర్స్, ప్రొ. సూర నరసింహ రెడ్డి, ఈ ఈ ఈ విభాగాదిపతి, డాక్టర్ ఎం. నరసింహారావు, కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ ఇ. కిరణ్ కుమార్, ఈ ఈ ఈ విభాగ అకడమిక్ సమన్వయకర్త డాక్టర్ బి జగదీష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, వివిధ విభాగాల డీన్స్, విభాగాదిపతులు మరియు కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ పి. ఆర్.ఓ. డా.డి. ప్రభాకరా చారి, ఆప్టిట్యూడ్ ట్రైనర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్ పవన్, జి. ధనుష్, డి శరత్, పి. సింధూర, వివిధ విభాగాల హెడ్‌లు, అందరు డీన్‌లు, పలువురు బోధన, బోధనేతర సిబ్బంది ప్రతిష్ఠాత్మకమైన జి ఈ వెర్నోవా కంపెనీలో 11 లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో కోర్ ప్లేస్‌మెంట్ సాధించిన 5 విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# ఆదర్శలో విద్యార్థులకు మాక్ పోలింగ్

## స్కూల్ లీడర్‌తో పాటు పలు పదవులకు

## ఎన్నికలు..ప్రజాస్వామ్య విలువలపై అవగాహన




కాటారం డివిజన్ ప్రతినిధి, సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర): విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు జేయ శాంకర్ష భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై ప్రత్యక్ష అనుభవం కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులే అభ్యర్థులుగా, ఓటర్లుగా, పోలింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందిగా వివిధ పాత్రలను పోషించారు. పాఠశాల స్కూల్ లీడర్‌తో పాటు హౌస్ కేప్టెన్స్ , స్పోర్ట్స్ లీడర్ , పలు నాయకత్వ పదవులకు ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్ల గుర్తింపు, ఓటింగ్ విధానం, పోలింగ్ కేంద్రం నిర్వహణ, ఓటు నమోదు, ఈవీఎం వినియోగం, ఎన్నికల నియమ నిబంధనలు తదితర అంశాలను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ప్రత్యేకంగా ఈవీఎంలను ఏర్పాటు చేసి విద్యార్థులతో మాక్ ఓటింగ్ నిర్వహించడం ద్వారా ఎన్నికల ప్రక్రియపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్‌కు ముందు విద్యార్థులకు ఓటు హక్కు విలువ, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత, బాధ్యతాయుతమైన ఓటరు పాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. "మాక్ పోలింగ్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు, ఎన్నికల నిర్వహణపై పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ అవగాహన కలుగుతుంది. చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య విలువలను అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన ఓటర్లుగా ఎదిగేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

**- జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎ. వీరయ్య**


**- లోక్ అదాలత్ లో 3వేల 5వందల కేసులు పరిష్కారం**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల జిల్లాలో గల న్యాయస్థానంలలో శనివారం జాతీయ లోకాఅదాలత్ లో మూడు వేల ఐదు వందల కేసులు పరిష్కారం అయ్యాయని మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఎ. వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య మాట్లాడుతూ రాజీమార్గంతో ఇరు వర్గాలు వారి కేసుల నుంచి విముక్తి పొందారని పేర్కొన్నారు. రాజీమార్గమే రాజ మార్గమని, దేశ ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారం అన్ని రాష్ట్రాల్లో జిల్లా, తాలూకా స్థాయిలో రాష్ట్రం మొత్తంగా జాతీయ లోక్ అదాలత్ లను నిర్వహించడం జరిగిందని, అందులో భాగంగానే మన జిల్లా మొత్తంగా ఈ లోక్ అదాలత్ నిర్వహించామన్నారు. మొత్తం 9 లోక్ అదాలత్ బెంచ్ లను ఏర్పాటు చేశామని, ఈ లోకాదాలత్ వలన కక్షిదారులు సమయం వృధా కాకుండా అప్పిల్లేకుండా మరియు ఇరు వర్గాల వారు గెలిచినట్టుగా అంతిమ తీర్పుగా ఉంటుందని తెలిపారు, ఇందులో సివిల్ ధావాలు 32, క్రిమినల్ కేసులు 3300, ఇతర కేసులు, సైబర్ క్రైములు 2 లో రూ,. 17 వేలు బ్యాంక్ ప్రిలిటిగేషన్ కేసులు,16 లో రూ 9 లక్షల 84 వేలు మరియు ఇతర కేసులతో కలిపి మొత్తం 3 వేల 5 వందల కేసులు పరిష్కరించామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జిల్లా న్యాయ సేవా సంస్థ జి.కవిత,ఏ. నిర్మల, సీనియర్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య, సభ్యులు, పోలీసులు, లైసాన్ అధికారి సిహెచ్. వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# లెనిన్ నగర్‌లో రూ.54 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**- కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 12 (విజన్ ఆంధ్ర బ్యూరో): రోడా మేస్త్రి నగర్ నగర్ డివిజన్ పరిధిలోని లెనిన్ నగర్‌లో రూ.54 లక్షలతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ,గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రజల మౌలిక అవసరాలను పట్టించుకోకపోవడంతో పాటు, సరైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల మౌలిక అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయని అన్నారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు జరుగుతోందని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయడంలో సహకరించిన జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు కి కూన శ్రీశైలం గౌడ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, రషీద్ బెగ్, డివిజన్ అధ్యక్షులు మధుసూదన్ మరియు రాజి రెడ్డి, రవీందర్ రెడ్డి, రామ్ నర్సయ్య, సలీం, సాయిలు,రజాక్, నాగరాజ, రవి చారి, ఆది నారాయణ, ఉప్పల రవి, వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి...

**- పెండింగ్ నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిలిపెట్టాలి..**

**- రోజువారీ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలి**

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా ( విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (SIR) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తులు, ఫారాల డిస్పోజల్‌లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు రోజువారీ కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు.శనివారం తహసీల్దార్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు సంబంధిత అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ా×= ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల డెలివరీ, హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారం, ఫారాల డిస్పోజల్ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆదిలాబాద్ అర్బన్ మండలంలో ఏఈఆర్వో పరిధిలో సుమారు 26 వేల నోటీసులు డెలివరీకి పెండింగ్‌లో ఉండగా, ఇప్పటివరకు సుమారు 600 హియరింగ్‌లు మాత్రమే పూర్తికావడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ నోటీసుల డెలివరీతో పాటు హియరింగ్‌లు, దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. బోథ్ మండలంతో పాటు నియోజకవర్గంలోని ఇతర మండలాల్లోనూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ా×= ప్రక్రియకు నవంబర్ 5వ తేదీ తుది గడువు ఉన్నందున, అందుబాటులో ఉన్న పనిదినాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రతి రోజూ కనీసం 900 నోటీసులు, దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసేలా మండలాల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. రోజువారీ పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత ఓటర్లకు వంద శాతం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నోటీసుల డెలివరీ అనంతరం హియరింగ్‌లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సంబంధిత ఫారాలను వెంటనే డిస్పోజ్ చేయాలని సూచించారు.ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఫస్ట్ డాక్యుమెంట్, సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు 1987కు ముందు, 2002కు ముందు, 2004 తర్వాత కాలానికి సంబంధించిన పత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన పత్రాలను నిబంధనల మేరకు రిటర్నింగ్ అధికారికి పంపాలని, పత్రాల పరిశీలనలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం-6, తొలగింపులు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారం-7, సవరణలకు సంబంధించిన ఫారం-8 దరఖాస్తులు క్షేత్రస్థాయి నుంచి సంబంధిత కార్యాలయాలకు సకాలంలో చేరేలా బీఎల్‌వోలు, ఏఈఆర్వోలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా రూపకల్పన అత్యంత కీలకమైన ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హులైన పేర్లను నిబంధనల ప్రకారం తొలగించేలా పారదర్శకంగా చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, నిర్దేశిత లక్ష్యాలను ప్రతిరోజూ సాధిస్తూ ా×= ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ జూమ్ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడి నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- మండప నిర్వహకులు నిబంధనలు పాటించాలి
- మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి..
- డీజేలు,మద్యం,జూదానికి దూరంగా ఉండాలి
- ప్రజా రవాణా,అత్యవసర సేవలకు ఆటంకం కలిగించొద్దు..
- రాచెరువు,చెంగిచెర్ల చింతల చెరువు వద్ద నిమజ్జన కొలనులు
- మేడిపల్లి పోలీస్ ఇన్స్పెక్టర్ డి.జలంధర్‌రెడ్డి




బోడుప్పల్, సెప్టెంబరు 12(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలు,నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మేడిపల్లి సీఐ డి.జలంధర్‌రెడ్డి తెలిపారు. బోడుప్పల్ రాచెరువు, చెంగిచెర్ల చింతల చెరువు వద్ద చిన్న విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేక నిమజ్జన కొలనులు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.మండపాల నిర్వాహకులు ముందుగా పోలీస్‌శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుని, సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు అందజేయాలని సూచించారు. మండపాల ఏర్పాటుతో ప్రజా రవాణా, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.(ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలూ వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూడాలని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**భద్రతే ప్రధాన లక్ష్యం.....**

ప్రజా రవాణా, అత్యవసర వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అనుమతులు పొందిన తర్వాతే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, 24 గంటలూ నలుగురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు.అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీటి డ్రమ్ములు, ఇసుక సిద్ధంగా ఉంచాలన్నారు.

**డీజేలకు నో.....**

మండపాలు, శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని సీఐ స్పష్టం చేశారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాలు, వృద్ధులు, చిన్నారులకు ఇబ్బంది కలగకుండా పోలీసుల అనుమతితో పరిమిత స్థాయిలో చిన్న స్పీకర్లు మాత్రమే వినియోగించాలని సూచించారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం ఆడటం, అసభ్యకర కార్యక్రమాలు నిర్వహించడం, ఇతరుల మనోభావాలను కించపరిచేలా ప్రసంగాలు, పాటలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం నిషేధమని హెచ్చరించారు.

**శోభాయాత్రలో క్రమశిక్షణ తప్పనిసరి**

నిమజ్జన శోభాయాత్రను మధ్యాహ్నం నుంచే ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కోరారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఇతరులపై రంగులు చల్లడం, అభ్యంతరకర నినాదాలు చేయడం, టపాసులు పేల్చడం వంటివి చేయరాదన్నారు. శోభాయాత్ర వాహనాలు మంచి స్థితిలో ఉండడంతో పాటు డ్రైవర్‌కు లైసెన్స్, వాహనానికి అన్ని పత్రాలు ఉండాలని సూచించారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అనుమానాస్పద వస్తువులపై అప్రమత్తం**

మండపాల వద్ద అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్100కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, సందేహాలుంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని, వారిని ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసుకోవాలని, పోలీసులు నిర్వహించే తనిఖీలకు నిర్వాహకులు సహకరించాలని కోరారు.

## మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసిన నాయకులు



మల్కాజిగిరి, సెప్టెంబర్ 12,(విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం 185 వినాయక్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను ఏర్పాటు చేసి పర్యావరణ రహితంగా వినాయక చవితిని జరుపుకోవాలని సూచించారు. ఆ విగ్రహాలను నవరాత్రులు పూజించి అనంతరం చెరువులలో నిమజ్జనం చేయాలని వారు కోరారు. మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బద్దం పరశురామ్ రెడ్డి సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ ఫరీద్, అబ్దుల్ కరీం, అంజయ్య , ఎం.ఆర్. శ్రీను, బాలకృష్ణ గుప్తా, ప్రభాకర్ రెడ్డి, ఉమేష్, వెంకటేష్, యూ సాయి, పేపర్ శ్రీను, శ్రీని వాస్ గౌడ్, లావణ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

# దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి.. విష జ్వరాలతో విలవిల!

ప్రజారోగ్యంతో చెలగాటం వద్దు....

బోడుప్పల్‌లో పడకేసిన పారిశుధ్యం..అధికారుల జాడ ఎక్కడ...?

డంపింగ్ యార్డు కారణమా..?

నిధులు ఖర్చవుతున్నా పరిశుభ్రత ఏదీ..
తక్షణ చర్యలకు ప్రజల డిమాండ్...



బోడుప్పల్,సెప్టెంబర్ 12(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మెరుగైన పరిపాలన అందించాల్సిన అధికారులే పారిశుధ్య సమస్యలపై పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం నిధులు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు ఉన్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిశుభ్రత కానరావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజారోగ్యానికి సంబంధించిన



హాస్పిటల్ చికిత్స పత్రాలు చూపిస్తున్న కాలనీవాసులు

సమస్యపై ఇకనైనా సర్కిల్ పారిశుధ్య అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాలని, డంపింగ్ యార్డు సమస్యకు తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

**డంపింగ్ యార్డుతో దుర్వాసన...**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన తీవ్రంగా వస్తోందని పరిసర కాలనీల ప్రజలు చెబుతున్నారు. గాలి వీచినప్పుడల్లా చెత్త దుర్వాసన కాలనీల్లోకి వ్యాపిస్తోందని, ఇళ్లలో తలుపులు, కిటికీలు మూసుకున్నా వాసన నుంచి ఉపశమనం ఉండటం లేదని వాపోతున్నారు.దేవేందర్‌నగర్ ఫేజ్2,గౌతమ్‌నగర్, అంబేద్కర్‌నగర్ ఫేజ్3,రాజీవ్ నగర్, సాయినగర్ తదితర కాలనీల్లో పరిస్థితి తీవ్రంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. చెత్తతో పాటు దోమలు, ఈగల బెడద పెరగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**జ్వరాలతో ప్రజల అవస్థలు....**

డంపింగ్ యార్డు పరిసరాల్లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారడంతో ప్రజల్లో ఆరోగ్యంపై ఆందోళన నెలకొంది. కాలనీల్లో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని పేర్కొంటున్నారు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాం. ఆసుపత్రికి వెళ్తే చెత్తాచెదారం, అపరిశుభ్ర వాతావరణం కారణంగా రోగాలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదు. డంపింగ్ యార్డు చుట్టూ దుర్వాసన, దోమలు, ఈగల బెడద తీవ్రంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించి, ఫాగింగ్ నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఫాగింగ్ మిషన్లు ఎక్కడ?**

దోమల బెడద పెరుగుతున్నా కాలనీల్లో ఫాగింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఫాగింగ్ మిషన్లు ఎక్కడ? ఏయే కాలనీల్లో ఎప్పుడు పిచికారీ చేస్తున్నారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్‌తో పాటు యాంటీ లార్వా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**పారిశుధ్య అధికారులు జాడెక్కడ?**

సర్కిల్ పరిధిలో చెత్త కుప్పలు, దుర్వాసన, దోమల బెడద నెలకొన్నప్పటికీ సంబంధిత పారిశుధ్య అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలిస్తున్నారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోజువారీ చెత్త తొలగింపు, కాలువల శుభ్రత, ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలను పర్యవేక్షించాల్సిన అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియడం లేదని విమర్శిస్తున్నారు.

**నిధులు ఖర్చు.. పరిశుభ్రత మాయం.....**

పారిశుధ్య నిర్వహణ కోసం నిధులు కేటాయించి ఖర్చు చేస్తున్నప్పటికీ దానికి తగ్గ ఫలితం కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిధులు ఖర్చవుతున్నప్పుడు పరిశుభ్రత మాత్రం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన పనులు, ఖర్చులు, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలపై అధికారులు పారదర్శకంగా వివరాలు వెల్లడించాలని కోరుతున్నారు.

**కాంట్రాక్టు పనులపైనే దృష్టా?**

ప్రజల కనీస అవసరాలు తీర్చడంపై దృష్టి పెట్టాల్సిన పరిపాలన అధికారులు కాంట్రాక్టు పనుల వైపు మొగ్గుచూపుతున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రజారోగ్యానికి ముప్పు తెచ్చే అపరిశుభ్రతను తొలగించేందుకు అవసరమైన చర్యలు మాత్రం సక్రమంగా కనిపించడం లేదని అంటున్నారు. అయితే కాంట్రాక్టు పనుల విషయంలో ఎలాంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలకు ఆధారాలు ఉంటే అధికారులు వాటిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన పారిశుధ్య పనులకు మాత్రం ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

**పచ్చని కాలనీలు.. చెత్తకు నిలయాలు**

ఒకప్పుడు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో కళకళలాడిన కాలనీలు ప్రస్తుతం డంపింగ్ యార్డు, చెత్త కుప్పలతో అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారు ప్రధాన వీధుల్లోనూ చెత్త కుప్పలు దర్శనమిస్తూ ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయని చెబుతున్నారు. రహదారుల వెంట చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన రావడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని అంటున్నారు.

**ఇంటింటా ఆరోగ్య సర్వే చేయాలి**

పరిసర కాలనీల్లో జ్వరాలు, అనారోగ్య సమస్యలపై వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటా సర్వే నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.జ్వరాలకు డంపింగ్ యార్డే ప్రత్యక్ష కారణమని నిర్ధారించాలంటే వైద్యపరమైన అధ్యయనం అవసరం. అయితే పారిశుధ్య లోపాలు, దోమలు, ఈగల వ్యాప్తిని అరికట్టడం మాత్రం అధికారుల తక్షణ బాధ్యత అని ప్రజలు పేర్కొంటున్నారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలి**

డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, దుర్వాసన నియంత్రణ చర్యలు చేపట్టాలని, కాలనీల్లో నిరంతర ఫాగింగ్, యాంటీ లార్వా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన వీధుల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు.

# బొజ్జ గణపయ్యలు పూజకు సిద్ధం..

- సగనికి పైగా బుకింగ్ అయిన గణపతి ప్రతిమలు..
- సందడిగా మరిన గణపతి ప్రతిమల విక్రయ కేంద్రాలు..
- సామాన్య ప్రజలకు అందుబాటులో ప్రతిమల ధరలు



నిజామాబాద్ సెప్టెంబర్ 11:(విజన్ ఆంధ్ర )గణపయ్య కు తొలిపూజలు అందకునే ప్రతిమలు జిల్లా కేంద్రంలో విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. వారం రోజుల ముందే గణపతి ప్రతిమలు జిల్లా నలుములల నుంచి మండపాల నిర్వహకులు వచ్చి గణపతి ప్రతిమలు బుకింగ్ చేసుకుంటున్నారు. ఇంకొంత మంది గణపయ్యలను టాక్టర్, ఆటోల సహాయంతో మండపాలకు తరలిస్తున్నారు. జిల్లా కేంద్రంలో కంటేశ్వర్, పెద్ద బజార్, వినాయక్ నగర్, ఆర్యనగర్,గాయత్రి నగర్ ప్రాంతాల్లో గణపతి ప్రతిమలు విక్రయిస్తున్నారు. గణపయ్య ప్రతిమల బుకింగ్ కొసం దానికి సంబందించిన మండపాల నిర్వహకులు విక్రయదారులకు రూ4వేల నుంచి 5వేల వరకు ఇచ్చి ముందుగ తమకు నచ్చిన గణపయ్య పతిమలను బుకింగ్ చేసుకుంటున్నారు.

***సందడిగా మరిన గణపతి ప్రతిమల విక్రయ కేంద్రాలు***

వారం రోజుల ముందే గణపతి మండపాల నిర్వహకులు గణపయ్య పతిమలు బుకింగ్ తోజిల్లాలో పటు ప్రాంతాలన్ని సందడిగా మారాయి. గతంలో గణపతి చవితి రెండు రోజుల మందు ఉండే సందడి ముందు నుంచే కనబడుతుంది. అలాగే యుత్ సైతం మండపాల ఏర్పాట్లు సైతం పది రోజుల ముందే అన్ని ప్రాంతాల్లో చేసుకున్నారు. సామాన్య ప్రజలకు గణపతి ప్రతిమలు ఈ సంవత్సరం సామాన్యులకు అందుబాటులో సరసమైన ధరలకు వివిధ రకాల గణపయ్యల ప్రతిమలు అందుబాటులో ఉన్నాయని కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు గణపతి పెద్ద ప్రతిమలు రూ2వేల నుంచి 30వేల వరకు పలుకుతున్నాయి. మట్టి గణపతుల ప్రతిమలు సైతం నగరంలో విక్రయానికి ఉంచారు. జిల్లా కేంద్రంలో సందడి చూసై గణపతి చవితి పండుగా నేడుగా అనిపిస్తుంది.

వాయిస్‌లు..

***ఈ సంవత్సరం ప్రతిమ అమ్మకాలు పరువాలేదు..***
***కే. శివ గణపతి విక్రయ దారుడు జిల్లా కేంద్రం..***

ప్రతి సంవత్సరం గణపతి ప్రతిమలు పండుగ రెండు రోజు ఉందనే ముందు సందడి మొదటు అయ్యేది. కాని ఈ సంవత్సరం పది రోజుల మందే గణపతి ప్రతిమల విక్రయాలు జరుగుతున్నాయి. గణపతిమండపాల నిర్వహకులు గణపయ్యలను తీసుకువెళ్ళున్నారు. ఇంకా పండుగ వారం రోజులు ఉంది కనుక ప్రతిమలు అన్ని విక్రయిస్తమని నమ్మకం నాకుంది.

***ప్రతి సంవత్సరం జిల్లా గణపతి ప్రతిమలు విక్రయిస్తాను..***
***అరుణ్ .. రాజస్థాన్***

గత పది సంవత్సరాలుగా జిల్లా కేంద్రంలో గణపతి ప్రతిమలను తయారు చేసి విక్రయిస్తున్నాను. భగవంతు నా కుటుంభపై తన ఆశిర్వాదం ఉంచుతున్నాడు. ఈ సంవత్సరం గణపయ్య ప్రతిమల అమ్మకాలు బాగానే ఉన్నాయి. ఇప్పడికే సగానికి పైగా బుకింగ అయ్యాయి.
గణపతి ప్రతిమల రేట్లు సామాన్యాలకు అందుబాటులో ఉన్నాయి,

***నాందేడ్ రాజు డిచ్‌పల్లి***
***మండపం నిర్వహకుడు..***

ప్రతి సంవత్సరం కన్న ఈ సంవత్సరం గణపతి ప్రతిమలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఎక్కువ రేట్లతో మండపాల నిర్వహకులు ఇబ్బందిపడేవారు. కాని ఈ సారి ప్రతిమలు ఎక్కువ మొత్తంలో ఉండి వివిధ రకాల్లో సైతం అందుబాటు లో ఉంచామని తెలిపారు.

# గణనాథుని రాకతో కల్వకుర్తిలో భక్తి పారవశ్యం

- మట్టి గణపతుల పంపిణీకి విశేష స్పందన

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 12: విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు, తొలి పూజ అందుకునే గణనాథుడు కొలువుదీరేందుకు సిద్ధమవుతున్నాడు. ఏ పని ప్రారంభించినా ముందుగా వినాయకుడిని స్మరిస్తే ఆ కార్యం నిర్విఘ్నంగా పూర్తవుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. చదువు, వ్యాపారం, వివాహం.. ఏ శుభకార్యమైనా ఆ గజాననుడి ఆశీస్సులతోనే మొదలవుతుంది. అందుకే వినాయక చవితి అంటే కేవలం పండుగ కాదు, కోట్లాది భక్తులకు ఒక విశ్వాసం, సంబరం. అయితే ఆ భక్తిని చాటుకునే క్రమంలో మనం పర్యావరణాన్ని మర్చిపోతున్నామా? ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయన రంగులతో తయారు చేసిన భారీ విగ్రహాలు నీటిలో కరగక, చెరువులను, కుంటలను విషమయం చేస్తున్నాయి. నిమజ్జనం తర్వాత ఆ వ్యర్థాలు నీటిని కలుషితం



మట్టి గణపతులను అందిస్తున్న ఫైనాన్స్ ఉద్యోగులు....

చేసి జలచరాల మనుగడకే ప్రమాదంగా మారుతున్నాయి. దీనికి పరిష్కారమే మట్టి గణపతి. మట్టితో చేసిన వినాయకుడిని పూజించడం వల్ల ఆధ్యాత్మికంగా, పర్యావరణ పరంగా ఎన్నో లాభాలు ఉన్నాయి. మట్టి గణపతి నీటిలో వెంటనే కరిగి తిరిగి ప్రకృతిలో కలిసిపోతుంది. ఇది నీటి కాలుష్యాన్ని నివారిస్తుంది. మట్టి గణపతిని పూజించడం అంటే పంచభూతాలలో ఒకటైన భూమిని గౌరవించడమే. మన పూర్వీకులు చెప్పిన సంప్రదాయం కూడా ఇదే. మట్టి గణపతి ఆరాధన వల్ల ఇంట్లో స్వచ్ఛత, ప్రశాంతత వెల్లివిరుస్తుందని, పర్యావరణాన్ని కాపాడిన పుణ్యం దక్కుతుందని పండితులు చెబుతున్నారు. ఈ ఆలోచనతోనే కల్వకుర్తి



మట్టి గణపతి లను కాలనీవాసులకు అందిస్తున్న కౌన్సిలర్...

పట్టణంలో మట్టి గణపతుల ఉచిత పంపిణీ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా 14వ వార్డుకు చెందిన కౌన్సిలర్ మంజుల మధు తన వార్డు పరిధిలోని కాలనీ వాసులకు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే మహబూబ్ నగర్ చౌరస్తాలో ముత్తూట్ ఫిన్‌కార్ప్ యాజమాన్యం ఆధ్వర్యంలో భక్తులకు మట్టి గణపతులను అందజేశారు. భక్తితో పాటు బాధ్యత కూడా చూపాలని, ఈ ఏడాది ప్రతి ఇంట్లో మట్టి గణపతినే పూజించాలని నిర్వాహకులు కోరుతున్నారు.



మట్టి గణపతి...

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.